www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 322
బుధవారం | 28-1-2026 | పేజీలు: 14
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: దశమి సా.4:36 తదుపరి ఏకాదశి, నక్షత్రం: కృత్తిక ఉ.9:27 తదుపరి రోహిణి, వర్జ్యం: రా.12.10-1.38, దుర్ముహూర్తం: ఉ.12.05-12.50, అమృతఘడియలు: ఉ.7.13-8.42, తె. 4.35-6.03, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.51, సూర్యాస్తమయం: 6.04
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్, ఈయూ భారీ డీల్

స్వేచ్ఛా వాణిజ్యం సహా 13 ఒప్పందాలు ఖరారు

అమెరికా ఆంక్షల నేపథ్యంలో మన ఉత్పత్తులకు భారీ మార్కెట్

భారత్‌లో యూరప్ లగ్జరీ కార్ల ధరలు భారీగా తగ్గే అవకాశం

రక్షణ రంగంలోనూ సహకారం

ప్రపంచంలో నెలకొన్న అనిశ్చితికి ఈ ఒప్పందంతో చెక్: మోదీ

ప్రపంచానికి బలమైన సందేశం: ఉర్సులా వాన్

2



యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులాతో ప్రధాని మోదీ

మరో సూపర్ ఆఫర్!

జల్ జీవన్ మిషన్ కింద ఏపీకి 13 వేల కోట్లు

వైసీపీ హయాంలో ఆగిపోయిన స్కీమ్ నిధులు

నాడు 27,248 కోట్లు మంజూరు చేసిన కేంద్రం


కానీ రాష్ట్రం వాటా చెల్లించని జగన్ ప్రభుత్వం

దీంతో రూ. 4,235 కోట్లు మాత్రమే వినియోగం

అలా ఆగిన సుమారు 23 వేల కోట్లలో కేంద్రం వాటా 13 వేల కోట్లు

వాటి మంజూరుకు మోదీ సర్కారు సమ్మతి

వచ్చే మూడేళ్లలో ప్రతి ఇంటికీ కుళాయి లక్ష్యం



అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏపీకి మరో బంపర్ ఆఫర్ లభించింది. వచ్చే మూడేళ్లలో ప్రతి ఇంటికీ సురక్షిత కుళాయి నీటిని అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి భరోసా ఇస్తూ, జల్‌జీవన్ మిషన్ కింద గతంలో ఆగిన సుమారు రూ.23వేల కోట్లను కేంద్రం మంజూరు చేయనుంది. ఇందులో సుమారు రూ.13 వేల కోట్ల దాకా రాష్ట్రానికి కేంద్ర వాటాగా లభించనున్నాయి. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాల నుంచి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ, జలవనరుల శాఖకు మరో రూ.10 వేల కోట్లు ఇవ్వనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. ఇప్పుడు జల్‌జీవన్ మిషన్ నిధులు మరో రూ.13 వేల కోట్లు రానుండటంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. వైసీపీ హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద కేంద్రం రూ.27,248 కోట్లు మంజూరుచేసింది. అయితే, రాష్ట్ర వాటా చెల్లించకపోవడంతో కేవలం రూ.4,235 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంది. సుమారు రూ.23 వేల కోట్లు వినియోగించుకోలేకపోయింది. ఈ పథకం కింద

మిగతా 14వ పేజీలో...

సీమ పంట పండింది!

ప్రపంచంలోనే అతి పెద్ద ఉద్యాన క్లస్టర్‌గా రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలు: సీఎం

500 లక్షల టన్నుల ఉద్యాన ఉత్పత్తులే లక్ష్యం

ఇందుకోసం ఆయా జిల్లాల్లో 20కి పైగా పెండింగ్ నీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి

ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు 'డీపీ వరల్డ్' రెడీ

జగన్ పడగొట్టిన పథకాలను నిలబెడదాం

ప్రాధాన్య ప్రాతిపదికన పూర్తిచేద్దాం

వెలిగొండ పథకాన్ని ఈ ఏడాదే పూర్తిచేయాలి

కొట్టుకుపోయిన 'అన్నమయ్య' పునర్నిర్మాణం

గాలేరు-నగరి ద్వారా కడప, కోడూరు వరకు నీళ్లు

గ్రామీణ రోడ్లు, లాజిస్టిక్స్ అభివృద్ధిపై దృష్టి

ఆర్థిక, జలవనరులు, వ్యవసాయం, ఆర్‌అండ్‌బీ, పోర్టుల శాఖలతో సమీక్ష

14

ఉద్యాన సాగుకూ పీపీపీ.. డీపీఆర్‌కు ఆదేశం

డబ్బుతోనే రాజకీయం చేయలేం

ప్రజలకు మనపై నమ్మకం ఉండాలి: సీఎం



పొలిటికల్ గవర్నెన్స్‌లో పార్లమెంటరీ కమిటీలు కీలకం

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వాటితో సమన్వయం చేసుకోవాలి

13

పార్టీ కంటే ఎవరూ ముఖ్యం కాదు

నిర్లక్ష్యంగా ఉంటే ఎవరైనా పక్కకే

క్యాడర్‌ను ఎవరూ విస్మరించకూడదు

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

మనం చేసింది చెప్పుకోవాలి: బాబు

కూటమికి విడాకుల్లేవు!



అభివృద్ధి, సంక్షేమానికి బాబు బ్రాండ్ అంబాసిడర్

కల్తీ నెయ్యి, కోడికత్తి, కల్తీ మద్యానికేమో టీమ్-11

కలిసికట్టుగా ముందుకెళ్లాలి: లోకేశ్

చిన్న చిన్న సమస్యలుంటాయ్.. కలిసి పరిష్కరించుకుందాం

విభేదాల సృష్టికి వైసీపీ ప్రయత్నం

మనం అప్రమత్తంగా ఉండాలి

కాలానుగుణంగా పార్టీలో మార్పులు

గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్‌బ్యూరో వరకు ఎదగాలి.. వర్క్‌షాపులో లోకేశ్



ఇక దేశీయ వాణిజ్య విమానాలు

భారత్‌లో తయారీకి కీలక ఒప్పందం

9

అదానీ ఏరోస్పేస్, బ్రెజిల్ సంస్థ ఎంబ్రాయర్ మధ్య ఎంవోయూ

వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

భోగాపురం లేదా గుజరాత్‌లో తయారీ యూనిట్!

APPSC

12

గ్రూప్-2 ఫలితాలు నేడే

ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం

903 మంది అభ్యర్థులతో జాబితా విడుదలకు కసరత్తు

కేసుల నేపథ్యంలో రెండు పోస్టులు మాత్రం పెండింగ్

జాప్యంపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో స్పందన

సమ్మక్క-సారలమ్మ జాతర నేటి నుంచే

4 రోజులపాటు ఉత్సవాలు

నేడు కన్నెపల్లి నుంచి గద్దెలపైకి సారలమ్మ

12

ఈసారి 3 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా

నేటి నుంచి హైదరాబాద్‌లో ఏవియేషన్ షో

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్), హైదరాబాద్ సిటీ: రెండేళ్లకోసారి నిర్వహించే విమానాల పండుగ హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం వేదికగా బుధవారం నుంచి ప్రారంభంకానుంది. 'వింగ్స్ ఇండియా 2026' పేరుతో 4 రోజులు జరగనున్న ఈ మెగా ప్రదర్శనను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు ప్రారంభించనున్నారు. దేశ, అంతర్జాతీయ విమాన రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు ఇందులో పాలుపంచుకోనున్నాయి. పలు దేశాలకు చెందిన మంత్రుల స్థాయి బృందాలు, సీనియర్ ప్రభుత్వ అధికారులు సైతం హాజరు కానున్నారు. మన దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా వాటి వైమానిక రంగ అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధిని ప్రదర్శించనున్నాయి. అంతర్జాతీయ ఎగ్జిబిషన్, విమానాలు, హెలీకాప్టర్ల ప్రదర్శనతో పాటు భారత వైమానిక దళానికి చెందిన సూర్య కిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శన, ఫ్లైయింగ్ అండ్ ఏరోబాటిక్ షోలు జరగనున్నాయి.

'నిఫా' కలకలం.. ఆసియా దేశాలు అప్రమత్తం

న్యూఢిల్లీ, జనవరి 27: భారత్‌లో ఇటీవల నిఫా వైరస్ కేసులు బయటపడడం ఆసియా దేశాల్లో కలకలం రేపుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని ఓ ఆస్పత్రిలో ఐదుగురు ఆరోగ్య సిబ్బంది నిఫా వైరస్ బారినపడినట్టు ఇటీవల నిర్ధారణ అయింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీంతో వారిని కలిసిన 110 మందిని క్వారంటైన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో కొన్ని ఆసియా దేశాలు అప్రమత్తమై నిబంధనలను కఠినతరం చేశాయి. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చే ప్రయాణికులను థాయ్‌లాండ్‌లోని 3ఎయిర్‌పోర్టుల్లో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నేపాల్ కూడా ఖాట్మండు విమానాశ్రయంతోపాటు భూ సరిహద్దుల ద్వారా తమ దేశంలోకి ప్రవేశిస్తున్న వారిని స్క్రీనింగ్ చేస్తోంది. జంతువుల నుంచి మనుషులకు సోకే నిఫా వైరస్ కు చికిత్సకు వ్యాక్సిన్, మందులు లేవు కాబట్టి మరణాల రేటు అధికంగా ఉంటుంది.

యాసిడ్ దాడి నిందితుల ఆస్తులన్నీ ఎందుకు వేలం వేయకూడదు? : సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 27: యాసిడ్ దాడుల కేసులకు సంబంధించి మంగళవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. యాసిడ్ దాడికి పాల్పడ్డ నిందితుల ఆస్తులన్నింటినీ వేలం వేసి, ఆ సొమ్మును బాధితులకు పరిహారంగా ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించింది. యాసిడ్ దాడి బాధితురాలు, బ్రేవ్ సోల్స్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన 'పిల్'పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. బాధితులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.3 లక్షల పరిహారం దీర్ఘకాలిక చికిత్సకు, పునరావాసానికి ఏమాత్రం సరిపోదని తెలిపింది. 'ఇలాంటి క్రూర నేరాలకు పాల్పడేవారికి అసాధారణ రీతిలో బాధ కలిగించే శిక్ష విధించాల్సి ఉంద'ని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. వరకట్నం హత్య కేసుల తరహాలో వీటిని చూడాల్సి ఉందని తెలిపారు. అన్ని యాసిడ్ దాడుల కేసుల వివరాలను 4వారాల్లో సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టు సహా అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సమాచారాన్ని కూడా ఇవ్వాలని తెలిపింది. నిందితులకు కఠిన శిక్షలు పడేలా అవసరమైతే చట్టంలో సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

వందేమాతరానికీ లేచి నిలబడాల్సిందే!

న్యూఢిల్లీ, జనవరి 27: జాతీయ గీతం జనగణమన.. వినిపించినప్పుడు ఎక్కడ ఏ పనిలో ఉన్నా మనం లేచి నిలబడతాం. దేశానికి చూపే గౌరవంగా దీనిని భావిస్తాం. అలాగే, చట్ట రీత్యా అది తప్పనిసరి కూడా. అయితే, అదే గౌరవం జాతీయ గేయం వందేమాతరం విషయంలో పాటించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ విషయంలో ప్రొటోకాల్ మర్యాదను తప్పనిసరి చేస్తూ కొత్త చట్టం తీసుకువచ్చే యోచన చేస్తున్నట్టు తెలిసింది. ఈ గేయ రచనకు గత ఏడాదితో 150 సంవత్సరాలు నిండాయి. ఈ నేపథ్యంలో వందేమాతరానికి రాజ్యాంగబద్ధ గౌరవం కల్పించేందుకు కేంద్ర హోంశాఖ కసరత్తు చేస్తున్నట్టు ఓ జాతీయ మీడియా కథనం ప్రసారం చేసింది.

భారత్, ఈయూ భారీ డీల్!



ఈయూ, భారత్‌ల మధ్య చేసుకుంటున్న ఒప్పంద దృశ్యం; చిత్రంలో ప్రధాని మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా

న్యూఢిల్లీ, జనవరి 27: ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచం అల్లకల్లోలం అవుతున్న వేళ.. భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. వాణిజ్యం కోసం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, ఇతర మార్కెట్లను అందిపుచ్చుకోవడం దిశగా భారత్ కీలక ముందడుగు వేసింది. యూరప్ దేశాలకు ఎగుమతి చేసే చాలా రకాల ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా తొలగిపోనున్నాయి. దీనితో భారత వ్యాపారులు, ఎగుమతిదారులకు ప్రయోజనం కలగనుంది. యూరప్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే కార్లు, వైన్స్, అత్యవసర ఔషధాలు వంటి వాటి ధరలు తగ్గనున్నాయి. మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో 16వ భారత్-ఈయూ శిఖరాగ్ర సమావేశం జరిగింది. దానికి ముందు ప్రధాని మోదీ ఈ ఒప్పందంపై ప్రకటన చేశారు. "నిన్న ఈయూ, భారత్ మధ్య భారీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించొచ్చు. భారత్, ఈయూ ఉమ్మడి జీడీపీ ప్రపంచ జీడీపీలో 25శాతం. ఇది ప్రపంచ వాణిజ్యంలో మూడో వంతుతో సమానం" అని మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన 27 దేశాల్లో ఈ ఒప్పందంపై చట్టాలు చేసిన తర్వాత పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఇందుకోసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, భారత్-ఈయూ సదస్సులో భాగంగా యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టాలతో ప్రధాని మోదీ భేటీ అయి.. వాణిజ్యంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతోపాటు మొత్తం 13 అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వచ్చే ఐదేళ్లకు ఉమ్మడి వ్యూహాత్మక ఎజెండాను ఆమోదించారు. అనంతరం ముగ్గురూ ఉమ్మడిగా మీడియాతో మాట్లాడారు. 2030 నాటికి భారత్, ఈయూ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, డిజటల్ కనెక్టివిటీ బలోపేతం చేసేందుకు.. ఉమ్మడి సమగ్ర, వ్యూహాత్మక ఎజెండాను అనుసరించాలని భేటీలో నిర్ణయించారు. నైపుణ్యమున్న ఉద్యోగులకు తలుపులు బార్లా తెరిచేందుకు వీలుగా ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని నిర్ణయించారు. ఇది యూరప్ దేశాల్లో భారత యువత ఉద్యోగాలు, విద్య, పరిశోధన రంగాల్లో మంచి అవకాశాలు పొందేందుకు తోడ్పడనుంది. ఇక విపత్తుల నిర్వహణ, భారత రిజర్వు బ్యాంకు- ఈఎస్ఎంఏ (యూరోపియన్ సెక్యూరిటీస్, మార్కెట్స్ అథారిటీ) సహకారం, శాస్త్ర సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం పొడిగింపు, గ్రీన్ హైడ్రోజన్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, రహస్య సమాచారం పరస్పర మార్పిడి ఒప్పందంపై చర్చలు చేపట్టడంపైనా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఈయూ-భారత్ దోస్తీ ఘనమే!

మొత్తంగా జనాభా.. సుమారు 190 కోట్లు	
ప్రపంచ జనాభాలో శాతం.. 30%	
ప్రపంచ జీడీపీలో శాతం.. 25%	
ప్రపంచ వాణిజ్యంలో శాతం.. 33%	
భారత్-ఈయూ మధ్య వాణిజ్యం	
ప్రస్తుతం - రూ.12.4 లక్షల కోట్లు..	
ఐదేళ్లలో లక్ష్యం - రూ. 19.7 లక్షల కోట్లు	

అమెరికా, చైనా దూకుడుకు అడ్డుకట్ట!

ఒకవైపు ట్రంప్ టారిఫ్‌ల దూకుడు, మరోవైపు చైనా ఆధిపత్యం, కీలక ఉత్పత్తుల సరఫరాతో నియంత్రణలతో ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈయూ-భారత్ ఒప్పందంతో అటు అమెరికా దూకుడుకు అడ్డుకట్ట వేయడం, ఇటు చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడం సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రీన్‌లాండ్ అంశంలో ట్రంప్ వ్యవహార శైలి, అమెరికా లేకుంటే యూరప్‌ను ఎవరూ పట్టించుకోబోరన్న వ్యాఖ్యలు, టారిఫ్ విధిస్తానంటూ బెదిరించడంతో.. యూరోపియన్ యూనియన్ ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో భారత్‌తో ఒప్పందంపై చర్చలను వేగవంతం చేసింది. మరోవైపు భారత్‌పై తొలుత 25శాతం సుంకాలు వేసిన ట్రంప్.. రష్యా చమురు కొంటున్నారంటూ 50శాతానికి పెంచడంతో సమస్య తలెత్తింది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టిపెట్టిన భారత్.. ఈయూతో ఒప్పందంపై వేగంగా ముందుకెళ్లింది.

తెలుగు రాష్ట్రాల్లో ఏ రంగాలకు లాభం?

ఈయూతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు రంగాలకు ప్రయోజనం దక్కనుంది. ఈయూ దేశాల్లో సుంకాలను గణనీయంగా తగ్గించడంతో ఇక్కడి నుంచి ఎగుమతులు పెరగనున్నాయి. తెలంగాణకు సంబంధించి కీలకంగా ఉన్న ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్ పరికరాలు, వస్త్ర పరిశ్రమలకు.. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి చేపలు, ఇతర సముద్ర ఉత్పత్తులు, రసాయనాలు, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు ప్రయోజనం కలగనుంది. అంతేగాకుండా ఇరు రాష్ట్రాల్లోని ఫార్మా సంస్థలకు మందుల ముడి పదార్థాలు యూరోపియన్ దేశాల నుంచి తక్కువ ధరకే అందుతాయి.


'రక్షణ'లో మరింత సహకారం

రక్షణ రంగంలో భారత్, ఈయూ మధ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలని.. తీర రక్షణ, సైబర్, అంతరిక్ష రంగాలు, ఉగ్రవాద నిరోధక పోరాటంలో మరింత సహకరించుకోవాలని సదస్సులో నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిష్ఠాత్మక రక్షణ, భద్రతా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఈయూ విదేశీ, భద్రతా వ్యవహారాల చీఫ్ కాజా కల్లాస్ మధ్య జరిగిన భేటీలో దీనిపై చర్చించారు. భారత్‌లో రక్షణ రంగ పరిశ్రమలు సరికొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడానికి, ఈయూ సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఈ ఒప్పందం వీలుకల్పించనుంది.

మనకు అందే ప్రయోజనాలివే

- యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై ప్రస్తుతం 125శాతం వరకు సుంకాలు ఉన్నాయి. తాజా ఒప్పందం ప్రకారం 15 వేల యూరోల (సుమారు రూ.16 లక్షలు)పైన ధర ఉన్న కార్లపై సుంకాలు 40శాతానికి తగ్గుతాయి. తర్వాత దశలవారీగా 10శాతానికి తగ్గిస్తారు. దీనితో యూరప్‌కు చెందిన బీఎండబ్ల్యూ, ఆడి, మెర్సిడెజ్, లాంబోర్గిని, పోర్షే వంటి కార్ల ధరలు భారీగా తగ్గుతాయి. ఉదాహరణకు భారత్‌లో లాంబోర్గిని కార్ల ప్రారంభ ధర ప్రస్తుతం సుమారు రూ.3.8 కోట్ల వరకు ఉంది. ఒప్పందం అమల్లోకి వచ్చాక.. సుమారు రూ.2 కోట్లకు ఆ ధర తగ్గిపోయే అవకాశముంది. మరోవైపు భారత్ నుంచి యూరప్ దేశాలకు ఎగుమతి చేసే కార్లపైనా అక్కడి సుంకాలను 10శాతానికి తగ్గిస్తారు. ఇది భారత కంపెనీలకు ప్రయోజనం కలిగిస్తుంది. ఇలా పరస్పరం సుంకాల మినహాయింపును నిర్ధారిత సంఖ్య (ఉదాహరణకు ఏటా 2.5 లక్షల కార్లు) వరకే వర్తింపజేస్తారు. అంతకు మించితే గరిష్ఠ సుంకాలు విధిస్తారు.
- యూరప్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే వైన్, విస్కీ, వోడ్కా, బీర్ వంటివాటిపై 150శాతం వరకు దిగుమతి సుంకాలు ఉన్నాయి. ఒప్పందం అమల్లోకి వస్తే వైన్‌పై 30శాతానికి, వోడ్కా, విస్కీ వంటి ఆల్కాహాల్ ఉత్పత్తులపై 40శాతానికి, బీర్లపై 50శాతానికి సుంకాలు తగ్గుతాయి. దీనితో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫ్రెంచ్, ఇటలీ, స్పెయిన్ వైన్, ఇతర ఆల్కాహాలిక్ ఉత్పత్తులు భారత్‌లో తక్కువ ధరకు దొరుకుతాయి. ఇదే సమయంలో భారత వైన్స్, ఆల్కాహాలిక్ ఉత్పత్తులపై యూరప్ దేశాల్లో సుంకాలు తగ్గుతాయి. మన సంస్థల ఎగుమతులు పెరిగే అవకాశం ఉంటుంది.
- క్యాన్సర్ ఔషధాలు, బరువు తగ్గించే మందులు సహా కీలక ఫార్మా ఉత్పత్తుల ధరలు 11 శాతం వరకు, వైద్య పరికరాలు ధరలు 25శాతం వరకు తగ్గుతాయి. మందుల తయారీకి వాడే ముడి పదార్థాల ధరలు తగ్గడం వల్ల దేశంలో ఫార్మా కంపెనీలకు ప్రయోజనం కలగనుంది.
- విమానాలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై భారత సుంకాలు తగ్గుతాయి. దీనితో యూరప్ నుంచి వచ్చే సంబంధిత ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి.
- యూరప్ నుంచి దిగుమతయ్యే ఇనుము, స్టీలు, రసాయన ఉత్పత్తులపై సుంకాలను ఎత్తివేయనున్నారు. దీనితో ఆయా ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. ఇక భారత్ నుంచి యూరప్ దేశాలకు వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఆభరణాల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి.
- బిస్కట్లు, పాస్తా, చాకొలెట్లు, పండ్ల రసాలు వంటి ప్రాసెస్డ్ ఉత్పత్తులు, ఆలివ్ ఆయిల్, ఇతర నూనెలపై సుంకాలు ఎత్తివేయడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉంటుంది.

సంస్కరణలు చేపట్టాలి: మోదీ




ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత్-ఈయూ మధ్య వాణిజ్య ఒప్పందం స్థిరత్వానికి బాటలు వేస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. ఇది కేవలం ఒక వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదని.. ప్రపంచానికి మేలు చేసేలా, ఉమ్మడి అభివృద్ధి దిశగా సరికొత్త మార్గమని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయిలో పరస్పర ప్రయోజనాల పరిరక్షణ, బహుళపక్ష విధానాలను గౌరవించాలని.. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవసరమని మోదీ స్పష్టం చేశారు. కాగా, అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు కట్టుబడి ఉండే విషయంలో భారత్, ఈయూ బాధ్యతగా ఉన్నాయని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ మాటలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆయుధాలతో పోరాటంతో శాంతి నెలకొనదని.. అనేక ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా ఆయుధాలు చేతపట్టకుండా న్యాయాన్ని ఆచరిస్తూ నిలబడే దేశాల వల్లే శాంతి నెలకొంటుందని చెప్పారు. ఇక ప్రపంచంలో ప్రస్తుత సవాళ్లకు పరస్పర సహకారమే సరైన సమాధానమనే బలమైన సందేశాన్ని ఈయూ-భారత్ ఒప్పందం పంపిందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ పేర్కొన్నారు. భారత నైపుణ్యాలు, సేవా రంగాన్ని.. యూరోపియన్ సాంకేతికతలు, పెట్టుబడులు, సృజనాత్మక ఆవిష్కరణలను ఈ ఒప్పందం ఒక్క చోటికి చేర్చుతోందన్నారు.

లోకం తీరు



ఈయూ బాస్.. 'బాబుష్'!

- తాను భారత సంతతి వ్యక్తినన్న యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటానియో కోస్టా



న్యూఢిల్లీ, జనవరి 27: భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి మీడియా సమావేశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటానియో లూయిస్ శాంతోస్ డా కోస్టా తాను భారత సంతతి వ్యక్తినేనని చెప్పారు. అంతేకాదు మీడియా సమావేశంలో జేబులో నుంచి తన ఓసీఐ (ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా) కార్డును తీసి గర్వంగా ప్రదర్శించారు. ప్రస్తుతం బ్రసెల్స్ కేంద్రంగా ఐరోపా గమనాన్ని నిర్దేశిస్తున్న 64 ఏళ్ల ఆంటానియో కోస్టాకు భారత్‌తో విడదీయలేని అనుబంధం ఉంది. ఆయన తండ్రి ఓర్లాండో కోస్టా గోవాలో పుట్టి పెరిగారు. గోవా విముక్తి తర్వాత 18 ఏళ్ల వయసులో ఆయన పోర్చుగల్‌కు వలస వెళ్లారు. "యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా మాత్రమే కాదు.. ఒక ఓవర్సీస్ ఇండియన్ సిటిజన్‌గా ఈ వేదికపై నిలబడడం నాకు గర్వంగా ఉంది" అని కోస్టా భావోద్వేగంతో చెప్పారు. చిన్నతనంలో తనను కొంకణి భాషలో ముద్దుగా 'బాబుష్' (చిన్న పిల్లవాడు) అని పిలిచేవారని గుర్తుచేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

తనపై యుద్ధానికి తానే నిధులిస్తున్న ఈయూ

- భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందంపై అమెరికా

వాషింగ్టన్, జనవరి 27: భారత్- యూరోపియన్ యూనియన్(ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకున్న ఈయూ.. ఐరోపా దేశాలపై రష్యా చేస్తున్న యుద్ధానికి తానే స్వయంగా నిధులు సమకూరుస్తున్నట్టు అయిందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ హెచ్చరించారు. "రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందని భారత్‌పై 25% సుంకాలు విధించాం ఇప్పుడేం జరిగిందో చూడండి. భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై ఈయూ సంతకం చేసింది. రష్యా నుంచి భారత్‌కు తొలుత చమురు వెళుతోంది. అక్కడి రిఫైనరీల్లో శుద్ధి చేసిన తర్వాత వచ్చే చమురు ఉత్పత్తులను ఐరోపా వాసులు కొనుగోలు చేస్తారు. తమపై యుద్ధానికే వాళ్లే నిధులు ఇస్తున్నారు" అని స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. అయితే, రష్యా-ఉక్రెయిన్ సమస్య విషయంలో ఐరోపా దేశాలతో పోలిస్తే అమెరికానే ఎన్నో త్యాగాలు చేసిందని బెసెంట్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వంలోనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడుతుందని స్పష్టం చేశారు.

భారత్‌తో ఇంధన వాణిజ్యంపై దృష్టి

- కెనడా ఇంధన శాఖ మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ వెల్లడి

దక్షిణ గోవా, జనవరి 27: భారత్‌లో ఇంధన వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మన మార్కెట్‌పై కెనడా దృష్టిసారించింది. కస్టమర్ల సంఖ్యను విస్తరించుకోవడంతోపాటు అమెరికాకు సరఫరాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఆ దేశం భావిస్తోంది. ఇందులో భాగంగా మన దేశానికి ఇంధన ఎగుమతులను పెంచాలనుకుంటున్నట్టు కెనడా ఇంధన శాఖ మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ మంగళవారం పేర్కొన్నారు. ఇండియన్ ఎనర్జీ వీక్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అమెరికాకు తన ఇంధనంలో 98% ఎగుమతులు చేస్తుండటం వ్యూహాత్మక పొరపాటుగా పేర్కొన్నారు. అలాగే భారత్‌తో కలిసి పని చేసే అవకాశాన్ని తాము గుర్తించినట్టు తెలిపారు. ఇంధనానికి ప్రపంచంలోనే అత్యంత వేగంగా డిమాండ్ భారత్‌లో పెరుగుతోందని పేర్కొన్నారు. భారత్‌కు ముడిచమురుతోపాటు లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ), యురేనియంలను కెనడా సరఫరా చేయగలదన్నారు.

జనాకర్షక బడ్జెట్!

కీలక సంస్కరణలు, ప్రకటనలకు కేంద్రం సిద్ధం



- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభం
- ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్
- రాజ్‌నాథ్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ

న్యూఢిల్లీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జనాకర్షక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ సారి బడ్జెట్‌లో కీలక సంస్కరణలు, ప్రకటనలు వెలువడే అవకాశముంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితి మధ్య భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేలా ఈ బడ్జెట్ ఉండబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉద్యోగులు, మధ్య తరగతి, రైతులు, కూలీలు ఇలా అన్ని వర్గాలకు ప్రయోజనాలు కలిగేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఉండే అవకాశం ఉంది. ప్రధానంగా భార్యాభర్తలు ఇద్దరూ ఉమ్మడిగా ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేసే అవకాశం, వైద్య రంగంలో స్వదేశీ తయారీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల్లో డిజిటల్ విప్లవం, స్టార్టప్, ఇన్నోవేషన్-డీప్‌టెక్ వైపు అడుగులు, కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణ తదితరాలపై కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. రెండు విడతలుగా జరిగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 13 వరకు మొదటి విడత, మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో విడత నిర్వహిస్తారు. మొత్తం 30 రోజులు ఉభయ సభలు సమావేశం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడతారు. ఆమె వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. మరోవైపు, పార్లమెంటు చరిత్రలోనే తొలిసారిగా ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సాగనుంది.

నరేగా రద్దుపై చర్చకు విపక్షాల పట్టు

బడ్జెట్ సమాశాల్లో నరేగా (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) రద్దు, ఎస్ఐఆర్, యూజీసీ కొత్త మార్గదర్శకాలు వంటి అంశాలను లేవనెత్తాలని, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక, విదేశాంగ విధానాల్లో కీలకాంశాలపై స్పష్టత కోసం డిమాండ్ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ నివాసంలో కీలక భేటీ జరిగింది. పార్టీ అధ్యక్షుడు మలికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు. అలాగే వివిధ విపక్ష పార్టీల నేతలు కూడా ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేసేందుకు బుధవారం ఉదయం పార్లమెంటు హౌస్‌లోని ఖర్గే చాంబర్‌లో భేటీ కానున్నారు. కాగా, మంగళవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. పార్లమెంటు సమావేశాల్లో నరేగా రద్దు, ఎస్ఐఆర్, ఓట్ చోరీ, యూజీసీ కొత్త మార్గదర్శకాలు, కొత్త విదేశాంగ విధానం, వరి సేకరణ సహా ఇతర అంశాలపై చర్చించాలని కాంగ్రెస్ సహా విపక్షాలు డిమాండ్ చేశాయి. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ల ఆఫీసులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై చర్చకు డీఎంకే, టీఎంసీ, వామపక్ష పార్టీలు పట్టుబట్టాయి. మరోవైపు ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ అమరావతి రాజధాని బిల్లు అంశాన్ని లేవనెత్తింది. రాజ్యసభలో సభా నాయకుడు జేపీ నడ్డా, పార్లమెంటు వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సహాయ మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్వాల్, డాక్టర్ ఎల్.మురుగన్‌లతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలు(తెలుగుదేశం), బాలశౌరి(జనసేన), కేఆర్ సురేష్ రెడ్డి (బీఆర్ఎస్), మిథున్ రెడ్డి (వైసీపీ) తదితరులు హాజరయ్యారు.

వీబీ జీ రామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదు: రిజిజు

కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు. అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల డిమాండ్ సరికాదన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, బడ్జెట్ చర్చల సమయంలో కూడా వివిధ అంశాలను లేవనెత్తవచ్చని సభ్యులకు సూచించామని తెలిపారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను ఆయన కోరారు.

ఉపాధి మెటీరియల్ నిధులు
రూ.740 కోట్లు విడుదల

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులు మరో రూ.740 కోట్లు రాష్ట్రానికి జమ అయ్యాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి నాలుగో విడతలో తొలిగా రూ.480 కోట్లు, పాత బకాయిలు మరో రూ.75 కోట్లు కలిపి కేంద్ర వాటాగా సుమారు రూ.556 కోట్లు స్పర్శ అకౌంట్ ద్వారా విడుదల చేసింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తన 25 శాతం వాటాగా మరో రూ.185 కోట్లు జమచేస్తే మొత్తం రూ.740 కోట్లు మెటీరియల్ నిధులు రాష్ట్రానికి అందినట్లయింది. దీంతో అక్టోబరు వరకూ ఉపాధి పథకంలో మెటీరియల్ పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించే అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు. దీనివల్ల పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి.

విద్యార్థులు, టీచర్లకు
జియో ఏఐ తరగతులు

- ఉచితంగా జెమిని 3ప్రొ సబ్‌స్క్రిప్షన్

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై నాలుగు వారాల ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సును ఉచితంగా అందించేందుకు ప్రముఖ జియో సంస్థ ముందుకొచ్చింది. ఆధునిక కాలంలో బోధన, అభ్యసన పద్ధతులను మెరుగుపరచుకునేందుకు గూగుల్ జెమిని ప్రొను ప్రాక్టికల్‌గా ఎలా వినియోగించుకోవాలనేది ప్రధానాంశంగా ఈ ఆన్‌లైన్ కోర్సును తీసుకొచ్చింది. దీనిపై ఇప్పటికే 1,500 పాఠశాలల్లో అవగాహన కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 20వేల మంది టీచర్లు, విద్యార్థులు ఇందులో నమోదు చేసుకునేలా ప్రణాళిక అమలుచేస్తోంది. ఇందులో భాగంగా రూ.35,100 విలువైన సబ్‌స్క్రిప్షన్ ప్యాకేజీని టీచర్లు, విద్యార్థులు పూర్తి ఉచితంగా పొందవచ్చు. ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా జెమిని 3ప్రొ, హైఎండ్ క్రియేటివ్ టూల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. అలాగే నోట్‌బుక్ ఎల్ఎమ్ అకడమిక్ రిసెర్చ్ టూల్, 2 టీబీ క్లౌడ్ స్టోరేజీ కూడా లభిస్తాయి. జియో ఏఐ క్లాస్ రూమ్ పోర్టల్‌లో ఈ సేవలు వినియోగించుకోవచ్చని ఆ సంస్థ తెలిపింది.

ఏపీఎంసీ ఎన్నికలకు 84 నామినేషన్లు

- 13 మెంబర్ పోస్టులకు వైద్యుల నుంచి భారీ పోటీ

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ (ఏపీఎంసీ) ఎన్నికల్లో పోటీకి 84 నామినేషన్లు వచ్చాయని కౌన్సిల్ రిజిస్ట్రార్ డా.ఐ.రమేశ్ తెలిపారు. మంగళవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఇప్పటి వరకూ వచ్చిన నామినేషన్లను అధికారులు పరిశీలించారు. 13 మెడికల్ కౌన్సిల్ మెంబర్లకు 84 మంది వైద్యులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 9న ఆన్‌లైన్‌లో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. 54 వేల మంది వైద్యులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికలాధికారి కె.వి.ఎస్.చక్రధరబాబు నేతృత్వంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే ఓటింగ్ ప్రక్రియలో వైద్యులు జాగ్రత్తగా వ్యవహరించాలని, వైద్యులకు మెయిల్ ద్వారా వచ్చిన లింక్ 30 నిమిషాలు మాత్రమే ఉంటుందని, ఈ సమయంలోనే ఓటింగ్ ప్రక్రియను ముగించాలన్నారు. 30 నిముషాల్లో ఓటు వేయకపోతే.. ఆటోమెటిక్‌గా లింక్ క్లోజ్ అయిపోతుందన్నారు.

తిరుమలలో
రథసప్తమి రికార్డ్

వాహనసేవలు తిలకించిన 3.45 లక్షల మంది

- సమష్టి కృషితో వేడుకలు విజయవంతం: టీటీడీ ఈవో
- 9 ప్రశ్నలతో భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ
- ఏర్పాట్లు చాలా బాగున్నాయంటూ 97 శాతం మంది ప్రశంస



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా ఈసారి రథసప్తమి రోజున తిరుమల మాడవీధుల్లో వాహనసేవలను రికార్డుస్థాయిలో 3.45 లక్షల మంది భక్తులు వీక్షించారని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. రథసప్తమి నిర్వహణపై మంగళవారం మధ్యాహ్నం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన తిరుమలలో మీడియాతో మాట్లాడారు. రద్దీ నిర్వహణ, భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని విభాగాల సమన్వయంతో సఫలీకృతమయ్యామని చెప్పారు. రథసప్తమి వేడుకలు విజయవంతం కావడానికి కృషి చేసిన టీటీడీ, జిల్లా, పోలీసు యంత్రాంగం, ఆర్టీసీ, శ్రీవారి సేవకులు, అర్చకస్వాములు, వాహన బేరర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈసారి రథసప్తమికి భారీగా భక్తులు తిరుమలకు వచ్చారని.. గరుడ సేవను 1.80 లక్షల మంది వీక్షించినట్టు ఏఐ కెమెరాల ద్వారా గుర్తించామని తెలిపారు. ఇదే మాడవీధుల గ్యాలరీల అసలైన సామర్థ్యంగా చెప్పుకోవచ్చన్నారు. 24వ తేదీ నుంచి 25వ తేదీ రాత్రి వరకు టీటీడీ సౌకర్యాలను వినియోగించుకుంటూ భక్తులెవరూ కదలకుండా ఒకే ప్రాంతంలో ఓపిగ్గా కూర్చుని వాహనసేవలను వీక్షించారని ఈవో వెల్లడించారు. ఇక, రికార్డుస్థాయిలో ఆ రోజు 14,339 వాహనాలు తిరుమలకు వచ్చాయన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 3,364 మంది పోలీసు, విజిలెన్స్ సిబ్బంది సేవలందించారని తెలిపారు. తిరుమలకు 60,425 మంది, తిరుపతికి 82,241 మంది భక్తులు ఆర్టీసీలో ప్రయాణించారన్నారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ చిన్నపాటి ఇబ్బంది కూడా లేకుండా అధికారులు, సిబ్బంది సహకారంతో ఉత్సవాన్ని విజయవంతం చేశామన్నారు. భవిష్యత్తులో రాంభగీచ వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు రూపొందించుకుంటామని తెలిపారు. భక్తుల నుంచి వాట్సాప్, ఐవీఆర్ఎస్, శ్రీవారిసేవకుల ద్వారా అభిప్రాయ సేకరణ చేశామని చెప్పారు. 97 శాతం మంది భక్తులు ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారని అదనపు ఈవో వెంకయ్య చౌదరి చెప్పారు. గ్యాలరీల్లో అదనపు మరుగుదొడ్లు, స్క్రీన్లు ఏర్పాటు చేయాలని కొందరు సూచించారని, అందుకు తగిన విధంగా చర్యలు చేపడతామన్నారు. మల్టీలెవల్ కార్ పార్కింగ్ నిర్మాణం అంశంపై చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఏర్పాట్లు అద్భుతం

తిరుమలలో ఈ నెల 25న జరిగిన రథసప్తమి ఏర్పాట్లపై 97 శాతం మంది భక్తులు సంతప్తి వ్యక్తం చేశారు. ముఖ్య పర్వదినాల్లో ఏర్పాట్లపై భక్తుల అభిప్రాయాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా మార్పుచేర్పులు చేయడాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక టీటీడీ ఆనవాయితీగా పెట్టుకుంది. ఇందులో భాగంగా 25న నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీల్లో కూర్చుని ఉన్న భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. వాట్సాప్, ఐవీఆర్ఎస్, శ్రీవారి సేవకుల ద్వారా 9 ప్రశ్నలకు సమాధానాలు తీసుకున్నారు. దీని ప్రకారం 97 శాతం మంది భక్తులు టీటీడీ కల్పించిన సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. 2% మంది పర్వాలేదని సమాధానం ఇవ్వగా ఒక శాతం మంది ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

భక్తుల అభిప్రాయాలు ఇలా

	చాలా బాగున్నాయి	పర్వాలేదు	బాగాలేదు
రథసప్తమి ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?	1,944 మంది	44 మంది	12 మంది
అన్నప్రసాదాల రుచి, శుచి ఎలా ఉంది?	1,934 మంది	63 మంది	ఒకరు
పరిసరాల పరిశుభ్రత, మంచి నీటి సౌకర్యం	1,939 మంది	59 మంది	ఇద్దరు
విద్యుత్, పుష్పాలంకరణ	1,953 మంది	47 మంది	-
సాంస్కృతిక కార్యక్రమాలు	1,909 మంది	91 మంది	ఇద్దరు
వైద్య సౌకర్యాలు	1,902 మంది	98 మంది	
గ్యాలరీల్లోని చలువ పందిళ్లు	1,950 మంది	49 మంది	ఒకరు
గ్యాలరీల్లోని అన్నప్రసాదాలు	1,960 మంది	36 మంది	నలుగురు
టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకుల సేవలు	1,968 మంది	30 మంది	ఇద్దరు

కోర్టు హాలులోకి ప్రవేశించి నిందితుడిని అరెస్ట్ చేయడం ఏంటి?

- ఇలాంటి చర్యలను అనుమతిస్తే రేపటి రోజున ఏదైనా చేస్తారు
- పత్తికొండ కోర్టు ఘటనలో పోలీసుల తీరును తప్పుపట్టిన హైకోర్టు
- బాధ్యులకు నోటీసులు.. విచారణ వాయిదా



అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా కోర్టు హాలులోకి ప్రవేశించి నిందితుడిని అరెస్ట్ చేసిన వ్యవహారంలో పోలీసుల వైఖరిని హైకోర్టు తప్పుపట్టింది. పత్తికొండ కోర్టు మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోకుండా కోర్టు హాలులో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించింది. హైకోర్టు రిజిస్ట్రార్ అనుమతి లేకుండా హైకోర్టులోని నిందితులను కూడా ఇలానే అరెస్ట్ చేస్తారా? అని నిలదీసింది. ఇలాంటి చర్యలను అనుమతిస్తే... రేపటి రోజున ఏదైనా చేస్తారని వ్యాఖ్యానించింది. బాధ్యులైన పోలీసులను ఆ స్టేషన్ నుంచి మరో చోటుకి మార్చారా? వారిపై ఏం చర్యలు తీసుకున్నారు? అని ఆరా తీసింది. ప్రతివాదులుగా ఉన్న చిప్పగిరి ఎస్ఐ బి.సతీష్‌కుమార్, పత్తికొండ ఎస్ఐ ఆర్.విజయ్‌కుమార్ నాయక్, కానిస్టేబుళ్లు షబ్బీర్, రామోజీలకు వ్యక్తిగత హోదాలో నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

అసలు ఏం జరిగింది?

కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం డేగులపాడు గ్రామానికి చెందిన శివయ్య గంజాయి సాగు చేస్తున్నాడనే ఆరోపణలతో చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. తన న్యాయవాది ద్వారా సరెండర్ పిటిషన్ వేసిన శివయ్య లొంగిపోయేందుకు గతే డిసెంబరు 24న పత్తికొండ కోర్టుకు రాగా.. మఫ్టీలో ఉన్న చిప్పగిరి ఎస్ఐ సతీష్‌కుమార్, పత్తికొండ ఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు షబీర్, రామోజీలు ఆయన్ను అరెస్ట్ చేశారు. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా కోర్టు హాలులోకి ప్రవేశించి.. నిందితుడు శివయ్యను అరెస్ట్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పత్తికొండ న్యాయవాదుల సంఘం జనరల్ సెక్రటరీ జి.భాస్కర్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫున న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు వినిపిస్తూ.. కోర్టు హాలులోకి ప్రవేశించి, నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి వినతిపత్రం అందజేసినా ఎలాంటి స్పందన లే దని పేర్కొన్నారు. ఘటనపై జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ లేదా జిల్లా జడ్జి సూచించిన అధికారి లేదా ఏదైనా స్వతంత్ర సంస్థతో విచారణకు ఆదేశించాలని కోరారు.

ఆ సమయంలో మేజిస్ట్రేట్ కోర్టులో లేరు..

హోంశాఖ తరఫున సహాయ ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసులు ఉద్దేశపూర్వకంగా కోర్టు హాలులోకి వెళ్లలేదన్నారు. సరెండర్ పిటిషన్ గురించి వారికి అవగాహన లేదన్నారు. పిటిషనర్ కోర్టు హాలులోకి పరిగెత్తాడని వివరించారు. మేజిస్ట్రేట్ కోర్టు నిర్వహించడం లేదని, కోర్టులో లేరని తెలిసిన తర్వాతే పోలీసులు లోపలికి వెళ్లారని పేర్కొన్నారు. కోర్టు హాలులోకి ప్రవేశించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని పత్తికొండ మేజిస్ట్రేట్ ఎస్పీని ఆదేశించారని తెలిపారు. జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసులకు ఛార్జ్‌మెమోలు ఇచ్చి, వారి నుంచి వివరణ కోరారన్నారు. పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు.

మేజర్ మల్లాకు రూ.1.25 కోట్ల బహుమతి

- 'కీర్తి చక్ర' అవార్డుకు అందించిన ప్రభుత్వం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేజర్ మల్లా రామగోపాల్ నాయుడుకి ప్రభుత్వం 1.25 కోట్ల నగదు బహుమతి ప్రకటించింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మేజర్ మల్ల రామగోపాల్ నాయుడుకి కేంద్ర ప్రభుత్వం 2024లో స్వాతంత్ర్య దినోత్సవం రోజున 'కీర్తి చక్ర' అవార్డు ప్రదానం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్మ్‌డ్ ఫోర్సుల్లో 'చక్ర' అవార్డు గ్రహీతలకు నగదు బహుమతులు ప్రకటించింది. ఈమేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు ఆదేశించింది.

స్వచ్ఛ హరిత పాఠశాలల హెచ్ఎంలకు అభినందన

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్' కార్యక్రమంలో జాతీయ స్థాయికి నామినేట్ అయిన 20 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మంగళవారం విజయవాడలో అభినందించారు. బడుల్లో పరిశుభ్రమైన తాగునీరు, టాయిలెట్లు, చేతులు శుభ్రం చేసుకోవడం, వ్యర్థాల నిర్మూలన, మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను పరిశీలించి స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్‌కు ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా టాప్-200 పాఠశాలలకు రూ.లక్ష చొప్పున నగదు బహుమతి అందిస్తారు. కాగా... ఈ మంచి విధానాలను వారి వారి పాఠశాలలతో పాటు క్లస్టర్, కాంప్లెక్స్ పరిధిలోని ఇతర పాఠశాలలకూ విస్తరింపజేయాలని హెచ్ఎంలకు ఎస్పీడీ సూచించారు.

బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలి

- బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్

విజయవాడ (గాంధీనగర్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన బీసీ సంఘాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మారేష్ మాట్లాడుతూ బీసీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలు అందజేయాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

31 నుంచి విజ్ఞాన్ వర్సిటీలో బాల మహోత్సవ్

గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో సృజనాత్మక నైపుణ్యాలను, ప్రతిభను వెలికి తీసేందుకు విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో విజ్ఞాన్ బాల మహోత్సవ్ 2కె26ను నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కేవీ కృష్ణ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఈ బాల మహోత్సవ్‌కు సంబంధించిన పోస్టర్లను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ, చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి సరైన వేదిక కల్పించడమే ఈ బాల మహోత్సవ్ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరిచే అవకాశాన్ని ఈ వేడుక కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ కోసం స్టూడెంట్ కోఆర్డినేటర్లు సీహెచ్ సాత్విక్ 73822 61632, బి.రోషిత 77998 74416 తదితరులను సంప్రదించాలని సూచించారు.

సరెండర్ లీవ్ బిల్లులు విడుదల చేయండి

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండ్ లీవ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా దాచుకున్న బిల్లులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం సరెండర్ లీవ్‌తో పాటు మిగిలిన బకాయిలనూ త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. అదే విధంగా 2002 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వారు కోరారు.

రీసర్వేను బహిష్కరిస్తాం

- ఏలూరు జిల్లా గ్రామ సర్వేయర్ల అసోసియేషన్

ఏలూరు రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించకపోతే భూముల రీసర్వేను బహిష్కరిస్తామని ఏలూరు జిల్లా గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు సర్వే శాఖ ఏడీ అన్సారీని కలిసి అసోసియేషన్ సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్ సూర్య, ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్నా చిన్నపాటి సాకులు చూపిస్తూ మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ సస్పెన్షన్లు విధించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రీ సర్వే విధుల్లో ఉంటున్న గ్రామ సర్వేయర్ల ప్రయాణ, కరువు భత్యం, ఇతర బకాయిల వెంటనే చెల్లించాలని కోరారు. జాబ్‌చార్టులకు విరుద్ధంగా జాయింట్ ఖాతాల తొలగింపు, పట్టాదారులను నిర్ణయించడం తదితర కీలక అంశాలు రెవెన్యూ అధికారులు చెల్లించాల్సి ఉంటే బలవంతంగా సర్వేయర్లపై రుద్దడం తగదని సూచించారు.

తమిళనాట ఇనుప యుగం నాటి ఈటె లభ్యం

- 8 అడుగుల పొడవైన ఈటె తవ్వకాల్లో వెలుగులోకి
- క్రీస్తు పూర్వం 3345 సంవత్సరాల నాటిదిగా ప్రకటన
- ఇనుప పనిముట్లు, కుండలు, సమాధి పాత్రలు కూడా..

చెన్నై, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తెన్‌కాశి సమీపం తిరుమలపురం వద్ద చేపట్టిన పురావస్తు తవ్వకాల్లో ప్రాచీన ఇనుప యుగం నాటి అత్యంత పొడవైన ఈటె బయల్పడింది. 8 అడుగుల పొడవైన ఈ ఈటె క్రీస్తుపూర్వం 3345 సంవత్సరాల నాటిదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనితో పాటు 6.5 అడుగుల పొడవున్న మరో ఈటె, పలు ఇనుప పనిముట్లు, కుండలు, సమాధి పాత్రలు, ఇతర కళాఖండాలు వెలుగు చూశాయి. ప్రాచీన ఇనుపయుగం తమిళనాటే ప్రారంభమైందనే వాదనలకు ఈ వస్తువులు మరింత బలం చేకూరుస్తున్నాయి. తవ్వకాల్లో బయల్పడిన వస్తువులు అప్పట్లో ఖననం చేసిన వ్యక్తి ఉన్నత సామాజిక హోదాను చాటుతున్నాయని ఈ బృందానికి నేతృత్వం వహించిన పురావస్తు పరిశోధకుడు కే వసంత్‌కుమార్ తెలిపారు. ఈటె ఒక చివర కొద్దిగా గుండ్రంగా ఉందని, వాడుక సౌలభ్యం కోసం ఇలా తయారు చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. పశువులు, సంపదను కాపాడటానికి అప్పటి యోధులు దీన్ని ఉపయోగించి ఉంటారని, అలాగే ఉన్నత హోదా కలిగిన వ్యక్తులు ఈటెను సంప్రదాయంగా ధరించి ఉండొచ్చని వివరించారు. తవ్వకాల్లో బయల్పడిన ఇనుప పనిముట్లను బట్టి ఈ ప్రాంతంలో క్రీ.పూ. 2500 నుంచి క్రీ.పూ. 3000 మధ్యకాలం నాటి ప్రజలు ఇనుము వాడకానికి సంబంధించిన పరిజ్ఞానం కలిగి ఉండేవారని పురావస్తు పరిశోధకుడు కే రాజన్ తెలిపారు. రాష్ట్ర పురావస్తు పరిశోధనా విభాగం జాయింట్ డైరెక్టర్ ఆర్ శివానందం మాట్లాడుతూ ఐఐటీ గాంధీనగర్‌లోని మెటలర్జీ విభాగం సహకారంతో రెండేళ్లలో రాష్ట్రంలోని ఇనుప యుగం నాటి ప్రాంతాలపై ఓ అధ్యయనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాగా, తమిళనాడులోని ఆరు ప్రదేశాల్లో క్రీ.పూ. 2953 నుంచి క్రీ.పూ. 3345 మధ్య కాలానికి చెందిన ఇనుప వస్తువులను గుర్తించారని గతేడాది విడుదల చేసిన నివేదికలో బీబీసీ ప్రకటించింది.

టీటీడీ అన్నదానానికి కూరగాయల వితరణ



తిరుమలకు కూరగాయలు తరలిస్తున్న లారీ

నూజివీడు టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రానికి ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంత రైతులు 13.5 టన్నుల కూరగాయలను అందించారు. నూజివీడు మండలం దేవరగుంట గ్రామానికి చెందిన నక్క సత్యనారాయణ, శ్రీ వేంకటేశ్వరస్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో టీటీడీకి బంగాళదుంపలు, వంకాయలు, క్యాబేజీ, పచ్చిమిర్చి తదితర 13.5 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. దాదాపు 36 నెలలుగా వేంకటేశ్వర స్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో కూరగాయలను అందిస్తున్నట్టు సత్యనారాయణ తెలిపారు. తిరుమలతో పాటు ద్వారకా తిరుమలకు కూడా 4 టన్నుల కూరగాయలను మంగళవారం అందించినట్టు ఆయన పేర్కొన్నారు.

యాదవ జాతి ఐక్యత, అభివృద్ధికి కృషిచేస్తా

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ యాదవ్

విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన యాదవ సంఘ నిర్మాణం చేపట్టి యాదవ జాతి ఐక్యత, అభివృద్ధి, సంక్షేమానికి తోడ్పడతానని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణ యాదవ్ తెలిపారు. విజయవాడ నగర శివారు కానూరులో రాష్ట్ర యాదవ కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. నారాయణ యాదవ్ మాట్లాడుతూ, పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, యాదవులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా సంఘం పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యాదవ జాతికి అవసరమైన యాదవ భవన్ నిర్మాణం, యాదవ హాస్టల్ కోసం ప్రభుత్వంలోని యాదవ పెద్దలను కలిసి ప్రయత్నిస్తానని తెలిపారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో పర్యటించి అఖిల భారత యాదవ మహాసభను బలోపేతం చేస్తామన్నారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ రాష్ట్ర కమిటీ యూత్ అధ్యక్షుడు ఆలా అనంతరామయ్య యాదవ్, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్ కొలుసు మోహన్ యాదవ్, జనరల్ సెక్రటరీలు ఎద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, యర్రాకుల శ్రీనివాస యాదవ్, బొడ్డు పైడిరాజు యాదవ్‌కు అభినందనలు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణయాదవ్, యాదవ నాయకులు

కోట్లు పోగొట్టుకొని అనలిస్టుల అవతారం..

- క్రికెట్ బెట్టింగ్ కేసులో నలుగురు అరెస్ట్
- రిమాండ్‌కు తరలించిన విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు



సుమంత్, గణేష్, మురళి, బద్రేశ్వర్‌రెడ్డి

ఎండాడ (విశాఖపట్నం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్న తిరుపతి, గుంటూరు జిల్లాలకు చెందిన నలుగురు ప్రిడిక్షన్ అనలిస్టులను విశాఖ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నాని క్రికెట్ ప్రిడిక్షన్, వినయ్‌రెడ్డి క్రికెట్ కింగ్, మురళి క్రికెట్ అనలిస్ట్, అజయ్ క్రికెట్ అనలిస్ట్ అనే మారు పేర్లతో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్స్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన దేశినేని సుమంత్, లంకిపల్లి గణేష్, గుంటూరు జిల్లా పెదకూరపాడుకు చెందిన కొప్పుల మురళి, అదే జిల్లా నగరపాలేనికి చెందిన మేడమ్ బద్రేశ్వర్‌లను సాంకేతికత ఆధారంగా సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. వారి నుంచి క్రికెట్ బెట్టింగ్ వెట్‌సైట్‌లను ప్రమోట్ చేయడానికి వినియోగిస్తున్న మొబైల్ ఫోన్లు, మైకులు, ల్యాప్‌టాప్‌తో సహా ప్రిడిక్షన్ ద్వారా సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన కారును స్వాధీనం చేసుకున్నారు. బీటెక్, ఎంఎస్సీ చేసిన ఈ యువకులు ఒక్కొక్కరూ క్రికెట్ బెట్టింగ్‌లో సుమారు రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు పోగొట్టుకున్నారు. అనంతరం అనలిస్టులుగా అవతారమెత్తి దుబాయ్ బేస్డ్ బుకీస్ పర్యవేక్షణలో మురుగన్ బుక్, ఫెయిర్ ప్లే, విన్‌బజ్, వాజిర్‌విన్ అనే బెట్టింగ్ వెబ్‌సైట్లను టెలిగ్రామ్ చానెల్ ద్వారా సోషల్ మీడియాలో ప్రమోట్ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'గీతా'వాక్యం...!

మరో రెండేళ్ళలో భారతదేశం మూడవ ఆర్థికశక్తిగా అవతరిస్తుందంటూ సుప్రసిద్ధ ఆర్థికవేత్త గీతాగోపీనాథ్ డావోస్‌లో చేసిన వ్యాఖ్య మన నాయకులకు శ్రవణానందకరంగా ఉంది కానీ, వాయు కాలుష్యంతో లక్షలాదిమంది చనిపోవడం సరికాదని, దానిని నియంత్రించడం దేశం ప్రథమ లక్ష్యం కావాలన్న ఆమె హితవు మాత్రం రుచించడం లేదు. భారతదేశ ఎదుగుదలకు, దాని ఆర్థికవ్యవస్థకు అమెరికా అధ్యక్షుడు విధించే టారిఫ్‌లకంటే కాలుష్యం అతిపెద్ద సవాలని ఆమె తేల్చేశారు. వాయు కాలుష్యం పలురకాలుగా దేశానికి కీడు చేస్తున్నదంటూ దాని ఆర్థిక, ప్రాణ నష్టాన్ని ఆమె ఇటీవల విశ్లేషించిన సంగతి తెలిసిందే. దేశంలో ఏటా సంభవించే మరణాల్లో దాదాపు ఐదోవంతు కాలుష్యం వల్లనేనని, విదేశీ పెట్టుబడులను ప్రభావితం చేసే స్థాయికి దేశంలో కాలుష్యం పెరిగిపోయిందని ఐఎంఎఫ్ మాజీ చీఫ్ ఎకనామిస్ట్ హెచ్చరిస్తున్నారు. కాలుష్యం వల్ల ఏటా పదిహేడు లక్షలమంది కన్నుమూస్తున్నారన్న ఆమె వ్యాఖ్యకు ఆధారాలు లేవని కొందరు దీర్ఘాలు తీస్తున్నప్పటికీ, ప్రపంచ బ్యాంకు డేటాతో ఆమె చేసిన ఈ విశ్లేషణ ఒకందుకు మనకు మంచిదే.

కాలుష్యాన్ని అతి ప్రమాదకరమైన, సత్వరమే ఎదుర్కోవాల్సిన అంశంగా భావించని పాలకులకు సరైన సమయంలో చేసిన హెచ్చరిక ఇది. గీతా గోపీనాథ్ వంటి ఆర్థికవేత్త నోట కాలుష్యం మాట వెలువడటానికి కారణం కూడా జీడీపీలు, పెట్టుబడులే అయినప్పటికీ మరక మంచిదే. ఢిల్లీలో కాలుష్యం నాలుగువందల స్థాయిని అందుకున్న సందర్భంలో అనేకమంది అనాది ఆవేదన డావోస్‌లో ఆమె నోట ప్రతిధ్వనించింది. లాన్సెట్ నివేదిక సహా అనేక అధ్యయనాలు భారతదేశం తీవ్ర కాలుష్యంతో సతమతమవుతోందని చెప్పడంతోపాటు, ఈ పదిహేడు లక్షల సంఖ్యను కూడా ప్రస్తావించాయి. వాయుకాలుష్యం కారణంగా ఆయుష్షుతీరకుండా సంభవించే మరణాలవల్ల దేశానికి కలిగే ఆర్థిక నష్టాన్ని 339 బిలియన్ డాలర్లుగా అవి లెక్కవేశాయి. గ్రీన్‌పీస్ వంటి సంస్థలు కూడా వివిధ రీతుల్లో నష్టాలను అంచనాకట్టాయి. గత పాతికేళ్ళలో కాలుష్యాన్ని సగం నియంత్రించగలిగినా భారతదేశం మరో నాలుగున్నరశాతం అధిక జీడీపీని సాధించివుండేదని 2023లో ప్రపంచ బ్యాంకు ఒక ఆశ్చర్యకరమైన వ్యాఖ్య కూడా చేసింది.

ముంబై మహానగరాన్ని కాలుష్యంనుంచి రక్షించాలంటున్న ఒక కేసులో మంగళవారం హైకోర్టులో గీతాగోపీనాథ్ వ్యాఖ్యల ప్రస్తావన వచ్చింది. కోర్టు ఎన్నిసార్లు చెప్పినా, నావీముంబై, బృహన్‌ముంబై నగరపాలక సంస్థలు చర్యలు చేపట్టడం లేదంటూ అమికస్ క్యూరీగా ఉన్న డేరియస్ ఖంబాటా వాదిస్తూ, ఈ సంస్థల నిర్లక్ష్యం కారణంగా సంభవిస్తున్న ఆర్థిక, ప్రాణ నష్టాన్ని లెక్కగట్టి తదనుగుణంగా అధికారులకు శిక్షలు విధించాలని ఓ ప్రతిపాదన చేశారు. చర్యలు చేపట్టని పక్షంలో జీతాల్లో కోత విధిస్తామంటూ కమిషనర్‌లకు ఇటీవలే హైకోర్టు హెచ్చరికలు సైతం చేసింది. అయినప్పటికీ, వారు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారని, ప్రజల ప్రాణాలతో ముడివడిన ఈ అత్యంత ప్రధానమైన అంశంలో సైతం వ్యవస్థలు, వ్యక్తులు కదలాలంటే న్యాయస్థానం షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిందేనని అమికస్ క్యూరీ అభ్యర్థిస్తున్నారు.

దేశరాజధాని ఢిల్లీని కాలుష్యంనుంచి కాపాడేందుకు సుప్రీంకోర్టు ఇదే తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంవత్సరాలుగా పోరాడుతున్న విషయం తెలిసిందే. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగులబెట్టడమే ఢిల్లీ కాలుష్యానికి కారణమని ఒకదశలో పాలకులు దబాయించారు కూడా. అయితే, వాహన కాలుష్యమే అతిప్రధానమైనదని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ తన నివేదికలో తేల్చిచెప్పిన నేపథ్యంలో, సత్వరచర్యలకు కోర్టు ఆదేశించింది. కాలుష్యానికి దోహదపడుతున్న వాహనాలను నియంత్రించడం, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికేట్ల జారీని కఠినతరం చేయడం, ప్రజారవాణాను మెరుగుపరచడం ఇత్యాదివి కమిషన్ ఇచ్చిన సలహాల్లో ఉన్నాయి. వీటిలో ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలతో పాటు, పౌరులు తమ బాధ్యతగా నిర్వర్తించాల్సిన కర్తవ్యాలు కూడా కొన్ని ఉన్నాయి. ఢిల్లీని కాలుష్యం, పొగమంచూ కలగలిసి కుమ్మేసిన స్థితి సుదీర్ఘకాలంగా కొనసాగుతూ, కొద్దిపాటి జల్లుల వల్ల గణతంత్రదినోత్సవం నాడు మాత్రం పరిస్థితి కాస్తంత మెరుగుపడింది. విదేశీ అతిథులముందు పరువుపోనందుకు దేశ ప్రజలంతా సంతోషించారు. ఇప్పుడు మళ్ళీ ఏక్యూఐ ఆకాశానికి తాకుతూ పరిస్థితి పూర్వస్థితికి చేరిన నేపథ్యంలో, గీతాగోపీనాథ్ లెక్కలను తప్పుబట్టడం కంటే, ఆమె హితవుకు చెవొగ్గడం అవసరం.

> ఒకప్పుడు మన 'ఆకాశవాణి' వార్తలను భారతీయులే అంతగా విశ్వసించేవారు కాదు. తాజా, నిష్పాక్షిక వార్తలకు బీబీసీపైనే ఆధారపడేవారు. నిష్పాక్షిక వార్తలు, పదునైన విశ్లేషణలతో గ్రామీణ రైతాంగం మొదలు దౌత్యవేత్తల వరకు తనకొక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న మార్క్ టలీ మృతితో ఒక దిగ్గజ పాత్రికేయుడు చరిత్ర పుటల్లోకి జారిపోయారు.

మూగవోయిన 'భారతీయ వాణి'

నిత్య నూతన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం మన ధరిత్రిని ఒక కుగ్రామంగా మార్చివేసింది. సువిశాల ప్రపంచంలో ఎల్లెడలా ఉన్న సంఖ్యానేక ప్రవాస భారతీయులు తమ మాతృభూమి సమాచారాన్ని కొన్ని నిమిషాల వ్యవధిలోనే తెలుసుకోగలుగుతున్నారు. సంభవిస్తోన్న సంఘటనలు, పరిణామాలపై వార్తలు, విశ్లేషణాత్మక కథనాల కోసం కేవలం ఒక్క సమాచార వ్యవస్థపైనే ఆధారపడకుండా వివిధ సమాచార వ్యవస్థలు, వార్తా వనరులను సమర్థంగా వినియోగించుకుంటున్నారు. ఒకప్పుడు మన 'ఆకాశవాణి' వార్తలను భారతీయులే అంతగా విశ్వసించేవారు కాదు. తాజా, నిష్పాక్షిక వార్తలకు బీబీసీపైనే ఆధారపడేవారు (తన మాతృమూర్తి ఇందిరాగాంధీ హత్యోదంతాన్ని బీబీసీలో విన్న తరువాత మాత్రమే రాజీవ్‌గాంధీ విశ్వసించారు). భారత్‌లోనే కాకుండా, విదేశాలలో ఉన్న భారతీయులే కాకుండా, మన ఇరుగు పొరుగు దేశాల ప్రజలు సైతం బీబీసీ హిందీ వార్తలకు నిత్యం నిరీక్షించేవారు.


ప్రపంచవ్యాప్తంగా అద్వితీయ విశ్వసనీయత పొందిన మీడియా సంస్థ బీబీసీ. భారత్‌లో ఆ ప్రతిష్ఠాత్మక సంస్థ ప్రతినిధి మార్క్ టలీ. ఆయన భారతీయ దృక్కోణంలో వార్తా సేకరణ, వార్తా విశ్లేషణ చేసేవారు. ఈ విశిష్ట పాత్రికేయం కారణంగా భారతీయులు, మన ఇరుగు పొరుగు దేశాల ప్రజలు బీబీసీని విశేషంగా విశ్వసించారు. ఈ దేశాలలో అసంఖ్యాక ప్రజానీకానికి మార్క్ టలీ అనేది పరిచయం అవసరం లేని పేరుగా సువిఖ్యాతమయింది. నిష్పాక్షిక వార్తలు, పదునైన విశ్లేషణలతో గ్రామీణ రైతాంగం మొదలు దౌత్యవేత్తల వరకు తనకొక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ప్రసార ప్రముఖుడు మార్క్ టలీ. ఆయన మృతితో ఒక దిగ్గజ పాత్రికేయుడు చరిత్ర పుటల్లోకి జారిపోయాడు.

గల్ఫ్ లేఖ

సమయ వ్యత్యాసం కారణాన, భారతదేశ కాలమానంలో సాయంత్రం ఏడున్నర గంటలకు ప్రసారమయ్యే బీబీసీ వార్తలు వినేందుకు గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయులు తమ ఓవర్ టైంను సైతం వదులుకునేవారు అంటే నమ్మవలసిన నిజం. విశ్వసనీయ సమకాలీన రాజకీయ, సామాజిక విశ్లేషకుడుగా జనకోటి హృదయాలను గెలుచుకున్న మార్క్ టలీ బీబీసీ 'వాయిస్ ఆఫ్ ఇండియా'గా ప్రఖ్యాతుడయిన పాత్రికేయుడు.

మార్క్ టలీ జన్మతః బ్రిటిష్ జాతీయుడు. అయినా భారతావని గుండె చప్పుడును భారతీయ పాత్రికేయుల కంటే ఎక్కువగా అర్థం చేసుకున్న 'భారతీయ పౌరుడు' ('నేను ఏ రెండు దేశాల – భారత్, బ్రిటన్– కు చెందినవాడినని భావిస్తానో, ఆ రెండు దేశాల పౌరుడిని అయ్యాను' అని టలీ ఆనందంగా చెప్పేవారు). బీబీసీ నియమాల ప్రకారం ఒక వార్తా కథనం 300 వాక్యాలకు మించకూడదు, అయినా ఆ పరిధిలో కూడా ఆయన సంచలనాత్మక వార్తలతో ప్రభంజనం సృష్టించారు. 1965 భారత్–పాకిస్థాన్ యుద్ధం, 1971లో బంగ్లాదేశ్ విముక్తి సమరం, అత్యవసర పరిస్థితి ప్రకటన, పాకిస్థాన్‌లో జనరల్ జియా సైనిక పాలన, జుల్ఫీకర్ భుట్టో మరణ శిక్ష, బంగ్లాదేశ్ పితామహుడు ముజిబుర్ రహ్మాన్ హత్య, ఇందిర, రాజీవ్‌గాంధీ దురంతాలు, పంజాబ్‌లో ఉగ్రవాదం, ఆపరేషన్ బ్లూ స్టార్, శ్రీలంకలో తమిళుల వేర్పాటువాదం, అఫ్ఘానిస్థాన్‌పై సోవియట్ దురాక్రమణ, ఇస్లామిక్ జిహాద్, భోపాల్ గ్యాస్ లీక్, ఢిల్లీ అల్లర్లు, బాబ్రీ మసీదు ధ్వంసం మొదలైన చరిత్రాత్మక ఘటనల గురించి వార్తలు మరెవ్వరి కంటే కూడా ముందుగా ప్రపంచానికి అందజేసిన విలేఖరి మార్క్ టలీ.

నివాళి



ఫోన్లు కాదు కదా, కనీస రవాణా సదుపాయాలు కూడా లేని ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ఆదివాసులపై పోలీసు కాల్పులు జరిపారు. మృతుల సంఖ్య విషయమై ఆ కాలంలో టలీ లేవనెత్తిన సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి జాతీయ నాయకుడు జార్జి ఫెర్నాండెజ్ ఆదిలాబాద్ అడవులకు వెళ్లే ప్రయత్నం చేశారు (ఆదిలాబాద్‌లో రైలు నుంచి దిగిన వెంటనే ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు). తనపై జరుగుతోన్న కుట్రను 'ఆకాశవాణి' ద్వారా ప్రజలకు వివరించేందుకు అవకాశం ఇవ్వలేదని 1984లో ఎన్టీఆర్ ఆవేదన చెందగా, నాటి ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలపై మార్క్ టలీ వెలువరించిన వార్తలు, విశ్లేషణలు జాతీయ స్థాయిలో రాజకీయాలపై ప్రభావం చూపాయి. తన పుస్తకం 'ఇండియా ఇన్ స్లో మోషన్'లో వారణాసి తివాచీల పరిశ్రమలో బాలకార్మికుల దురవస్థల గురించి ఎంత విమర్శనాత్మకంగా వివరించారో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ అభివృద్ధి కొరకు చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషినీ అంతే ప్రశంసనీయంగా టలీ వివరించారు.

అరచేతిలో అనంత సమాచారం అందుబాటులో ఉన్న ప్రస్తుత తరానికి నిన్నటి కాలంలో సమాచార వ్యాప్తిలో రేడియో నిర్వహించిన పాత్ర గురించి తెలియదు. సామాజిక, రాజకీయ చైతన్య స్రవంతిలో బీబీసీ వార్తలు, జనరంజక వినోద ఉల్లాసంలో బినాకా గీత్ మాల, జనరంజని పాటల మాధుర్యం చరిత్రగా మిగిలిపోయాయి. నిత్యం మార్క్ టలీ వార్తలకు చెవులు కోసుకున్నవారు ప్రస్తుతం వయోభారంతో చెవులు వినబడని స్థితికి చేరుకున్నారు. పాత్రికేయ రంగంలో వృత్తి ప్రమాణాలు, నైతిక విలువలు లుప్తమైన ప్రస్తుత కాలంలో మార్క్ టలీని స్మరిస్తూ నివాళులు అర్పించేవారు ఎంతమంది ఉన్నారు?

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

రాజ్యాంగ నిష్ఠను త్యజిస్తున్న గవర్నర్లు!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కొన్ని రాజ్యాంగ పదవులు అలంకార ప్రాయంగా ఉన్నట్లు కనిపిస్తాయి. అటువంటి వాటిలో కీలకమైనది రాష్ట్ర గవర్నర్ పదవి. బ్రిటిష్ పాలనా కాలం నాటి అనేక అవశేషాలను, కాలం చెల్లిన చట్టాలను రద్దు చేసిన, అనేక సంస్థల, చిహ్నాల, చట్టాల పేర్లను మార్చేసిన మోదీ ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్ పదవిని మాత్రం ఎందుకో కొనసాగిస్తోంది. ప్రధానమంత్రి అధికార నివాసం ఉన్న రేస్‌కోర్స్ రోడ్ లోక్ కల్యాణ్ మార్గ్‌గా మారింది. ప్రధానమంత్రి కార్యాలయం లోక్‌తీర్థ్‌గా అవతరించింది. ప్రణాళికా సంఘానికి నీతీ ఆయోగ్‌గా పునఃనామకరణం చేశారు. రాజ్‌పథ్ కర్తవ్య పథ్‌గా రూపొందింది. శీతాకాల సమావేశాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు వీబీ–జీరామ్– జీగా మారిపోయింది. ఈ ఒరవడిలో గవర్నర్ నివాసాలు అయిన రాజభవన్లు లోక్‌భవన్‌లుగా మారిపోయాయి. ఉత్తరప్రదేశ్‌లో మాత్రం అప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలున్న భవనాన్ని లోక్‌భవన్‌గా భావిస్తున్నందువల్ల ఆ రాష్ట్ర గవర్నర్ తన అధికార నివాసానికి జనభవన్‌గా పేరు పెట్టుకున్నారు. నిజానికి గవర్నర్ అన్న పేరు కూడా బ్రిటిష్ భావజాలాన్ని ప్రతిబింబించేదే. బహుశా ఆ పేరును మార్చి మరో మంచి పేరు పెట్టాలన్న ఆలోచన ప్రధాని మోదీకి వచ్చేవరకు ఆ పేరు అదే విధంగా కొనసాగవచ్చు.

ప్రజాస్వామ్యంలో రాచరికం అన్న పదానికి అర్థం లేదు. అందువల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా రాజ్‌భవన్‌లకు లోక్‌భవన్‌లుగా పేరు పెట్టడం పూర్తిగా సమంజసమే. రాష్ట్ర గవర్నర్లు నివసించే లోక్‌భవన్‌లు చాలా మటుకు బ్రిటిష్ కాలం నాటి దర్పాన్ని ప్రతిబింబిస్తూ అనేక ఎకరాల్లో, విశాలమైన ప్రాంగణాల్లో ఉన్నాయి. కేవలం రాష్ట్ర రాజధానుల్లోనే కాదు, కొన్ని ముఖ్యమైన పట్టణాల్లో కూడా విశాలమైన భవన్‌లు గవర్నర్‌ల అధీనంలో ఉంటాయి. లోక్‌భవన్‌ల ద్వారాలు తెరిచి ప్రజలకు తమను కలుసుకునే అవకాశం కల్పించే గవర్నర్లు ఎంతమంది ఉన్నారు? ప్రజల వద్దకు తమకుతాముగా వెళ్లే గవర్నర్లూ తక్కువే కదా. అయినా ప్రజలు తమను కలిసినంత మాత్రాన గవర్నర్లు వారికి ఏమి చేయగలరు? కలుసుకున్నవారికి ఉత్సవ విగ్రహాలను చూశామన్న తృప్తి మినహా మరేమీ సమకూరదు కదా. మరి గవర్నర్లు ఏమీచేయనప్పుడు వారు నివశించే భవన్‌ల పేరు మార్చినంత మాత్రాన ప్రజలకు ఒరిగేది ఏమున్నది?

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ప్రకారం పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిధిలో పనిచేయాల్సిన గవర్నర్ పదవి అలంకార ప్రాయమైనది. అయినా గవర్నర్లు చాలా మంది తమ ఉనికిని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఇటీవల కర్ణాటక గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ శాసనసభలో ఆనవాయితీ ప్రకారం గవర్నర్ ప్రసంగాన్ని చదవడానికి నిరాకరించారు. కారణమేమిటి? జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తీసేసి విబి–జీరామ్–జీ అనే కొత్త పేరు పెట్టినందుకు కేంద్రాన్ని విమర్శిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రసంగాన్ని రూపొందించడమే. తప్పుడు ప్రకటనలు, లెక్కలేనన్ని అవాస్తవాలు ఉన్నాయని విమర్శిస్తూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఏకంగా తన ప్రసంగంలో కొన్ని పేరాలను మార్చేసి చదివారు. రాజ్యాంగ అధికరణ 163 ప్రకారం గవర్నర్ మంత్రిమండలి సలహా ప్రకారమే నడుచుకోవాల్సి ఉంటుంది. అధికరణ 176 ప్రకారం గవర్నర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించాల్సి ఉంటుంది. మంత్రిమండలి ఆమోదించిన ప్రసంగానికే రాజ్యాంగ బద్ధత ఉంటుంది. అయితే ఎక్కడా ఆ ప్రసంగం ఫలానా విధంగా ఉండాలని రాజ్యాంగం నిర్దేశించనప్పుడు గవర్నర్ ఏమి చేయాల్సి ఉంటుంది?

'బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను వేధించేందుకే గవర్నర్లు కంకణం కట్టుకున్నారు. ప్రభుత్వాలు రూపొందించిన ప్రసంగాలు చదవవద్దని నుంచి వారికి ఆదేశాలు వస్తున్నాయి. కేంద్రం చేతుల్లో గవర్నర్లు కీలుబొమ్మలుగా మారిపోయారు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఎన్నికైన ప్రభుత్వాల గొంతు నొక్కేందుకే గవర్నర్లను ఉపయోగించుకుంటున్నారని రాహుల్‌గాంధీ గతంలో వ్యాఖ్యానించారు. బీజేపీ నియమించిన గవర్నర్లందరూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు కాని గవర్నర్ల గురించి విమర్శలు చేసేందుకు కాంగ్రెస్‌కు ఎలాంటి నైతిక అధికారమూ లేదు. గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగపరచడంలో కాంగ్రెస్ ఘనాపాటి కాదూ? కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కూడా గవర్నర్లు కీలుబొమ్మలుగా వ్యవహరించారు. గుజరాత్‌లో మోదీ ప్రభుత్వం కూడా అప్పటి గవర్నర్‌ను తప్పుపట్టింది. ఇప్పుడు ఆ చరిత్ర మరో విధంగా పునరావృతమవుతోంది. కాంగ్రెస్ నాడు అవలంబించిన వైఖరి వల్లే బీజేపీ 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అనేందుకు దారితీసింది.

అయితే అప్పటి పరిస్థితులకూ ఇప్పటి పరిస్థితులకూ తేడా ఉన్నది. గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు నాటి గవర్నర్ రామ్‌లాల్‌ను ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎలా ఉపయోగించుకుందో అందరికీ తెలుసు.

> రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడకుండా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు, చర్యలను సరిదిద్ది, సమన్వయం చేసేందుకు గవర్నర్ పదవీ బాధ్యతలు ఉపయోగపడతాయి. మరి గవర్నర్లు రాజ్యాంగ నిష్ఠతో వ్యవహరిస్తున్నారా? నిజానికి ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలపై చట్టాలు చేసేటప్పుడు రాష్ట్రాలను విధిగా సంప్రదించాలని సర్కారియా కమిషన్‌కు బీజేపీ విన్నవించింది. మరి ఇప్పుడు అలా సంప్రదిస్తున్నారా?



అయితే ప్రజలు తిరగబడడంతో రామ్‌లాల్‌ను తొలగించి శంకర్‌దయాళ్ శర్మను నియమించారు. బిహార్‌లో నితీశ్ కుమార్‌కు మెజారిటీ నిరూపించుకునే అవకాశం కల్పించకుండా సభను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని నిర్ణయించినందుకు నాటి గవర్నర్ బూటాసింగ్‌ను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. గత్యంతరం లేక ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. అధికరణ 356ను దుర్వినియోగపరిచి రాష్ట్రపతి పాలనను తరుచూ విధించే సంప్రదాయాన్ని పాటించి కాంగ్రెస్ అనేకసార్లు అభాసుపాలైంది. అయితే ఈ అధికార దుర్వినియోగానికి కూడా సుప్రీంకోర్టు అడ్డకట్ట వేసింది. ఒక ప్రభుత్వానికి సంఖ్యాబలం ఉన్నదో లేదో చట్టసభలోనే తేలాలని బొమ్మై కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించింది. రాష్ట్రపతి పాలన విధించడం న్యాయ సమీక్షకు అతీతం కాదని కూడా అదే తీర్పులో స్పష్టం చేసింది. ఆర్టికల్ 356 దుర్వినియోగం సమాఖ్య స్ఫూర్తికి వ్యతిరేకమని గర్హించింది.

గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా సుదీర్ఘ జాప్యం చేయకూడదంటూనే గత ఏడాది నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ బిల్లుల ఆమోదానికి తాము నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించలేమని, తమ న్యాయ సమీక్ష పరిమితంగానే ఉంటుందని చెప్పి పదవీ కాలాన్ని ముగించుకున్నారు. విచిత్రమేమిటంటే గవర్నర్లకు బిల్లులను ఆమోదించే విషయంలో విచక్షణాధికారం పూర్తిగా ఉండాలని కనీసం పది రాష్ట్రాలు సుప్రీంకోర్టుకు తెలిపాయి. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలే గవర్నర్ల విచక్షణాధికారాన్ని వ్యతిరేకించాయి! గవర్నర్లకు సమయం నిర్దేశించలేమన్న సుప్రీంకోర్టే స్పీకర్లు మాత్రం నిర్దిష్టకాలంలో సభ్యుల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవాలని హుకుం జారీ చేసింది!

కొన్ని కీలక సందర్భాల్లో రాష్ట్రపతి, గవర్నర్ల రాజ్యాంగ పాత్రకు విశేష ప్రాధాన్యం లభిస్తుంది. ఎన్నికలలో ఏ పార్టీకి మెజారిటీ రాని పరిస్థితుల్లో రాష్ట్రపతి, గవర్నర్‌ల నిర్ణయాధికారానికి ప్రాముఖ్యత ఉంటుంది. దీనికి కూడా సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాలు విధించినందువల్ల ఈ విషయంలోనూ వారికి పెద్దగా స్వేచ్ఛ ఉండే అవకాశం లేదు. తొందరపడి రాజ్యాంగ వ్యతిరేక చట్టాలు చేసినప్పుడు గవర్నర్ కలుగచేసుకునే అవకాశాలున్నాయి. అప్పుడు గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపాలి. రాజ్యాంగ పరిమితిలోనే రాష్ట్రాల చట్టాలు ఉండేలా చూసేందుకు గవర్నర్లకు కల్పించిన విచక్షణాధికారం ఇది. చాలా అరుదైన సందర్భాల్లోనే అలా జరుగుతుంది. రాష్ట్రపతికి కూడా ఇలాంటి అధికారం ఉంటుంది. 1986లో రాజీవ్‌గాంధీ ప్రవేశపెట్టిన పోస్టల్ బిల్లు వ్యక్తిగత గోప్యతకు వ్యతిరేకంగా ఉన్నదంటూ రాష్ట్రపతి జైల్‌సింగ్ ఆ బిల్లును ఆమోదించకుండా తొక్కిపెట్టారు. చివరకు ప్రభుత్వమే ఆ బిల్లును ఉపసంహరించుకుంది. అంటే గవర్నర్, రాష్ట్రపతి పదవులు రాజ్యాంగాన్ని ఉల్లంఘించకుండా కాపాడుతూ, సరిదిద్ది, సమన్వయం చేసేందుకు (చెక్స్ అండ్ బ్యాలన్స్) ఉపయోగపడతాయి. అయితే గవర్నర్లు అలా రాజ్యాంగ నిష్ఠతో వ్యవహరిస్తున్నారా? నిజానికి ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలపై చట్టాలు చేసేటప్పుడు రాష్ట్రాలను విధిగా సంప్రదించాలని సర్కారియా కమిషన్‌కు బీజేపీ విన్నవించింది. మరి ఇప్పుడు అలా సంప్రదిస్తున్నారా?

నిజానికి భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు ప్రకారం షెడ్యూల్డు ప్రాంతాల్లో ఆదివాసీల ప్రయోజనాలు కాపాడేందుకు సంరక్షకుడుగా గవర్నర్ వ్యవహరించాల్సి ఉన్నది. భూ బదిలీలను, వడ్డీ వ్యాపారాలను నియంత్రించే అధికారం గవర్నర్లకు ఉన్నది. కేంద్ర, రాష్ట్ర చట్టాలను సవరించడం, లేదా మినహాయింపు ఇవ్వడం కూడా వారు చేయవచ్చు. ఆదివాసీల ప్రాంతాల్లో పరిస్థితుల గురించి రాష్ట్రపతికి గవర్నర్లు వార్షిక నివేదికలు సమర్పించాలి. ఆదివాసీల సలహా మండలిని ఏర్పాటు చేసి సంక్షేమ చర్యలకు సంబంధించి సూచనలు స్వీకరించాలి. పెసా చట్టాన్ని అమలు చేసేలా చూడాలి. రాజ్యాంగంలోని అధికరణ 244 క్రింద ఆదివాసీ ప్రాంతాల నిర్వహణపై గవర్నర్లకు ప్రత్యేక బాధ్యత ఉంటుంది. కాని ఎంతమంది గవర్నర్లు ఈ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు? ఆదివాసీ ప్రాంతాల్లో భూముల అమ్మకాన్ని, అక్రమ మైనింగ్‌ను నివారించగలుగుతున్నారా? స్వయం పాలన, సహజ వనరుల యాజమాన్యం. భూ హక్కులపై గ్రామసభలకు సాధికారిత కల్పించిన పెసా చట్టం అమలు అయ్యేలా చూడగలుగుతున్నారు? ఆదివాసీలు ఏళ్ల తరబడి జైళ్ల పాలు కాకుండా నిరోధించగలుగుతున్నారా? రాజ్యాంగాన్ని సమీక్షించడం మాట అటుంచి రాజ్యాంగాన్ని సరిగా అమలు చేస్తున్నామా అని 77వ గణతంత్ర దినోత్సవం పూర్తయిన సందర్భంగా ప్రశ్నించుకోవడం మంచిది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)


చారిత్రక బాధ్యతగా గాంధీ సందేశ యాత్ర

ఇటీవల నేను శ్రీలంకలోని శాంకరీదేవి శక్తిపీఠాన్ని, సీతమ్మ వాటికను సందర్శించాను. ట్రింకోమలీ పట్టణంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని కూడా దర్శించాను. అక్కడి ప్రజలతో మాట్లాడినప్పుడు గాంధీ జయంతిని తామంతా పండుగలా జరుపుకుంటామని వారు చెప్పిన మాటలు విని, భావోద్వేగానికి లోనయ్యాను. పరాయిదేశంలో గాంధీ పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలకు నా మనస్సు పులకరించింది.

200 ఏళ్ళ బ్రిటిష్ వలస పాలనలో బానిసత్వం అనుభవించిన భారతదేశాన్ని దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేసేందుకు ప్రజలందరినీ ఐక్యం చేసిన మహానాయకుడు గాంధీ. ఆ స్ఫూర్తితో ఆనాటి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కోట్లాది కుటుంబాల్లో మా కుటుంబం కూడా ఒకటి. మా పెదనాన్న దివంగత శ్రీరామ రెడ్డి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకెళ్ళాడు. ఆ కాలంలో హిందూపురానికి గాంధీ వచ్చినప్పుడు, మా తండ్రి దివంగత కావేరప్ప... నీలకంఠాపురం గ్రామం నుంచి కాలినడకన హిందూపురానికి వెళ్ళి గాంధీ సందేశాన్ని విని, ఆ స్ఫూర్తితో గ్రామంలో దళితులను దేవాలయ ప్రవేశం చేయించాడు. గాంధీ ఆలోచనల స్ఫూర్తితో మా (ఉమ్మడి) కుటుంబంలో ఇప్పటికి సుమారు పది కులాంతర వివాహాలు జరిగాయి. మా కుటుంబం చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమం వెనుక గాంధీ స్ఫూర్తి ఉంది.

ఈ రోజు భారతదేశంలో మనమంతా స్వేచ్ఛావాయువులు పీలుస్తూ ప్రజాస్వామ్యాన్ని అనుభవిస్తున్నామంటే అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులతో పాటు గాంధీ నాయకత్వం కూడా ప్రధాన కారణం. అశేష ప్రజాకర్షణ, సమ్మోహనశక్తి, త్యాగనిరతితో స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను కదిలించిన ఆయన నాయకత్వానికి ముగ్ధుడైన మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్, గాంధీని మహాత్మునిగా సంబోధించాడు. తనను మహాత్ముడిగా ఆరాధించవద్దని చెప్పిన వినమ్రనేత గాంధీ. సుభాష్ చంద్రబోస్ ఆయనను 'జాతిపిత'గా అభివర్ణించాడు. దక్షిణాఫ్రికా నల్లజాతి యోధుడు నెల్సన్ మండేలా, అమెరికా మానవ హక్కుల యోధుడు మార్టిన్ లూథర్‌కింగ్ వంటి నాయకులు గాంధీ సిద్ధాంతాలతో స్ఫూర్తి పొంది, తమ దేశాల్లో ప్రజల హక్కుల కోసం ఉద్యమించారు. "రక్తమాంసాలు కలిగిన ఇలాంటి మనిషి ఒకరు నిజంగా ఈ భూమిపై నడయాడారని భవిష్యత్ తరాలు నమ్మకపోవచ్చు" అంటూ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్నాడంటే గాంధీ ఎంతటి చారిత్రక పురుషుడో అర్థమవుతుంది. అలాంటి గాంధీని నాథూరామ్‌గాడ్సే 1948, జనవరి 30న ఢిల్లీలో తుపాకితో కాల్చి చంపాడు.

స్వాతంత్ర్యోద్యమంతో ఏ మాత్రం ప్రమేయంలేని కొందరు, కుటిల రాజకీయాల కోసం గాంధీ జీవితంపై అసత్యాలతో, వక్రీకరణలతో ఒక పథకం ప్రకారం వ్యతిరేక ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు. గాంధీ త్యాగాలను, ఆలోచనలను కించపరుస్తూ, అవహేళన చేస్తూ సామాజిక మాధ్యమాల్లో ఆయనపై కొందరు బాహాటంగా విద్వేషాన్ని వెదజల్లే దుస్థితి నేడు దాపురించింది. గాంధీని, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఆనాటి త్యాగమూర్తులను అవమానించడమంటే మన దేశాన్ని, మన స్వాతంత్ర్య పోరాట చరిత్రను అవమానించుకోవడమే. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం ఆవేదన కలిగిస్తోంది. ఏ ప్రభుత్వం ఉన్నా గాంధీ పేరును భవిష్యత్ దార్శనిక పథకాలకూ, మరిన్ని సంస్థలకూ విస్తరించి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని అందివ్వాలి. అంతేగానీ ఉన్న పేర్లను తొలగించకూడదు.



> సిద్ధాంత, కార్యాచరణలతో యావత్తు దేశాన్ని మేల్కొలిపి సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దిన మహాఋషి గాంధీ. ఆయన ఆలోచనలను నేటితరానికి, భవిష్యత్ తరాలకూ అందించాల్సిన చారిత్రక బాధ్యతను నిర్వర్తించేందుకే 'మహాత్మాగాంధీ సందేశయాత్ర' సంకల్పించాను.

గాంధీ స్ఫూర్తితో ఆయన తరువాతి తరం దేశం కోసం, సమాజం కోసం చాలా మేరకు నిజాయితీగా, సేవాదృక్పథంతో పనిచేసింది. ఇప్పుడు గాంధీ గురించి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏ మాత్రం ప్రభావం కాలేని కొత్తతరం దేశంలో ఉన్నది. ఇది సహజ పరిణామమే. దేశంలో నేడు ప్రభావశీలకంగా ముందుకొచ్చిన ప్రతికూల విద్వేష భావజాలం, నేటి తరానికి స్వాతంత్ర్యోద్యమ వాస్తవ చరిత్రను కాకుండా వక్రీకరణలతో కూడిన చరిత్రను నూరిపోయడానికి ప్రయత్నిస్తోంది. ఇది ఎంత వికృతంగా మారిందంటే జాతిపిత పైనే తప్పుడు ప్రచారం చేసేటంతగా. ఉదాహరణకు– గాంధీ బ్రిటిష్ ఏజెంట్ అనీ, పాకిస్థాన్ ఏర్పాటుకు కారకుడనీ, ముస్లింల పక్షపాతి అనీ, హిందువుల వ్యతిరేకి అనీ... ఇలా ఇష్టానుసారం ప్రతికూలశక్తులు ప్రచారం చేస్తున్నాయి. అమాయక యువత ఆ అవాస్తవాలను నమ్మి తమ మెదళ్లలో తప్పుడు భావాలను నింపుకుంటోంది.

సత్యం, సత్యాగ్రహం, అహింస, మానవత, ప్రేమ, పరమత సహనం, జాతీయ ఐక్యత, సర్వోదయ, స్వదేశీ, అంటరానితనం నిర్మూలన, నైతిక విలువలు, గ్రామస్వరాజ్యం, స్త్రీ పురుష సమానత్వం, తదితర సిద్ధాంత, కార్యాచరణలతో యావత్తు దేశాన్ని మేల్కొలిపి సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దిన మహాఋషి గాంధీ. ఆయన ఆలోచనలను నేటి తరానికి, భవిష్యత్ తరాలకూ అందించాల్సిన చారిత్రక బాధ్యత గాంధీ అభిమానులందరిపై ఉంది.

మహాత్మాగాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకుని జనవరి 28, 29, 30 తేదీలలో నీలకంఠాపురం గ్రామం నుంచి హిందూపురం (గాంధీచౌక్) వరకూ మూడు రోజులపాటు 'మహాత్మాగాంధీ సందేశయాత్ర' పేరుతో పాదయాత్ర చేయాలని సంకల్పించాను. రాజకీయాలకు అతీతంగా చేపట్టే ఈ యాత్రలో శాంతి, సామరస్యం, మానవత, సమతలను కోరుకునే వారంతా సంఘీభావాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను.

● డా. ఎన్.రఘువీరారెడ్డి
మాజీ మంత్రి

మృత్యుద్వారం మాంజా దారం!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గొట్టపుబావులు తవ్వినప్పుడు అందులో జలం లభ్యంకాకపోతే, ఆ గొట్టాలను కానీ, వాటి వల్ల ఏర్పడ్డ పెద్ద రంధ్రాలను కానీ కప్పివేయకుండా వదిలేసేవారు. చిన్నారులు ఆటలాడుకుంటూ అక్కడ ఆ రంధ్రాల గురించి తెలియక అందులో పడి మరణించేవారు. ప్రస్తుతం అలాంటి సంఘటనలు తగ్గాయి. ఇప్పుడు 'మాంజా' దారం మృత్యువుకు ద్వారంగా మారుతోంది. సంక్రాంతి పండుగ సమయంలో గాలిపటాలు ఎగురవేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ముఖ్యంగా తెలంగాణలో పతంగుల ఎగరేయడానికి పిన్నలతో పాటు పెద్దలు కూడా సరదాపడుతుంటారు. కానీ ఈ వినోదం కొన్ని కుటుంబాల్లో విషాదం మిగులుస్తోంది. దారానికి గాజు రజను అంటించడం వల్ల రహదారిలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి గొంతులు కోసుకుపోయి మరణిస్తున్నారు. మాంజా అమ్మకాలపై అధికారులు నిఘా ఉంచాలి. అలాగే పెద్దలు తమ పిల్లలకు మాంజా వల్ల జరుగుతున్న మరణాల గురించి వివరించాలి. మాంజాని అమ్మే వ్యాపారులపై భారీ జరిమానాతో పాటు కఠినశిక్షలు పడేలా కేసులు పెట్టాలి. పోటీగా ఎగురుతున్న గాలి పటాన్ని కూల్చే యత్నంలో ఈ మాంజా కొందరి ప్రాణాలనే బలిగొంటోంది. ఒకరి ఆనందం వేరొకరికి జీవితకాలం బాధను కలిగిస్తోంది.

– మారిశెట్టి జితేంద్ర
రాజమహేంద్రవరం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటొపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

జిల్లాలో 42 బార్లకు రీ నోటిఫికేషన్స్



గుంటూరు కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 42 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో 26, తెనాలిలో 9, పొన్నూరులో 1, మంగళగిరి తాడేపల్లి పరిధిలో 6 చొప్పున మొత్తం 42 బార్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 4 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 5న లాటరీ నిర్వహిస్తామన్నారు.

వసతి గృహాల పనులు ప్రారంభం

- మేలోగా జేఎన్‌టీయూ నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం
- రూ 10 కోట్లు కేటాయించిన కాకినాడ జేఎన్‌టీయూ



బాలికల వసతి గృహంలో కంప తొలగింపు పనులు

8

వేగంగా విజ్ఞాన ప్రదర్శన పనులు

- గుంటూరు వైద్య కళాశాలలో వచ్చే నెల 3న నిర్వహణ
- రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌తో ప్రారంభం



ప్రదర్శన కోసం మెడికోలు సన్నద్ధం

8

ప్రతి ఇంటికి మహోత్సవాల దీవెనలు

- కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్
- ముగిసిన బైబిల్ మిషన్ మహోత్సవాలు



8

అవ్వాతాతల్లో.. ఆనందం

సాఫీగా జరుగుతోన్న పింఛన్ల పంపిణీ



- మొదటి ఐదు స్థానాల్లో గుంటూరు, బాపట్ల
- పంపిణీలో మెరుగ్గానే ఉన్న పల్నాడు జిల్లా
- పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ రిపోర్టులో వెల్లడి

(తెనాలి ఆంధ్రజ్యోతి)

ఒకటో తేదీనే.. ఆ రోజు సెలవు అయితే ఒకరోజు ముందుగానే జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతోంది. వలంటీర్లు లేరు పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు ఎదురవుతాయన్న విమర్శలను పటాపంచలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. దీంతో పింఛన్ల పంపిణీ ప్రహసనంలా కాకుండా ప్రణాళికాబద్ధంగా చేపట్టింది. దీంతో జిల్లా కేంద్రం నుంచి మారుమూల పల్లె వరకు ఎక్కడా అవాంతరం లేకుండా ప్రక్రియ సాఫీగా సాగుతోంది. గత ప్రభుత్వంలో పింఛన్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అక్రమాలను పరిష్కరించి అర్హులకు న్యాయం చేసేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అదే విధంగా పింఛన్ల పంపిణీలో లోటుపాట్లను

(మిగతా 8వ పేజీలో)

గుంటూరు.. ప్రథమం

- పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలో రాష్ట్రంలోనే గుంటూరు జిల్లా తొలి స్థానంలో నిలిచింది. 90.8 శాతం లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.
- బాపట్ల జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. కాగా 89.7 శాతం లబ్ధిదారులు సంతృప్తి తెలిపారు.




ఇంకొల్లులో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (పాత చిత్రం)

నాడు ప్రహసనం.. నేడు పారదర్శకం

గత ప్రభుత్వంలో పింఛన్ల ప్రక్రియే ఓ ప్రహసనంగా మారిన సంగతి తెలి సిందే. అర్హులకు మొండిచేయి చూప డం, అర్హత లేకపోయినా రాజకీయ సిఫార్సులతో జాబితాలో చోటు కల్పిం చి ప్రజాధనాన్ని ఇష్టారీతిన దుర్విని యోగం చేసింది. ఈ ప్రభుత్వం అధికా రంలోకి రాగానే పింఛన్ల అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధి మొత్తాన్ని పెంచడంతో పాటు అనర్హులను ఏరివేసి, అర్హులకు ప్రయోజనాలు అందించ డానికి పక్కా ప్రణాళికా బద్ధంగా వ్యవ హరించిం ది. క్షేత్ర స్థాయి సర్వేతో దివ్యాంగుల సర్టిఫికెట్ల రీవెరి ఫికేషన్, నిబంధనల ప్రకారం పరిశీ లన చేపట్టి అర్హులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా పంపిణీ చేపట్టింది.

రిజిస్ట్రేషన్ చార్జీలకు.. రెక్కలు



- ఒకటో తేదీ నుంచి పెరగనున్న వైనం
- భూ మార్కెట్ విలువ పెంపుపై కసరత్తు పూర్తి
- అభివృద్ధి చెందిన పట్టణాల్లో 5 నుంచి 15 శాతం పెంపు
- నగర, మండల శివారు ప్రాంతాల్లో స్వల్పంగా పెరుగుదల

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో స్వల్పంగా భూముల మార్కెట్ విలువలు పెరగనున్నాయి. ఇందుకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. ఆయా భూముల మార్కెట్ విలువలపై ఇప్పటికే మూడు జిల్లాల పరిధిలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కసరత్తు పూర్తయింది. ఎక్కడెక్కడ ఎక్కువ స్థాయిలో పెంచాలి.. ఎక్కడ స్వల్పంగా పెంచాలి.. ఎక్కడ యథావిధిగా కొనసాగించాలి.. ఎక్కడ తగ్గించాలి.. అనేదానిపై సబ్ రిజిస్ట్రార్లు కసరత్తు పూర్తి చేసి

(మిగతా 8వ పేజీలో)



గుంటూరులో గజం లక్ష..

గుంటూరులోని అమరావతి, హరిహరమహల్ రోడ్లలో గజం ధర రూ.95 వేలు ఉండగా దానిని లక్షకు పెంచారు. గుంటూరు వారి తోటలో గజం రూ.48 వేలు ఉండగా రూ.52 వేలకు, భావాజీనగర్ లో గజం రూ.9 వేలు ఉండగా 10 వేలకు, లాల్‌పురం డొంకలో గజం రూ.13 వేలు ఉండగా రూ.14 వేలకు పెంచారు. తెనాలిలోని షరాఫ్ బజార్‌లో గజం రూ.60 వేలు ఉండగా 65 వేలకు పెంచారు. సుల్తాన్ బజార్ రూ.15 వేలు, లింగయ్యకాలనీలో రూ.10 వేలు, చిర్రావూరులో ప్రస్తుతం గజం రూ.12 వేలు ఉండగా దానిని మరో రూ.500 చొప్పున పెంచారు.

నరసరావుపేటలో గజం రూ.88 వేలు

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మల్లమ్మసెంటర్‌లో గజం రూ.80 వేలు ఉండగా దానిని రూ.88 వేలకు పెంచుతున్నారు. సత్తెనపల్లిరోడ్‌లో ప్రస్తుతం గజం రూ.8 వేలు ఉండగా 9 వేలకు, కోటప్పకొండరోడ్‌లో రూ.10 వేలు ఉండగా రూ.11 వేలకు, ప్రకాష్‌నగర్‌లో గజం రూ.21 వేలు ఉండగా రూ.23 వేలకు పెంచారు.

బాపట్లలో రూ.34 వేలు

జిల్లా కేంద్రమైన బాపట్లలోని గుంటూరురోడ్డులో గజం రూ.32 వేలు ఉండగా రూ.34 వేలకు పెంచారు. ఆంజనేయస్వామిగుడి రోడ్డులో గజం రూ.12 వేలు ఉండగా దానిని రూ.13 వేలకు, మర్రుప్రోలువారిపాలెంలో గజం రూ.4,500 ఉండగా దానిని 5వేలకు పెంచారు.

వెస్ట్ బైపాస్‌తో ఊరట

- భారీ వాహనాల మళ్లింపుతో తప్పిన కష్టాలు
- ట్రాఫిక్ మళ్లింపుపై విజయవాడ, గుంటూరు పోలీసుల దృష్టి

మంగళగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ బైపాస్ రోడ్డులో ఒక భాగం సంక్రాంతి నుంచి అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇప్పటి వరకూ గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా వాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడింది. ప్రధానంగా మంగళగిరి, గుంటూరు మధ్య రాకపోకలు సాగించే వేలాది మందికి భారీ ఊరట లభించింది. వెస్ట్ బైపాస్ ప్యాకేజీ- 4లో భాగంగా గుంటూరు జిల్లా కాజ నుంచి ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లి వరకు చెన్నై- కోల్‌కతా వైపు మూడు లేన్ల రహదారి అందుబాటులోకి వచ్చింది. దీంతో గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే లారీలు, భారీ వాహనాలను ఆ వైపునకే పంపిస్తున్నారు. వాటిని మంగళగిరి-తాడేపల్లి, విజయవాడ నగరాల్లోకి అనుమతించడం లేదు. గుంటూరు జిల్లా, ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఆ మేరకు నిర్ణయం తీసుకుని కాజ జంక్షన్ వద్ద పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాలను వెస్ట్ బైపాస్‌లోకి మళ్లిస్తున్నారు. ఈ కారణంగా గుంటూరు, మంగళగిరి- తాడేపల్లి, విజయవాడ నగర వాసులకు ట్రాఫిక్ కష్టాలు చాలా వరకూ తగ్గాయి. గతంలో వారధి, బెంజ్ సర్కిల్, రమేశ్ హాస్పిటల్ జంక్షన్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు జంక్షన్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యేది. రెండు జిల్లాల పోలీస్ అధికారులు తీసుకున్న నిర్ణయం కారణంగా వేలాది మంది ప్రయాణికులు, వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పాయి. అయితే విజయవాడ నుంచి వచ్చేవారికి మాత్రం మరో రెండు నెలలు కష్టాలు తప్పవని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. మార్చి నెలాఖరునాటికి కోల్‌కతా-చెన్నై రహదారి కూడా అందుబాటులోకి వస్తే ఈ కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని చెబుతున్నారు. ప్రస్తుతం వెస్ట్ బైపాస్ రెండో వైపు పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.



కాజ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ క్యాంపు

మిరపకి.. నల్ల తామర



మిరప పూతపై నల్ల తామర పురుగులు

- నాలుగేళ్లుగా పంటను వీడని పురుగు
- ఎకరాకు రూ.40 నుంచి రూ 50 వేల ఖర్చు
- మందులు పిచికారి చేస్తున్నా తగ్గక రైతుల విలవిల



నల్ల తామర సోకి ఎండిన పూత

(పొన్నూరు, ఆంధ్రజ్యోతి)

మిరపను నల్ల తామర పీల్చి పిప్పిచేస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా అదుపులోకి రాక రైతులు అల్లాడున్నారు. నల్ల తామరకు తోడు తెల్ల దోమ సోకడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్థిక భారంతో పాటు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడున్న అంచనా ప్రకారం ఎకరాకు 5 క్వింటాళ్లకు పైగా మిరప దిగుబడులు తగ్గనున్నాయి. జిల్లాలో తేజ, వండర్‌హాట్, చపాటా వంటి రకాలను ఎక్కువుగా సాగు చేయగా పూత, కాపు దశలో నల్ల తామర నాలుగేళ్లుగా ఆశించి రైతులను నష్ట పరుస్తోంది. 20 నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రతలో దీని ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ పురుగులు ఆకుల కింద వైపు, పువ్వులలో ఎక్కువ సంఖ్యలో చేరి పత్రహరితం గీకి వేసి, రసం పీల్చేస్తున్నాయి. దీంతో కణజాలం దెబ్బతినడంతో ఆకులు మాడిపోయినట్లు కనిపిస్తున్నాయి. పువ్వులు గోధుమ రంగులోకి మారి రాలిపోతున్నాయి. పిల్ల పురుగులు కాయ తయారయ్యే దశలో ఎక్కువగా లేత కాయలను ఆశించి రసం పీల్చడంతో కాయలు గటిగా, గిడసబారి ఇటుకరాయి రంగులోకి మారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

కంపెనీల దోపిడీ..

ఈ ఏడాది విత్తనాల ధరలు, సాగు వ్యయం, కూలీల ఖర్చులు పెరిగాయి. దీంతో మిరప సాగుకు ఖర్చు అధికమైంది. తెగుళ్ల నివారణకు నిర్దిష్ట పురుగు మందులు లేకపోవడంతో ఇతర పంటలకు వాడే వాటినే మిరపకు వాడుతున్నారు. యాజమాన్య పద్ధతులు, పురుగు మందులు వినియోగంపై రైతులకు అధికారులు సూచించక పోవడంతో ప్రైవేట్

(మిగతా 8వ పేజీలో)

65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

పంపిణీ చేసిన జేసీ శ్రీవాస్తవ

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అరవై ఐదేళ్లు దాటిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. జొన్నలగడ్డలో మంగళవారం ఇంటి వద్ద రేషన్ పంపిణీ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు రేషన్‌ను స్వయంగా పంపిణీ చేశారు. ప్రతి నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటికి రేషన్ పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పీ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.



రేషన్ పంపిణీ చేస్తున్న జేసీ శ్రీవాస్తవ

సకాలంలో విధులకు హాజరు కాకుంటే చర్యలు

ఆకస్మిక తనిఖీలో జీఎంసీ కమిషనర్ మయూర్‌అశోక్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉదయం 11 గంటలకు కూడా విధులకు హాజరు కాకపోవడం సరికాదు.. ఉద్యోగులందరూ సకాలంలో విధులకు హాజరు కావాలి.. లేకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం.. అని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. జీఎంసీ ప్రధాన కార్యాలయంలో మం గళవారం వివిధ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో విభాగంలో లేని ఉద్యోగులకు ఆఫ్ డే సెలవు మార్క్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల పనితీరు, ఫైల్స్ తదితరాలకు సంబంధించి మేనేజర్ బాలాజీ బాషకు ఆదేశాలు జారీ చేశారు. మూవ్‌మెంట్ రిజిష్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ప్రతి ఉద్యోగి టేబుల్‌పై విధులు, పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చెత్త ఉండడానికి వీలు లేదని, వినియోగించని వస్తువులను తొలగించాలన్నారు. ప్రతి ఫైల్ ఆన్‌లైన్‌లోనే ఉండాలని, రికార్డ్ రూమ్‌లోని ఫైల్స్ స్కాన్ చేయాలన్నారు.



జీఎంసీ కార్యాలయంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న కమిషనర్ అశోక్

ఏఈ, ఆర్ఐలకు నోటీసులు

విధుల్లో నిర్లక్ష్యంపై ఏఈ(ఇంచార్జి) అప్పలనాయుడు, ఆర్ఐ ఫయాజ్, కల్యాణ మండపాల కేర్ టేకర్ వీర్రాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పాతగుంటూరు, యాదవ బజార్, బాలాజీనగర్, ఎల్బీ నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం కమిషనర్ పర్యటించారు. పాత గుంటూరులో యూజీడీ పైప్‌లైన్ పనులకు సంబంధించిన వివరాలను చెప్పలేకపోవడంతో ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు వివరాలను తనకు అందించాలని డీఈఈని ఆదేశించారు. యాదవుల బజార్‌లోని కల్యాణ మండపం ఆదాయ, వ్యయ, ఇతర వివరాలపై అవగాహన లేని ఆర్ఐకి, మండపం అద్దెల నమోదులో నిర్లక్ష్యంగా ఉన్న కేర్‌టేకర్‌కి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. నూరు శాతం పన్ను వసూళ్లు జరిగేలా క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అడ్మిన్ కార్యదర్శులు, ఆర్ఐలను ఆదేశించారు.

లోకేశ్ పాదయాత్రతో టీడీపీ ఘన విజయం



● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

కేక్ కట్ చేస్తున్న భాష్యం ప్రవీణ్, కుర్రా అప్పారావు, పాల్గొన్న నియోజకవర్గ నాయకులు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉండగా మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రతో గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ అత్యధిక సీట్లు గెలిచిందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. యువగళం పాదయాత్ర చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోకేశ్ యువగళం పాదయాత్రలో మహిళలు, యువత, రైతుల సమస్యలు తెలుసుకున్నారని అన్నారు. రెండు వేలకు పైగా మండలాల్లో పాదయాత్ర చేసి, ప్రజల సమస్యలు తెలుసుకొని తదనుగుణంగా మ్యానిఫెస్టో రూపొందించారన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా మంత్రి లోకేశ్ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. దావోస్ వెళ్లి ఎన్నో కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకు రావడానికి కృషి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో లోకేశ్ మరెన్నో పదవులు అధిరోహించాలని భాష్యం ప్రవీణ్ ఆకాంక్షించారు.

15 రైళ్లకు కరెంట్ బుకింగ్ సదుపాయం

● రైలు బయలుదేరే అరగంట ముందు కూడా అవకాశం ● టికెట్‌పై 10 శాతం రాయితీ

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా ప్రయాణించే 15 రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే జోన్ కరెంట్ బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనివల్ల ఈ రైళ్లు ప్రయాణించే మార్గం మధ్య రైల్వేస్టేషన్లలో రైలు రావడానికి అరగంట ముందు వరకు కూడా మిగిలిపోయిన టిక్కెట్లను కరెంట్ బుకింగ్‌లోకి తీసుకొస్తారు. వీటిపై 10 శాతం రాయితీ కూడా ఉంటుంది. అత్యవసరంగా ప్రయాణం చేయదలచిన వారికి ఈ సదుపాయం ఉపయోగకరంగా ఉంటుందని రైల్వేవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. రైల్వేకు కూడా ఆదాయం సమకూరుతుంది. రైలు నంబరు 07445 కాకినాడ టౌన్-లింగంపల్లి, 07001 చర్లపల్లి-తిరుపతి స్పెషల్, 07002 తిరుపతి- చర్లపల్లి, 07233 చర్లపల్లి-నరసాపూర్, 07446 లింగంపల్లి-కాకినాడ టౌన్, 07448 చర్లపల్లి-కాకినాడ టౌన్, 12748 వికారబాద్-గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్, 17216 ధర్మవరం-మచిలీపట్నం, 17252 కాచీగూడ-గుంటూరు, 17262 తిరుపతి-గుంటూరు, 17626 రేపల్లె-వికారబాద్, 17645 సికింద్రాబాద్- రేపల్లె, 17646 రేపల్లె-సికింద్రాబాద్, 17655 కాకినాడ-పుదుచ్చేరి సర్కారు ఎక్స్‌ప్రెస్‌కు కరెంట్ బుకింగ్ సదుపాయాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

లేఅవుట్‌లతో సమానంగా అభివృద్ధి

● మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ● మౌలిక వసతులపై రాజధాని గ్రామాల్లో గ్రామ సభలు

తుళ్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై పురపాలక మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు మంగళవారం బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడి గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గామాలలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామ సభలతో ఆయా గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. కొత్త లేవుట్‌లలో ఎటువంటి అభివృద్ధి జరుగుతుందో దానికి సమాంతరంగా రాజధాని 29 గ్రామాలలో పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే మౌలిక వసతుల కల్పనపై ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రూ.900 కోట్లతో రాజధాని గ్రామాలలో అభివృద్ధి పనులు తలపెట్టినట్టు వారు తెలిపారు. ఏ సమస్య ఉన్నా పరిష్కరించటానికి అధికారులు అందుబాటులో ఉన్నారని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బోరుపాలెం గ్రామ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, అబ్బరాజుపాలెం అధ్యక్షుడు భోగినేని సుధీర్, రాయపూడి అధ్యక్షుడు మూల్పూరి శ్రీనివాసరావు, మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాయపూడి ల్యాండ్ పూలింగ్ యూనిట్ డిప్యూటీ కలెక్టర్ భాగ్యరేఖ, ఆయా గ్రామాల రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.



రాయపూడి గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాష్ట్ర చరిత్రను మార్చిన యువగళం పాదయాత్ర

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉండగా మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రని తిరగరాసిందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. గుంటూరులోని పొన్నూరు టీడీపీ కార్యాలయంలో మంగళవారం యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, యువగళం పాదయాత్ర వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టిందన్నారు. అప్పటి ప్రభుత్వం పోలీసులు ద్వారా ఎన్ని ఆంక్షలు పెట్టినా, కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు లోకేశ్ పాదయాత్ర విజయవంతంగా సాగిందని చెప్పారు. వైసీపీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా చేసిన దోపిడీని పాదయాత్ర ద్వారా లోకేశ్ ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యం నింపారన్నారు. లోకేశ్ మంత్రిగా విద్యారంగంలో ఎన్నో మార్పులు తెస్తున్నారని, గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం నుంచి పారిపోయిన కంపెనీలను ఆయన వెనక్కు తీసుకొస్తున్నారన్నారు. రూ. లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ లోకేశ్ రాష్ట్రానికి ఆశాకిరణంగా నిలుస్తున్నారని నరేంద్ర కుమార్ పేర్కొన్నారు.

యువగళం పాదయాత్ర ఒక చారిత్రక ఘట్టం

వినుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక ఘట్టమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మంత్రి లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మూడేళ్ళు పూర్తయిన సందర్భంగా వినుకొండలోని చీఫ్‌విప్ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు మంగళవారం సంబరాలు చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొని కేకును కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ, వైసీపీ కార్యకర్తలు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా వెనుకడుగు వేయకుండా లోకేశ్ పట్టుదలతో 3,132కిమీ పాదయాత్ర పూర్తిచేసి ప్రజల పక్షాన నిలిచారన్నారు.



వినుకొండలో చీఫ్ విప్ జీవీకి కేకు తినిపిస్తున్న జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన

సచివాలయ సీఎస్వోకు ఇండియన్ సర్వీస్ మెడల్



పోలవరపు వెంకట శేష నాగ మల్లికార్జునరావు

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ ముఖ్య భద్రతాధికారి (సీఎస్వో) ఏపీఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పోలవరపు వెంకట శేష నాగ మల్లికార్జునరావుకు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ సర్వీస్ మెడల్ ప్రకటించింది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరుకు చెందిన మల్లికార్జునరావు గుడివాడ, విజయవాడలో చదువుకున్నారు. 1989లో హిమాచల్ ప్రదేశ్ పారా మిలటరీలో శిక్షణ పొంది, ఢిల్లీ, హరియాణ, చండీఘడ్‌లలో ఐటీబీపీ యూనిట్లలో పనిచేశారు. 1993లో ఏపీఎస్పీఎఫ్‌లో చేరి, డీజీ హెడ్ ఆఫీస్, ఐడీపీఎల్, హైకోర్టు, కేటీపీఎస్, ఆర్టీపీపీ, టీటీడీ, ఓఎన్జీసీ, రాజమండ్రి, కడప, గన్నవరం ఎయిర్‌పోర్టులు, జోనల్ కమాండెంట్ ఆఫీస్ డీడీవో, ఏవోగా పనిచేశారు. గతేడాది రాష్ట్ర సచివాలయ సీఎస్వోగా బాధ్యతలు చేపట్టారు. 36 ఏళ్ల సర్వీస్‌లో 27 నగదు రివార్డులు, 17 సర్వీస్ ఎంట్రీలు, 8 కమెన్డేషన్, 4 అప్రిసియేషన్స్, 2006లో ఏపీ పోలీస్ సర్వీస్ అవార్డు, 2013లో ఏపీ బెస్ట్ సర్వీస్ అవార్డు పొందారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం ప్రకటించిన ఇండియన్ సర్వీస్ మెడల్‌ను త్వరలో అందుకోనున్న మల్లికార్జునరావును ఎస్పీఎఫ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	155, 164, 175
చికెన్ విత్ స్కిన్(కిలో)	300.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	310.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	80,039
అమ్మకాలు	77,055
నిల్వ	15,241

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	22000
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	25000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	23500
దేవనూరు డీలక్స్	14000	25000
ఆర్మూరు	12000	17000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20000
నెంబరు. 5	13500	21000
273	----	----
341	13000	22500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13500	19500
బ్యాడిగి 355	13500	21500
దేవనూరు డీలక్స్	---	---
తాలుకాయలు	7000	11000

సహకరించకపోతే సమ్మెలోకి

● సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక హెచ్చరిక
● వంటా-వార్పుతో ఉద్యోగుల వినూత్న నిరసన



సహకార సంఘ కార్యాలయం ఎదుట వంట చేస్తూ వినూత్న నిరసన చేపట్టిన ఉద్యోగులు

గుంటూరు (తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించకపోతే ఫిబ్రవరి 16వ తేది నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట సహకార ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 2019లో తీసుకొచ్చిన జీవో నెం 36ను వెంటనే అమలు చేయాలని కోరారు. 2019, 2024 సంవత్సరాలకు వేతన సవరణ చేయాలని, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. ఇతర విభాగాల్లో మాదిరిగానే పదవి విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఉద్యోగులకు రూ. 5 లక్షలు ఆరోగ్య బీమా కల్పించాలని, విధుల్లో మరణిస్తే ఉద్యోగి కుటుంబానికి రూ. 20 లక్షలు టర్మ్ పాలసీ ఇవ్వాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 6వ తేది వరకు పలు రూపాల్లో నిరసనలు, 9 నుంచి 12వ తేది వరకు ఆర్‌సీఎస్ కార్యాలయం ఎదుట వంటా-వార్పు, 13న కార్యాలయాల ముట్టడి చేస్తామన్నారు. అప్పటికీ సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. మంగళవారం నిరసనల్లో వెంకట రామయ్య, రఘురామ్, కొండవీటి చిన్నారావు, గోగినేని కిషోర్ కుమార్, నిమ్మగడ్డ శ్రీనివాసరావు, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం

● రెంటచింతలలో హోరాహోరీగా ఎడ్ల పందేలు



మొదటి బహుమతిని సాధించిన శిరీష, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత

రెంటచింతల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కానుకమాత 176వ తిరునాళ్లను పురస్కరించుకొని రెంటచింతలలో నిర్వహిస్తున్న ఎడ్లపోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మంగళవారం రెండు పళ్ల విభాగంలో పోటీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 4082.10 అడుగుల దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచింది. ప్రత్తిపాడు మండలం కొండేపాడుకు చెందిన చాగంటి శ్రీనివాస్ చౌదరి, ఉప్పుగుండూరుకు చెందిన రిత్విక చౌదరి, యువాన్ చౌదరిల సంయుక్త ఎడ్ల జత 3880.02 అడుగుల దూరం బండను లాగి రెండో స్థానంలో నిలవగా, పల్నాడు జిల్లా దొండపాడుకు చెందిన ఎర్రం రాజశేఖర్, యశ్వంత్‌కు చెందిన ఎడ్ల జత 3603.1 అడుగుల దూరం బండను లాగి మూడో స్థానంలో, ఉమ్మారెడ్డి ప్రభుకుమారి తలగడదీవి, నాగాయలంక, ఫిరంగిపురం మండలం కండ్రిగకు చెందిన రామకృష్ణమాచారి కంబైన్డ్ జత 3361.05 దూరం బండను లాగి నాలుగో స్థానంలో, తెలంగాణ నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలానికి చెందిన శివరామకృష్ణ ఎడ్ల జత 3258.02 అడుగుల దూరం బండను లాగి ఐదో స్థానంలో నిలిచాయి. మొత్తం 15 జతలు పోటీల్లో పాల్గొనగా 10 జతలకు బహుమతులు, ఇతర జతలకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. కానుకమాత కోడెగిత్తెల నిర్వాహకులైన వైఎల్ మర్రెడ్డి, ఏరువ జోజిరెడ్డి, సుమంత్‌రెడ్డి, శౌర్రెడ్డి, రామకృష్ణ, రాయపరెడ్డి, మూలి రాజారెడ్డి, ఇన్నారెడ్డి, కె.జోసఫ్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, వైఎఫ్ మర్రెడ్డి, వెన్నాకోటిరెడ్డి, గాదె కస్పారెడ్డి తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భార్య ప్రవర్తనపై అనుమానంతో హత్య

తెనాలి క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకొని ఆమెను దిండుతో ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. ఈ ఘటన తెనాలి రామలింగేశ్వరపేట గౌడకాలనీలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తెనాలికి చెందిన బండ్ల సాయిబాబుకి నల్గొండకు చెందిన శిరీష (26)తో 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. వారు కొద్ది సంవత్సరాల పాటు హైదరాబాద్‌లో నివాసం ఉండి ఆరు నెలల క్రితం సొంతూరు తెనాలికి తరలి వచ్చారు. సాయిబాబు క్యాటరింగ్ పనులకు వెళుతుండగా భార్య శిరీష బ్యూటీపార్లర్‌లో పని చేస్తోంది. కొంత కాలంగా శిరీష ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న భర్త ఆమె మంచంపై నిద్రపోతుండగా మంగళవారం ఉదయం మొఖంపై దిండుపెట్టి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. హత్య సమాచారాన్ని హైదరాబాద్‌లో ఉన్న బావమరిదికి, తెనాలిలో ఉన్న తన బంధువులకు ఫోన్ ద్వారా అందించి పరారయ్యాడు. వెంటనే బంధువులు శిరీషను ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

31 నుంచి విజ్ఞాన్‌లో బాల మహోత్సవ్

గుంటూరు విద్య జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో విజ్ఞాన్ బాల మహోత్సవ్ 2కే26ను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కేవీ కృష్ణ కిషోర్ తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఈ బాల మహోత్సవ్‌కు సంబంధించిన పోస్టర్లను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ కేవీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ, చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వారికి సరైన వేదిక కల్పించడమే లక్ష్యంగా ఈ బాల మహోత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరిచే అవకాశాన్ని ఈ వేడుక కల్పిస్తుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం స్టూడెంట్ కోఆర్డినేటర్లు సీహెచ్ సాత్విక్ 7382261632, బి.రోషిత 7799874416ను సంప్రదించాలన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

బావిలో పడి బాలుడి మృతి

బాపట్ల రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన బాపట్ల జిల్లా ధరివాద కొత్తపాలెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పిట్టు సాయిరెడ్డి (8) అనే బాలుడు సోమవారం పాడుపడ్డ బావిలో పడి మృతి చెందాడు. బాపట్ల పట్టణ పోలీసులు బాలుడి మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. తండ్రి శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


ఐక్యత చాటుతున్న ప్రజా, కార్మిక, బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకులు

వేతన సవరణ ఒప్పందాన్ని అమలు చేయాలి

● ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణ ఒప్పందంలో అంగీకరించిన అంశాలతో పాటు ఇతర డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకులు జయకుమార్, కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు మంగళవారం, గుంటూరు జీటీ రోడ్డులోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన ప్రదర్శన, సభ నిర్వహించారు. నిరసనలకు సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, ఇతర సంఘాలు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఏడాది మార్చిలో కుదిరిన ఒప్పందంలో భాగంగా అన్ని శనివారాలు బ్యాంకు సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు కోటా మాల్యాద్రి, వై.నేతాజీ, ఉద్యోగుల సంఘ నాయకులు బాషా, కోటిరెడ్డి, కళ్యాణ్, రామకృష్ణ, సాంబశివరావు, రవిచంద్రారెడ్డి, వీరారెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం

● బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. స్థానిక లాలాపేట, వాజ్‌పేయి భవనంలో మంగళవారం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తుళ్ళిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన కిసాన్ మోర్చా విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ రైతులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రొంగల గోపి శ్రీనివాస్, వైవీ సుబ్బారావు, దొడ్డ నాగరాజు, చరక కుమార్ గౌడ్, స్పైసెస్ బోర్డు మెంబర్ కొత్తూరి సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వి.గంగాధర్, బీమినేని చంద్రశేఖర్ ప్రసంగించారు.


మాట్లాడుతున్న చిగురుపాటి కుమారస్వామి, పాల్గొన్న బీజేపీ నాయకులు

రేపటి నుంచి ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ సమావేశాలు


● ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 29 నుంచి నాలుగు రోజుల పాటు గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపం, శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి తెలిపారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సమావేశాలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ ఆర్.శారదా జయలక్ష్మీదేవి, ఏఐకేఎస్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు, ఆర్.వీర రామయ్య తదితరులు ప్రారంభిస్తారని, అనంతరం వికసిత్ భారత్ 2047 అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభ సభకి ప్రజా నాట్య మండలి గోరేటి వెంకన్న హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కె.అజయకుమార్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, పాశం రామారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరెడ్డి

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షల విరాళాన్ని యడ్లపాడు మండలం, ఉన్నవ గ్రామానికి చెందిన ప్రముఖ ఆడిటర్ ముక్తా ప్రభాకర్ ప్రకటించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, బాలికల వసతి గృహంలో మంగళవారం సమితి అధ్యక్ష, కార్యదర్శులు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరికి ఈ చెక్కును అందజేశారు. మల్లెల హరేంద్రనాద్ చౌదరి మాట్లాడుతూ సమితి గౌరవ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు ప్రేరణతో ప్రభాకర్ ముందుకు వచ్చి ఈ విరాళాన్ని అందజేసినట్టు చెప్పారు. అనంతరం దాతను సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కావూరి రవిచంద్ర, సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, పట్టాభి సీతారామారావు, మర్రిపూడి సీతారామయ్య, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, గోరంట్ల పున్నయ్య, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


కమ్మజన సేవా సమితి సభ్యులకు చెక్కును అందజేస్తున్న ముక్తా ప్రభాకర్ తదితరులు

ఎమ్మార్సీలలో బిల్స్ జాప్యం నివారించండి

గుంటూరు (విద్య) జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎమ్మార్సీలలో తగినంత సిబ్బంది లేక ఉపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు రాజశేఖర్‌రావు ఎం.కళాధర్ అన్నారు. ఎస్ఆర్‌లు అప్ టూ డేట్ కావడం లేదని, ఏళ్ళ తరబడి ఎంట్రీలు పెండింగ్‌లో ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డీఈవో డాక్టర్ ఎస్ కే సలీం బాషాకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. సహాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, కేదార్ నాథ్, కార్యవర్గ సభ్యుడు కాలేషా వలి పాల్గొన్నారు.

నారాయణ స్తోత్రంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై మంగళవారం ఆదిశంకరాచార్యులచే విరచితమైన నారాయణ స్తోత్రంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కేవీ కోటేశ్వరరావు ప్రవచిస్తూ శ్రీమహావిష్ణువును కీర్తించే అత్యంత మహిమాన్వితమైన స్తోత్రం అన్నారు.

వైభవంగా స్వామి వారి రథోత్సవం

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ కాలనీ, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన శ్రీ విజయ గణపతి స్వామి వారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం విశేష పూజలు, గణపతి హోమం సాయంత్రం వేళలో సిద్ధి, బుద్ధి సమేత శ్రీ విజయ గణపతి స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది.

హౌసింగ్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


కలెక్టరేట్‌లో గృహ నిర్మాణంపై సమీక్షిస్తోన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని హౌసింగ్ లే అవుట్ లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో పీఎంఎవై ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్‌లలో ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు ప్రాధాన్య క్రమంలో ఏర్పాటుకు సంబంధిత అధికారులు వెంటనే ప్రతిపాదనలు అందించాలన్నారు. హౌసింగ్ లే అవుట్‌లలో లోగడ వివిధ మౌలిక సదుపాయాలు అభివృద్ధికి వినియోగించిన నిధుల వివరాలను అందించాలన్నారు. లే అవుట్‌ల వారీగా లబ్ధిదారులకు కేటాయించినవి, కేటాయించిన వాటిలో నిర్మాణాలు ప్రారంభించినవి, పూర్తి అయినవి, కేటాయించకుండా ఖాళీగా ఉన్న ప్లాట్‌ల వివరాలను మ్యాప్‌లతో సహా నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆప్షన్-3 లో నిర్మించిన ఇళ్ళలో స్టేజ్, క్వాలిటీ డివియేషన్స్‌ను కాంట్రాక్టర్లతో వెంటనే సరి చేసేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగర కమిషనర్ కే.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, తెనాలి సబ్ కలెక్టర్ ఇన్‌చార్జి లక్ష్మి కుమారి, హౌసింగ్ పీడీ ప్రసాదు, ఆర్డీవో శ్రీనివాసులు, తెనాలి కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు, తహశీల్దార్లు సుభాని, వెంకటేశ్వర్లు, క్షమారాణి, నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఉపా సెల్ పీవో సింహాచలం పాల్గొన్నారు.

హామీల సాధన కోసం దశలవారీ ఆందోళన : ఎస్టీయూ

గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హామీల అమలు కోసం దశలవారీగా పోరాటం చేస్తామని ఎస్టీయూ నాయకులు ప్రకటించారు. మంగళవారం వెంకటరమణ ఎస్టీయూ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా హామీలలో ఎటువంటి చలనం లేదని, అందుకే రాష్ట్రోపాధ్యాయ సంఘం దశల వారి ఉద్యమానికి పిలుపు ఇచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి పెదబాబు, గుంటూరు జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు వేస్కు బాజీ, ప్రధాన కార్యదర్శి వై శ్యాంబాబు, ఆర్థిక కార్యదర్శి హనుమంత ప్రసాద్, గుంటూరు నగర అధ్యక్షులు వెంకయ్య, జోజప్ప, దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పికిల్ బాల్ పోటీల విజేత విజయవాడ జట్టు

గుంటూరు(క్రీడలు) జనవరి 27(ఆంధ్రజ్యోతి) పికిల్ బాల్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక గోరంట్లలోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజయవాడకు చెందిన చరణ్, ఉమేష్‌ల జట్టు పురుషుల డబుల్స్‌లో విన్నర్స్ ట్రోఫీని గెలుపొందింది. డి.గోపాలరావు, గిరీష్ జట్టు రన్నర్ ట్రోఫీని సాధించగా, తృతీయ స్థానంలో గుంటూరుకు చెందిన కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. మిక్సడ్ డబుల్స్‌లో వరుసగా విజయవాడకు చెందిన గిరీష్, జోత్స్నల జట్టు, చరణ్, శ్రావ్యాల జట్టు, పి.ఆనంద్ కుమార్, అమృతల జట్టు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్స కార్యక్రమానికి ఆపిల్ డెంటల్ కేర్ అధినేత డాక్టర్ తోట హనుమంతరావు ఏపీ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్. శ్రీధర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి నగదు బహుమతులను, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత కె.శ్రీకాంత్, రోటరీ క్లబ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ, జిల్లా పికిల్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, కోశాధికారి సుష్మా, పి.భరత్, వలి, కే.అరుణ్ కుమార్, సాయి రాహుల్, కే.రవి, చరణ్, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ సమావేశ మందిరానికి నడింపల్లి పేరు పెట్టటం హర్షణీయం

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సమావేశ మందిరానికి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గుంటూరు మున్సిపల్ తొలి ఛైర్మన్, గుంటూరు కేసరి దివంగత నడింపల్లి నరసింహారావు పేరు పెట్టటం హర్షణీయమని రాజ్యాంగ చర్చావేదిక కార్యదర్శి అవధానుల హరి తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశ నాయకులందరూ గుంటూరు కేసరిగా పిలిచే నడింపల్లి నరసింహారావు పేరును నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌కు పెట్టాలని 2005లోనే అప్పటి మేయర్ చుక్కా ఏసురత్నం హయాంలోనే తీర్మానం చేయటం జరిగిందని గుర్తుచేశారు. ఇప్పటికి అది అమల్లోకి రావటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పీఎస్ మూర్తి, ఆర్‌వీ సింగరయ్య తదితరులున్నారు.

బస్టాండ్‌లో ఈయూ ఉద్యోగుల నిరసన

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు-1 యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెల్లవారుజామున ఐదు గంటలకు విధుల్లో చేరే సమయంలోనే బస్టాండ్‌లో ఎర్రబ్యాడ్జీలతో నినాదాలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నపాటి సమస్యలను పరిష్కరించటంలో కూడా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, గత ఏడాది జూలైలో ఇచ్చిన మెమోరాండంపై హామీలను నేటికీ పరిష్కారం చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా మొండి వైఖరి విడనాడాలన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం గేట్ మీటింగ్‌లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు గేరా ప్రకాష్, లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, జె.రత్నాకర్, డి.శ్రీను, మస్తాన్‌వలి, ఎంఎస్‌పీ, ఎస్ఎస్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

బలహీన వర్గాల దిక్సూచి జన్ నాయక్ కర్పూరి ఠాకూర్

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి, బలహీన వర్గాలకు దిక్సూచిగా జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ నిలిచారని ప్రముఖ పారిశ్రామికవేత్తలు రమేష్ బాబు, విష్ణుకుమార్ సెన్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ కొనియాడారు. స్థానిక అమరావతి రోడ్డులో నాయి బ్రాహ్మణ నంద యువసేన ఆధ్వర్యంలో మంగళవారం ఠాకూర్ 102వ జయంతి ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ నంద యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్పూరీ ఠాకూర్ స్మారక పురస్కారాన్ని పారిశ్రామికవేత్త రమేష్ బాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీనంద, తాడివలస దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సీజీకేవీఎన్ కళాశాల విద్యార్థిని ప్రతిభ

గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థిని తుపాకుల నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వారు హరిద్వార్‌లో నిర్వహించిన ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనపరచి జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్, జూనియర్ స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఇండియా పతకాన్ని సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ, అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, కళాశాల జాయింట్ సెక్రటరీ మాజేటి ప్రసాద్, కోచ్ కమ్రుద్దీన్ తదితరులు అభినందించారు.

అలరించిన పౌరాణిక పద్య నాటకాలు

గుంటూరు(తూర్పు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో సంస్థ 32 వ వార్షిక ఉత్సవాలలో భాగంగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ నిర్వహణలో పౌరాణిక పద్య నాటక సన్నివేశ ప్రదర్శన జరిగింది. మొదటిగా గయోపాఖ్యానంలోని సన్నివేశాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడుగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, అర్జునుడిగా ఉల్లంగుల బ్రహ్మయ్య, రెండవదిగా శ్రీకృష్ణరాయబారం పడకసీనులోని సన్నివేశాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడుగా గుర్రపుశాల శ్రీనివాస్, సుయోధనుడుగా అట్ల రామకృష్ణారెడ్డి, అర్జునుడుగా బ్రహ్మయ్యలు పౌరాణిక పద్యాలతో ఆహూతులను అలరించారు. అనంతరం ఆలయ పాలక మండలి సభ్యులు డాక్టర్ ప్రభుదాస్ దంపతులను, కళాకారులను ఘనంగా సత్కరించారు.

యువగళంతోనే 2024లో తిరుగులేని విజయం

● ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల


మాట్లాడుతున్న దేగల ప్రభాకర్

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర తోనే 2024లో కూటమికి తిరుగులేని విజయం సాధ్యమయ్యిందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. గుంటూరు నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాత ఇచ్చిన స్ఫూర్తి, తండ్రి నుంచి అలవర్చుకున్న పట్టుదల, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు, యువత గళంగా మారి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మొదలై నేటితో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. రాష్ట్ర ప్రజల తరపున మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. కుప్పంలో మొదలై రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించిందని గుర్తు చేశారు. అవరోధాలు.. అడ్డంకుల్ని అధిగమించి.. మొక్కవోని దీక్షతో జనంలోకి లోకేశ్ వెళ్లారన్నారు. ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సమావేశమై వారిలో నూతనోత్సాహం తెచ్చారు. మంత్రి నారా లోకేశ్ నాటి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని అకుంఠిత దీక్షతో చేపట్టిన 'యువగళం' పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసి వైసీపీ విధ్వంస, అరాచక పాలనకి చరమగీతం పాడిందన్నారు.

అమరావతి నిర్మాణాన్ని అడ్డుకోవాలని వైసీపీ కుట్రలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్


మాట్లాడుతున్న సురేష్‌కుమార్

గుంటూరు సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న అమరావతి రాజధానిని చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ విమర్శించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, రాజధానిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆపివేయాలనే దురుద్దేశంతో వైసీపీ నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నదుల పక్కన రాజ ధాని నిర్మాణం చేయకూడదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యకరమని అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల రాజధానులు నదుల ప్రవాహాల పక్కనే నిర్మించబడ్డాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందే విధంగా అత్యాధునిక వసతులతో అమరావతి రాజధాని నిర్మాణం కొన సాగుతోందన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా పనులు జరుగుతున్న తీరే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరుకు నిదర్శనమని తెలిపారు. రాజధానిలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించడం ద్వారా చంద్రబాబు తన దూరదృష్టిని చాటారని చెప్పారు.

చెస్ పోటీల్లో స్టెమ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ నైన్ చెస్ పోటీల్లో స్థానిక విద్యానగర్లోని స్టెమ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ జ్యోతి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విద్యార్థులు ఆర్.రోహిత్, కే.శ్రీరామ్, కేవీఎస్ స్కందన్, రోహన్, జె.ధ్రువ, ఎం.కౌశిక్ తదితరులు ట్రోఫీతో పాటు నగదు బహుమతి సాధించారని వివరించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఫాదర్ జ్యోతి రాజు

యువ ఇంజనీర్లు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించే ఆలోచనల నుంచే నూతన ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని కేఎల్‌సీఐఈ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహరాజు అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ డిజైన్ అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆలోచనల నుంచి ఆవిష్కరణల వరకు గల వివిధ దశలను విద్యార్థులకు ఆయన వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్ అండ్ డి డైరెక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ నార్నె శ్రీనివాసరావు, ఐఈఈఈ చాప్టర్ కన్వీనర్ డాక్టర్ త్రిపుర, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు చేయూత చెక్కులు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మృతి చెందిన పోలీసులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ వకుల్ జిందాల్ ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.4 లక్షల చేయూత చెక్కులను అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం వారికి చెక్కులను అందించారు. ఎస్ఐ టి.వెంకటరావు 2025 నవంబరు 17న మరణించారు, ఏఎస్ఐ ఎల్ రవీంద్రబాబు 2025 ఆగస్టు 20న మృతి చెందారు. ఏఎస్సై ఎం బ్రహ్మానాయుడు 2025 అక్టోబరు 25న మరణించారు, ఏఆర్ ఎస్సై ఎస్ రవీంద్ర సింగ్ 2025 డిసెంబరు 13న మృతి చెందారు. వారి కుటుంబాలకు మానవతా దృక్పథంతో అందజేసామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ కార్యదర్శి, లాలాపేట సీఐ శివ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, కోశాధికారి హుస్సేన్, అసోసియేషన్ సభ్యులు మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

బీఆర్ స్టేడియం కూల్చివేత

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరిన బీఆర్ స్టేడియం ను కూల్చివేస్తున్నారు. దాని స్థానంలో నూతన భవనం నిర్మించనున్నారు. విజయవాడకు చెందిన ఓ సంస్థ కూల్చివేత టెండర్ దక్కించుకున్నారు. కాంట్రాక్ట్ సంస్థ ఆయా కట్టడాలు కూల్చి అందులోని స్ర్కాబ్‌ను వేరు చేసి ఇనుమును స్టేడియానికి అప్పగించి, మిగిలిన మట్టిని కాంట్రాక్టర్ అమ్ముకోవచ్చు. అయితే కొంతకాలంగా తొలగించిన ఇనుప చువ్వలను అక్కడే వదిలివేయడంతో దానిని కొంత మంది అక్రమార్కులు కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ కి చెందిన పత్తిపాటి శివకి 14 సంవత్సరాల క్రితం నాగమల్లేశ్వరితో వివాహం జరిగింది. సదరు నాగమల్లేశ్వరి ఈ నెల 25న కొడుకు రామేశ్వర్ (13), కూతురు వెన్నెల (11)లతో సహా ఎక్కడికో వెళ్ళిపోయింది. దీంతో భర్త శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


యువగళం పాదయాత్ర మొదలై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

లోకేశ్ పాదయాత్ర రాష్ట్ర భవితకు దిక్సూచి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువ నాయకుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మూడేళ్ల క్రితం చేపట్టిన యువగళం పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ దిశ-దశను మార్చిందని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభమై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్ల ప్రస్థానంలో మంత్రి లోకేశ్ కేవలం ఒక పార్టీ నాయకుడిగానే కాకుండా, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకున్న ప్రజా నాయకుడిగా ఎదిగారని తెలిపారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోన్న నిబద్ధత గల నాయకుడు లోకేశ్ అని కొనియాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి కోసం సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు.


పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

యువగళం పాదయాత్రతో ప్రజల గుండెల్లో లోకేశ్

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. యువనేత లోకేశ్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర 3 ఏళ్లయిన సందర్భంగా పశ్చిమ కార్యాలయంలో మంగళవారం జరిగిన వేడుకల్లో ఆమె కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ యువగళం పాదయాత్ర అనేది కేవలం రోడ్డుపై నడిచిన యాత్ర కాదని, రాష్ట్ర ప్రజల్లో, పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్సాహం, స్ఫూర్తి నింపిన ఒక చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు పశ్చిమలో మహిళా గ్రీవెన్స్

పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం వికాస్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రాన్స్‌జెండర్లకు ఉపాధిని కల్పించటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవి మాటిచ్చారు.

ప్రజలకు అండగా సీఎంఆర్ఎఫ్

కష్టాల్లో ఉన్న ప్రజలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 47 మంది బాధితులకు మంగళవారం ఆమె రూ.91.31 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం టీడీపీ అనుబంధ సంఘాల నియోజకవర్గ కమిటీలను ఆమె ప్రకటించారు. తెలుగు మహిళ, తెలుగు యువత, బీసీ సెల్, వాణిజ్య విభాగం, మైనారిటీ సెల్ నియోజకవర్గ కమిటీలను ప్రకటించారు.

వైసీపీ పతనానికి యువగళం నాంది : కనపర్తి

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాకుండా పతనమవటానికి మంత్రి నారా లోకేశ్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర నాంది పలికిందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. లోకేశ్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర నేటికి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొరిటపాడు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తేవటానికి అహో రాత్రులు కృషి చేస్తుంటే, వైసీపీ అధినేత జగన్ వాటిని ఏవిధంగా అడ్డుకోవాలో బెంగుళూరులో కూర్చొని కుట్రలు చేస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామప్రసాదు, బాలాజీ, నాయకులు మూల్పూరి పేరయ్య, సాయి వెంకటేష్, కిలారి రత్తయ్య, శివన్నారాయణ, శివబ్రహ్మం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


యువగళం నేపథ్యంలో కేక్ కట్ చేస్తున్న కనపర్తి, కార్పొరేటర్ కొమ్మినేని

అరెస్టు కోసం తహతహలాడుతున్న అంబటి

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : రెడ్ బుక్కుకు నా కుక్క కూడా భయపడదని మాజీ మంత్రి అంబటి రాంబాబు పదే పదే ర్యాబిస్ సోకిన వ్యక్తిలా మాట్లాడుతున్నాడని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబటి తన గురించి ఎక్కువగా ఊహించుకుంటూ, అరెస్టు కోసం తహ తహ లాడిపోతున్నాడని మండిపడ్డారు. బియ్యం దొంగ పేర్ని నాని, కల్తీ లిక్కర్ డాన్ జోగి రమేష్ సచ్చీలురని అవినీతి అనకొండ అంబటి సర్టిఫికెట్ ఇవ్వటం సిగ్గుచేటని అన్నారు. జగన్ రెడ్డి ప్రాపకం కోసం కొడాలి నాని, అంబటి రాంబాబు, పేర్ని నాని, అనిల్, రోజా రెడ్డి, ద్వారంపూడి, వంశీ లాంటి వారు పరిధులు దాటి మాట్లాడినందుకే తమ పార్టీకి ప్రతిపక్షహోదా కూడా దక్కలేదని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం అంబటి మర్చిపోకూడదన్నారు. సంక్రాంతి సంబరాల్లో తన డాన్స్ అద్భుతంగా ఉందని అందరూ పొగుడుతున్నారని తనకు తాను కితాబు ఇచ్చుకొని శునకానందం పొందటం అంబటికే చెల్లిందన్నారు. రాబోయే రోజుల్లో అంబటి కూడా రోజాతో పాటు జబర్దస్తు కార్యక్రమంలో డాన్సులు వేసుకోవాల్సిందేనని అన్నారు. తాను వైఎస్ కుటుంబానికి బానిసనని పదే పదే చెప్పుకోవటానికి అంబటి సిగ్గు పడాలని, రాజకీయ నాయకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలే తప్ప ఆర్థిక నేరస్తులకు కాదని అన్నారు.

ఏఐ అభివృద్ధికి వరల్డ్ ఏఐ గవర్నెన్స్ ఫౌండేషన్ కృషి

● సంస్థ సలహాదారు చందు సాంబశివరావు

గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆవిష్కరణ అభివృద్ధికి, దుర్వినియోగ నియంత్రణకు వరల్డ్ ఏఐ గవర్నెన్స్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆ సంస్థ సలహాదారు చందు సాంబశివరావు అన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణలు వేగవంతం అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆవరణలో సుందరీకరణ పనులు


అస్థిపంజరం నమూనా సిద్ధం చేస్తున్న విద్యార్థులు


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుందరాచారి


అనాటమీ విభాగంలో అలంకరణ

వేగంగా విజ్ఞాన ప్రదర్శన పనులు

● గుంటూరు వైద్య కళాశాలలో 3న నిర్వహణ ● ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం అనంతరం నిర్వహించనున్న విజ్ఞాన ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) పనులు వేగంగా జరుగుతున్నాయి. నెల రోజులుగా సుమారు వెయ్యి మంది వైద్య విద్యార్థులు, 150 మంది బోధనా సిబ్బంది దీని కోసం శ్రమిస్తున్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి నేతృత్వంలో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఫిబ్రవరి 3వ తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారు.

● టికెట్ ధర రూ.150

ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 వరకు ప్రదర్శన ఉండనుంది. రోజుకు 2500 నుంచి గరిష్ఠంగా ఐదు వేల మంది వరకు సందర్శకులను అనుమతించ నున్నారు. వ్యక్తిగత టిక్కెట్ ధర రూ.150గా నిర్ణయించారు. విద్యా సంస్థలు, ఇతర సంస్థల నుంచి బృందాలుగా వచ్చే వారికి టికెట్ ధర రూ.100గా నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సంప్రదిస్తే టిక్కెట్ ధరల్లో మరికొంత తగ్గింపునకు అవకాశం ఉందని కళాశాల వర్గాలు తెలిపాయి. ప్రదర్శన విజయవంతం చేసేందుకు 12 కమిటీలు పనిచేస్తున్నాయి. సైన్స్ ఎగ్జిబిషన్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య విద్యార్థులు ఫ్లాష్ మాబ్, ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రూ.2 కోట్ల భారీ వ్యయంతో ఆకర్షణీ యంగా, వినోదాత్మకంగా, విజ్ఞాన దాయకంగా ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో మెడ్‌ఫ్యూజన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్లను మంగళవారం జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ఆవిష్కరించారు.

● ఆసక్తికరంగా విజ్ఞాన ప్రదర్శన

విజ్ఞాన ప్రదర్శనలో పలు ఆసక్తికర అంశాలను పొందుపర్చారు. అనాటమీ విభాగంలో మానవ మృతదేహం డిసెక్షన్ చేసి శరీర భాగాలను సందర్శకులకు చూపుతారు. అదేవిధంగా గుండె, కాలేయం, కిడ్నీలు వంటి పలు నిజమైన అవయవాలను ప్రదర్శనలో ఉంచుతారు. ఇక్కడ డ్యాన్సింగ్ స్కెలిటన్ ప్రదర్శన చిన్న పిల్లలను విశేషంగా ఆకర్షిస్తుంది. హృదయ స్పందన నిలిచిన రోగులకు అత్యవసరంగా నిర్వహించాల్సిన సీపీఆర్ డెమాన్‌స్ట్రేషన్ ఏర్పాటు చేశారు. మనిషిని పోలిన బొమ్మపై దీనిని చేస్తారు. వివిధ రకాల శస్త్రచికిత్సలు నిర్వహించే పద్ధతులు, వాటి కోసం వినియోగించే ఆధునిక వైద్య పరికరాల ప్రదర్శన ఉంటుంది. ఫిజియాలజీ విభాగంలో మనిషిలో రక్త ప్రసరణ జరిగే విధానం అందరికీ అర్థమయ్యేలా మోడల్స్‌లో ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని స్టాల్స్‌లో బీపీ, షుగర్, పరీక్షలు ఉచితంగా చేస్తారు. రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ వంటి పలు రకాల పరీక్షలు నిర్వహించే విధానం సందర్శకులకు వివరిస్తారు. కేన్సర్, గుండె జబ్బులు వంటి జీవనశైలి వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై కూడా ప్రదర్శనలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు సైన్స్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా...

జీవ విజ్ఞాన శాస్త్రం, వైద్య రంగం పట్ల పాఠశాల, కళాశాలల్లో విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ప్రధానంగా ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించి స్ఫూర్తి పొంది తాము వైద్యులుగా ఎదిగామని చాల మంది డాక్టర్లు ఇప్పటికీ చెబుతుంటారు. అంతటి ప్రాముఖ్యమున్న ఈ విజ్ఞాన ప్రదర్శన నేటి తరం యువతకు ముఖ్యంగా హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు చక్కటి స్ఫూర్తిని అందిస్తుందని వైద్య కళాశాల వర్గాలు భావిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ చార్జీలకు.. రెక్కలు

(5వ పేజీ తరువాయి)

ఉన్నతాధికారులకు జాబితాలను పంపారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ఆయా ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 24నే ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆమోదం లభించింది. కాగా నేడు, రేపు మిగిలిన ప్రక్రియను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఏఏడీ నెంబర్ల పరిధిలో ఏ స్థాయిలో పెంచుతున్నారనే దానిని ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఆయా ప్రాంతాలను బట్టి 5 నుంచి 15 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. నగర, పట్టణ, మండల శివారు ప్రాంతాల్లో స్వల్పంగా పెంచారు. వాస్తవానికి రూరల్ ప్రాంతాల్లో ప్రతి రెండేళ్ళకు ఒకసారి, అర్బన్ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి భూముల మార్కెట్ విలువలను సవరించాల్సి ఉంటుంది. అయితే రూరల్ ప్రాంతంలో 2019లో ఒకసారి, కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 2022 ఏప్రిల్‌లో కొంతవరకు ఆయా కొత్త జిల్లాలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో కొంతమేర భూముల మార్కెట్ విలువలను పెంచారు. ఆ తర్వాత 2023 లోనూ అక్కడక్కడ భూముల ధరలు సవరించారు. గత ఏడాది ఫిబ్రవరి 1న రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను సవరిం చారు. ఈ ఏడాది కూడా భూముల మార్కెట్ విలువలు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పట్టణ శివారు ప్రాంతాల్లోనూ స్వల్పంగా భూముల మార్కెట్ విలువలను పెంచను న్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు మార్కెట్లో కంటే కూడా ప్రభుత్వ మార్కెట్ విలువలు ఎక్కువగా ఉండడం గమనార్హం. పెంచిన మార్కెట్ ధరలపై సేల్ డీడ్‌కు రిజిస్ట్రేషన్ చార్జీలు 7.5 శాతం చెల్లించాల్సి ఉంటుంది.

రియల్‌ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం

ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైన నేపథ్యంలో ప్రస్తుతం పెరగనున్న రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంపుదల తీవ్ర ప్రభావం చూపనుందని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని ఆయా వర్గాలు ఆశగా ఎదురుచూశాయి. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన ఐదారు నెలలు భూముల క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. ఆ తర్వాత క్రయవిక్రయాలు స్థంభించి రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలింది. ఈ పరిస్థితుల్లో భూముల మార్కెట్ విలువలు పెంచడమంటే మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగానే ఉంటుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు.


హాజరైన భక్తులు, ముగింపు ప్రార్థన చేస్తున్న బైబిల్ మిషన్ కన్వీనర్ శామ్యూల్ కిరణ్

ప్రతి ఇంటికి మహోత్సవాల దీవెనలు

● మహోత్సవాల కన్వీనర్ శామ్యూల్ కిరణ్
● ముగిసిన బైబిల్ మిషన్ మహోత్సవాలు

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేవుని సన్నిధి ద్వారా ప్రతి కుటుంబానికి ఆశీర్వాదం లభిస్తుందని, ఆ దీవెనలు మహోత్సవాల రూపంలో ప్రతి ఇంటికి చేరాలని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో దేవుని కృప నిలవాలని, కుటుంబాలు ఐక్యతతో, సమృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశీర్వాదమే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాదని పేర్కొన్నారు. భూమి, ఆకాశం, వెండి, బంగారం కంటే దేవుని వాక్యం ఎంతో విలువైందని, అదే మానవ జీవితానికి నిజమైన మార్గదర్శకమని స్పష్టం చేశారు. దేవుని వాక్యాన్ని ఆచరించడం ద్వారా కుటుంబాలు ఆధ్యాత్మికంగా, సామాజికంగా బలపడతాయని తెలిపారు. మహోత్సవ నిర్వహణకు కొన్ని ఆటంకాలు వచ్చినప్పటికీ దేవుడే మార్గం సరళం చేశాడని అన్నారు. మహోత్సవాలకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జిల్లా యంత్రాంగానికి, వివిధ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బైబిల్ మిషన్ మహోత్సవాల నివేదికను అందజేశారు.

మిరపకి .. నల్లతామర

(5వ పేజీ తరువాయి)

కంపెనీలు లాభాల కోసం అనేక రకాల పురుగు మందులను సిఫార్సు చేస్తున్నాయి. వాటిని వాడి రైతులు మరింతగా నష్టపోతున్నారు. పంట వేసిన మొదట్లో ఆకు ముడత వైరస్ వాహకంగా ఉండే తెల్లదోమ, ఆ తదుపరి నల్ల తామరతో దిగుబడి గణనీయంగా తగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

యథేచ్ఛగా బయో ఉత్పత్తుల విక్రయాలు

కొన్ని కంపెనీలు సోషల్ మీడియాను వేదికగా బయో ఉత్పత్తుల పేరుతో రైతులను దారుణంగా మోసం చేస్తున్నాయి. రూ.400 ఖరీదు కూడా చేయని మందులను రూ.1,600 నుంచి 1,800 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దఎత్తున రైతులు బయో ఉత్పత్తులు పిచికారి చేసి నల్ల తామర తగ్గక తీవ్రంగా నష్టపోతున్నారు. ఆయా మందులకు ఎటువంటి అనుమతులు కూడా లేవు. అనుమతులు.. లైసెన్సులు లేని మందులను ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోకుంటే రైతులు మోసపోయి ఇంకా నష్టపోయే ప్రమాదం ఉంది.

యాజమాన్య పద్ధతులు..

నల్ల తామర పురుగు నివారణకు రైతులు నివారణ చర్యలను పాటించాలని జిల్లా ఉద్యానాధికారి ఐ వెంకట్రావు తెలిపారు. భూమిలో పదును చూసుకుని ఎకరానికి 200 కేజీల వేపచెక్కను వేసుకోవాలి. అవకాశం ఉన్నచోట సిల్వర్ రిఫ్లెక్టెడ్ పాలిథిన్ మల్చ్, డ్రిప్ ద్వారా నీటిని అందిస్తే పురుగు ఉధృతి తగ్గుతుంది. పంట బెట్టకు గురికాకుండా చూసుకోవాలి. రైతులు సామూహికంగా నీలి రంగు జిగురు అట్టలను ఎకరానికి 40-50 వరకు మొక్క ఎత్తుకు దగ్గరగా పెట్టుకుంటే తల్లిపురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. పొలం గట్లపై ఉన్న కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు నిర్మూలించాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు బవేరియా బస్సియానా, లికాని సీలియం లీకాని అనే జీవ శిలీంద్ర నాశనులను 5గ్రా లీటరు నీటికి జిగురుతో కలిపి పిచికారి చేయాలి. 5% వేపగింజల కషాయాన్ని కాని, వేపనూనె 10,000 పీపీఎం 1మి.లీ. గాని లేదా కానుగనూనె 2 మి.లీ లీటరు నీటికి జిగురుతో కలిపి సిఫారసు చేసిన ఇతర మందులతో పిచికారి చేసుకోవచ్చు. ఎకరానికి బ్రోప్లానిలైడ్ 300గ్రా ఎల్ఎస్‌సీ 34 మిలీ లేదా ఫ్లక్సామెటమైడ్ 10 ఈసీ 160 మీలీ లేదా ఐసోసైక్లోసీరం 240 మిలీ లేదా ఫిప్రోనిల్ 80 శాతం డబ్ల్యుజీ 40 గ్రా. ఫిప్రోనిల్ 5 శాతం ఎస్సీ 400 మీలీ లేదా స్పైరోటెట్రామెట్ 15.30 శాతం, 200 మీలీ లేదా థయామెథొక్సాం 25డబ్ల్యుజీ 80గ్రా. లేదా స్పినటోరం 11.7 శాతం ఈసీ 200 మీ.లీ. వంటి రసాయన పురుగు మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.

అవ్వాతాతల్లో.. ఆనందం

(5వ పేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు. ఎక్కడికక్కడ చర్యలు తీసుకుంటోంది. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటూ లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చూస్తోంది. ఈ క్రమంలో పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల సంతృప్త స్థాయిపై ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే చేపట్టింది. ఈ సర్వేలో గుంటూరు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. కాగా పల్నాడు జిల్లాలో కూడా ఆశాజనకంగానే లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీపై జరిగిన అభిప్రాయ సేకరణలో సానుకూల స్పందనపై మూడు జిల్లాల యంత్రాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. లబ్ధిదారుల్లో 10 శాతం మందికి సర్వేకు సంబంధించి రాండమ్ కాల్స్ వెళ్లినట్లు సమాచారం. నెల మొదటి తారీఖునే తమ ఇళ్లకు వచ్చి పింఛన్ ఇస్తున్నారని లబ్ధిదారులు చెప్పగా, మంజూరులో అవినీతి లేదని, తమ నుంచి డబ్బులు తీసుకోలేదని కొత్తగా లబ్ధిదారులుగా జాబితాలో చోటు దక్కిన వారు సర్వేలో చెప్పినట్లు తెలుస్తోంది. పింఛన్ల పంపిణీ విషయంలో ప్రక్షాళన జరిగిన తర్వాత ప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వే చేపట్టగా సంతృప్తి స్థాయిలో పూర్తి జనామోదం కనిపించడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు అంశాలపై సర్వే..

ప్రభుత్వం నిర్వహించిన పబ్లిక్ పాజిటివ్ పర్‌సెప్షన్ సర్వే మూడు అంశాల ప్రాతిపదికన సాగింది. ఇందులో పింఛన్ల మంజూరు, పంపిణీలో అవినీతి, అధికారుల ప్రవర్తన, ఇంటికి తెచ్చి నగదు ఇవ్వడంలో ఏమైనా ఇబ్బందులున్నాయా అనే అంశాలపై ప్రశ్నల రూపంలో లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. 2024 జూన్ నుంచి 2025 మే వరకు తొలి దశలో, 2025 జూన్ నుంచి ఆగస్టు 25 వరకు, అదేవిధంగా గత ఆగస్టు నుంచి నవంబరు వరకు ఇలా మూడు నెలల ప్రాతిపదికన సర్వేను నిర్వహించింది. గతేడాది డిసెంబరుతో పాటు ఈ నెల పింఛన్ల పంపిణీ సంతృప్తి స్థాయిపై కూడా ప్రభుత్వం లబ్ధిదారుల అభిప్రాయం తెలుసుకుంది.


తంగెడ కృష్ణానది బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన రంగు మారిన నీరు

కృష్ణమ్మకు ఏమైంది..?

● నదిలో పచ్చగా మారిన నీరు
● కాళ్ళు, చేతులు కడుక్కోవాలన్నా స్థానికుల్లో భయం
● నూనె కలసినట్లు కన్పిస్తున్న నీరు

దాచేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల జీవనాడిగా పూజలందుకుంటూ వస్తున్న కృష్ణా నది నీరు రంగు, రుచి, వాసన మారటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పవిత్రంగా భావించే కృష్ణా నది నీరు గతంలో స్వచ్ఛంగా, తెల్లగా, తియ్యగా ఉండేవి. ఏమైందో తెలియదు కాని కృష్ణా నది నీరు కొద్ది నెలలుగా ఆకు పచ్చ, నీలం రంగుల్లోకి మారి జిడ్డుగా ప్రవహిస్తోంది. దాచేపల్లి పరిసర ప్రాంతాల్లో కృష్ణా నది నీటిని ఆధారంగా చేసుకొని పలు గ్రామాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. నది ఇలా అకస్మాత్తుగా రంగులు మారటం, నీటిలో రసాయనాల వాసన వస్తుండటంతో ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నదీ తీరంలో నివశిస్తున్న రైతులు మాట్లాడుతూ ఇంతక ముందు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడ లేదని అంటున్నారు. నీటిని తాకితే చేతులకు జిడ్డు పట్టినట్టుగా ఉంటోందని, పంటలకు ఈ నీరు వాడాలంటే భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన కాలుష్య నియంత్రణా మండలి అధికారులు నదీ జలాల నుంచి శ్యాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పంపించారు. ఐతే ఇప్పటి వరకు స్పష్టమైన నివేదికలు వెలువడక పోవటంతో మరింత అనుమానాలకు తావిస్తుంది. పరిశ్రమల వ్యర్థాల, రసాయన కాలుష్యం, పై ప్రాంతాల నుంచి విడుదలవుతున్న మలినాలే కారణమా? అనే ప్రశ్నలు ప్రజల్లో మెలుగుతోంది. కలుషితం లేని నీటిగా పేరుగాంచిన కృష్ణా జలాలను తాగునీరుగా ఉపయోగించే గ్రామాల ప్రజలు తీ ప్ర ఆందోళనలో ఉన్నారు. నీటి నాణ్యత పై స్పష్టత లేక పోవటంతో పిల్లలు, వృద్ధులు, గర్భిణీల ఆరోగ్యం పై ప్రభావం పడే అవకాశముందని ప్రజలు భయపడుతున్నారు. సంబంధిత శాఖలు ఇప్పటికైనా సమన్వయంతో స్పందించి కాలుష్యానికి మూలాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, గుర్రపు డెక్క వల్ల నీరు కలుషితమైనట్టుగా గుంటూరుకు చెందిన ఈ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తెలిపారు. కృష్ణా నదిని శుభ్రపరిచేందుకు రూ.పది లక్షలు ఖర్చవుతుందని, క్లీనింగ్ టీమ్ నివేదిక అందజేసినట్టు చెప్పారు.


పొందుగుల కృష్ణా నది వద్ద నీటిపై తేలుతున్న నూనె లాగా కన్పిస్తున్న చెత్త

● కృష్ణానదిలో ప్రమాదకర రసాయనాలు లేవు : గురజాల ఆర్డీవో మురళీకృష్ణ



కృష్ణా నదిలో ప్రమాదకర రసాయనాలు లేవు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తితో నీటిని సేకరించి పరీక్షలకు పంపించాం. త్వరలోనే శుభ్రత చర్యలు చేపడతాం. రసాయనాలు కలవటడంతో నదీ జలాలు కలుషితం కాలేదు. ప్రజలు భయపడొద్దు. సాగు, తాగు నీటికి ఇబ్బంది లేదు.

ఆధ్యాత్మిక కేంద్రంగా.. బుద్ధిస్ట్ సెంటర్

● సాగర్ డ్యాం దిగువున శరవేగంగా నిర్మాణం
● రూ. 25 కోట్లతో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులు


నిర్మాణంలో బుద్ధిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

విజయపురిసౌత్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో రూ.25 కోట్లతో రూపుదిద్దుకుంటున్న బుద్ధిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాగార్జున సాగర్ డ్యాం దిగువ కృష్ణానది సమీపంలో ఈ ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయి. బుద్ధుని ఆధ్యాత్మిక చరిత్రను చాటిచెప్పేలా సెంటర్‌ను నిర్మిస్తున్నారు. అక్కడ పచ్చని గార్డెన్స్‌తోపాటు సందర్శకుల కోసం రెస్టారెంట్‌ను కూడా నిర్మిస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఏపీకి కేటాయించిన బుద్ధవనాన్ని తెలంగాణలోని ఓ మంత్రి లాబీయింగ్‌తో హిల్‌కాలనీకి తరలిపోయింది. ఇప్పుడు సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో బుద్దిస్ట్ ఎక్సపీరియన్స్ సెంటర్ నిర్మిస్తుండడంతో స్థానికులతోపాటు పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వసతి గృహాల పనులు ప్రారంభం

● మేలోగా జేఎన్‌టీయూ నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యం ● రూ 10 కోట్లు కేటాయించిన కాకినాడ జేఎన్‌టీయూ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కొంత కాలంగా నిలిచిపోయిన నిర్మా ణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఆంధ్ర జ్యోతిలో వసతి గృహాల పనులు నిలిపివేతపై వెలువడిన కథనాల ప్రభావంతో వర్సిటీ అధికారులు స్పందించి పనులు ప్రారంభించారు. బాలికల, బాలుర వసతి గృహాల్లో పనులు చేపట్టారు. మే నెలాఖరుకు రెండు వసతి గృహాల పనులు పూర్తి చేయాలని వర్సిటీ లక్ష్యంగా నిర్ణయించింది. ఈ మేరకు పనులు వేగవంతం చేస్తున్నారు. వసతి గృహాలకు సంబంధించి నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు రూ 10 కోట్లు వర్సిటీ మంజూరు చేసింది. 2023లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లనే కొనసాగిస్తున్నారు. బాలురు, బాలికల వసతి గృహాలను 720 పడకల సామర్థ్యంతో, భోజనశాలలను అన్ని వస తులతో నిర్మిస్తున్నారు. బాలికల వసతి గృహానికి సంబంధించి ప్రహరీ గోడ నిర్మాణం, గేటు ఏర్పా టుకు మరో రూ.1.10 కోట్ల నిధులు మంజూ రయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్లు నిర్వహించేందుకు వర్సిటీ ఏర్పాట్లు చేసింది. పనులు పూర్తయితే నాలుగు నెలల్లో వందలాది మంది విద్యార్థుల వసతి వెతలు తీరతాయి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బాలుర వసతి గృహంలో నిర్మాణ పనులు

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,61,950 ▲	1,48,450 ▲	3,87,000 ▲
విజయవాడ	1,67,000 ▲	1,55,000 ▲	3,56,000 ▲
విశాఖపట్నం	1,63,937 ▲	1,48,450 ▲	3,87,000 ▲
రాజమండ్రి	1,61,950 ▲	1,48,450 ▲	3,52,000 ▲
ప్రొద్దుటూరు	1,65,500 ▲	1,52,260 ▲	3,58,000 ▲
ముంబై	1,58,900 ▲	1,45,550 ▲	3,44,560 ▲

జోయాలుక్కాస్‌లో ప్రత్యేక ఆఫర్

- 'ఈ సంవత్సరపు అతి పెద్ద జువెలరీ సేల్' షురూ
- తయారీ ఛార్జీలు 40% వరకు తగ్గింపు

హైదరాబాద్ (ఆంధ్ర జ్యోతి బిజినెస్): ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ తన షోరూమ్స్‌లో ఆభరణాలు కొనుగోలు చేసే వారి కోసం ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. 'ఈ సంవత్సరపు అతి పెద్ద జువెలరీ సేల్' పేరుతో ప్రారంభించిన ఈ ఆఫర్ ఈ నెల 23 నుంచి వచ్చే నెల 22 వరకు అమల్లో ఉంటుంది. 12 దేశాల్లోని 190కి పైగా కంపెనీ షోరూమ్స్‌లో ఈ ప్రత్యేక ఆఫర్ ఉంటుంది. ఈ ఆఫర్ సందర్భంగా కంపెనీ నగల తయారీ ఛార్జీలపై 40% వరకు తగ్గింపు ప్రకటించింది. పది లక్షలకుపైగా డిజైన్లలో ఉండే నగలపై కొనుగోలుదారులు ఈ ఆఫర్ అందుకోవచ్చని కంపెనీ తెలిపింది.

ఫార్మాకు లాభం.. ఆటోకు కష్టం



ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
టెక్స్‌టైల్స్, అక్వా కంపెనీలకూ ప్రయోజనమే

న్యూఢిల్లీ: భారత-యూరోపియన్ యూనియన్ (ఈయూ) కూటమి దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అనేక విధాలుగా మన ఎగుమతులకు కలిసిరానుంది. ఈ ఒప్పందంతో వచ్చే ఏడేళ్లలో మన దేశం నుంచి ఈయూ దేశాలకు ఎగుమతయ్యే 99.5% వస్తువులపై దిగుమతి సుంకాల భారం భారీగా తగ్గనుంది. ఈయూ దేశాలకు ఎగుమతయ్యే మత్స్య, వస్త్ర, రసాయనాలు, రబ్బరు, ప్రాథమిక లోహాలు, రత్నాభరణాలు, తోలు ఉత్పత్తుల ఎగుమతుల మీదైతే దిగుమతి సుంకాలు పూర్తిగా రద్దవుతాయి. ట్రంప్ సుంకాలతో కుదేలవుతున్న భారత ఎగుమతి కంపెనీలకు ఇది పెద్ద శుభవార్తే. ఈ ట్రేడ్ డీల్‌తో మన ఫార్మా, ఐటీ కంపెనీలు కూడా ప్రయోజనం పొందనున్నాయి. భారత-ఈయూ ఎఫ్‌టీఏ ప్రభావం ఏ ఏ రంగాలు, ఏఏ కంపెనీలకు మేలు చేస్తుందంటే?

ఫార్మా రంగం

ప్రస్తుతం మన దేశ ఫార్మా ఎగుమతులపై ఈయూ 11% దిగుమతి సుంకాలు విధిస్తోంది. ఎఫ్‌టీఏతో ఈ భారం జీరోకి తగ్గనుంది. ప్రస్తుతం మన కంపెనీలు ఏటా ఈయూ దేశాలకు 295 కోట్ల డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నాయి. మన మొత్తం ఫార్మా ఎగుమతుల్లో ఇది 12 శాతానికి సమానం. అయితే ఈయూ ఫార్మా దిగుమతుల్లో మన కంపెనీల వాటా ప్రస్తుతం 2.2% మాత్రమే. మన ఫార్మా కంపెనీలు ఏదైనా కొత్త ఔషధాన్ని ఈయూ దేశాలకు ఎగుమతి చేయాలంటే అందుకు అవసరమైన అనుమతుల కోసం మూడు లక్షల యూరోల వరకు ఫీజుగా చెల్లించాల్సివస్తోంది. అన్నీ సక్రమంగా ఉన్నా అనుమతులు లభించేందుకు రెండు మూడేళ్ల సమయం పడుతోంది. ఎఫ్‌టీఏతో ఈ ఫీజుల భారం తగ్గడంతో పాటు, కొత్త ఔషధాల మార్కెటింగ్ కోసం పెట్టే అప్లికేషన్లను అక్కడి రెగ్యులేటరీ సంస్థలు ప్రాధాన్యతా క్రమంలో త్వరగా ఆమోదించనున్నాయి. ఇది మన ఫార్మా కంపెనీలకు బాగా కలిసి వచ్చే అంశం.

ప్రయోజనం పొందే కంపెనీలు
డాక్టర్ రెడ్డీస్, లూపిన్, సన్ ఫార్మా, బయోకాన్, అరబిందో ఫార్మా, టోరెంట్ ఫార్మా, ఇప్కా ల్యాబ్స్

రసాయనాలు: మన దేశం నుంచి ఎగుమతయ్యే రసాయనాలపై ఈయూ దేశాలు ప్రస్తుతం 12.8% దిగుమతి సుంకం విధిస్తున్నాయి. అయినా 2024లో మన దేశం ఈయూ దేశాలకు 890 కోట్ల డాలర్ల విలువైన రసాయన ఉత్పత్తులు ఎగుమతి చేసి, అక్కడి నుంచి 770 కోట్ల డాలర్ల విలువైన రసాయనాలు దిగుమతి చేసుకుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఈయూ దేశాల్లో ఇంధన ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ప్రభుత్వాలు, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ స్పృహ పెరగడంతో కొన్ని రసాయన ఉత్పత్తుల కంపెనీలు మూతపడ్డాయి. దీంతో ఈయూకు చెందిన అనేక కెమికల్ కంపెనీలు తమ ఉత్పత్తులను ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండే వర్ధమాన దేశాల నుంచి ఔట్‌సోర్స్ చేసుకుంటున్నాయి. ఎఫ్‌టీఏతో దిగుమతి సుంకం జీరోకి రానుంది. ఇది మన దేశ కెమికల్ కంపెనీలకు కలిసి రానుంది.

ప్రయోజనం పొందే కంపెనీలు: ఎస్ఆర్ఎఫ్, నవీన్ ఫ్లోరిన్, గుజరాత్ ఫ్లోరోకెమికల్స్, ఆరతి ఇండస్ట్రీస్, పీసీబీఎల్, జూబిలెంట్ ఇన్‌గ్రివియా, ప్రీవి స్పెషాలిటీ, టాటా కెమికల్స్ విష్ణు కెమికల్స్, వినతి ఆర్గానిక్స్, ఏథర్ ఇండస్ట్రీస్.

వస్త్ర పరిశ్రమ: మన వస్త్ర దిగుమతులపై ఈయూ దేశాలు ప్రస్తుతం 10 నుంచి 12% వరకు దిగుమతి సుంకాలు విధిస్తున్నాయి. దీంతో జీరో సుంకాలతో దిగుమతయ్యే వియత్నాం, బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమతో మన కంపెనీలు ఈయూ దేశాల్లో పెద్దగా పోటీపడలేకపోతున్నాయి. తాజా ఎఫ్‌టీఏతో ఈయూ దేశాల్లో మన వస్త్ర ఎగుమతులు సైతం జీరో డ్యూటీ క్యాటగిరిలోకి రానున్నాయి. బంగ్లాదేశ్, వియత్నాంతో పోలిస్తే మన దేశంలో ప్రధాన ముడి పదార్థమైన పత్తి, నూలు దారం, ఇతర ముడి పదార్థాలు చౌక. దీంతో ఈ ఎఫ్‌టీఏ ఎగుమతి రంగంలో ఉన్న భారత టెక్స్‌టైల్ కంపెనీలకు బాగా మేలు చేయనుంది.

ప్రయోజనం పొందే కంపెనీలు : కేపీఆర్ మిల్స్, పెరల్ గ్లోబల్, వెల్‌స్పన్ లివింగ్., గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్, నితిన్ స్పిన్నర్స్, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, ట్రైడెంట్, ఇండో కౌంట్.

మత్స్య ఎగుమతులు: మన మత్స్య ఎగుమతులపై ఈయూ ప్రస్తుతం 26% వరకు సుంకాలు విధిస్తోంది. ఎఫ్‌టీఏతో ఇది జీరోకి రానుంది. ఈ వెసులుబాటు అమెరికా సుంకాలతో కష్టాల్లో పడ్డ ఆంధ్రప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్‌ల లోని రొయ్యల ఎగుమతి దారులకు మేలు చేయనుంది.

ప్రయోజనం పొందే కంపెనీలు: అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ అవంతి ఫుడ్స్, కోస్టల్ కార్పొరేషన్.

రత్నాభరణాలు : ట్రంప్ సుంకాల పోటుతో దేశంలోని రత్నాభరణాల రంగం బాగా దెబ్బతింది. గుజరాత్‌లో డైమండ్ పాలిషింగ్ రంగంలోనే దాదాపు లక్షన్నర మంది రోడ్డున పడ్డారు. ఈ ఎఫ్‌టీఏతో మన రత్నాభరణాలపై ప్రస్తుతం విధిస్తున్న 15-25% దిగుమతి సుంకం జీరోకి తగ్గనుంది. ఈ వెసులుబాటు టైటాన్, సెంకో గోల్డ్, గోల్డియం ఇంటర్నేషనల్, వైభవ్ గ్లోబల్ వంటి కంపెనీలకు కలిసి రానుంది.

ఆటో మొబైల్ రంగం

భారత-ఈయూ ఎఫ్‌టీఏతో ఈయూ దేశాలకు చెందిన ప్రీమియం, లగ్జరీ కార్లపై దిగుమతి సుంకం దశలవారీగా బాగా తగ్గనుంది. ప్రస్తుతం వీటి దిగుమతులపై మన దేశం 110% వరకు దిగుమతి సుంకం విధిస్తోంది. కొన్ని పరిమితులకు లోబడి దశలవారీగా దీన్ని 10 శాతానికి కుదిస్తారు. ఈ కుదింపు దేశంలోని కార్ల కంపెనీలు ఉత్పత్తిచేసే ప్రీమియం కార్లపై పడుతుందని భావిస్తున్నారు. ఈ కారణంగానే మంగళవారం స్టాక్ మార్కెట్‌లో టాటా మోటార్స్, మారుతీ సుజుకీ, హ్యుండై మోటార్స్ కంపెనీల షేర్లపై కనిపించింది. అయితే గుడ్డిలో మెల్లలా ఆటో మొబైల్ విడి భాగాల తయారీ కంపెనీలకు మాత్రం ఈ ఒప్పందం మేలు చేస్తుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 28వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	550
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	135	విజయవాడ	143
వరంగల్	135	గుంటూరు	143
కరీంనగర్	135	ఒంగోలు	143
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	124
కర్నూలు	135	నెల్లూరు	129
విశాఖపట్నం	135	అనంతపురం	129
గోదావరి	143		

భారత్‌లో విమానాల తయారీ

- ఎంబ్రాయర్‌తో అదానీ గ్రూప్ జట్టు

ఏపీ లేదా గుజరాత్‌లో ప్లాంట్?



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్.. బ్రెజిల్ ఏరోస్పేస్ కంపెనీ ఎంబ్రాయర్‌తో జట్టు కట్టింది. మన దేశంలో విమానాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్‌తో ఎంబ్రాయర్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. విమానయాన రంగంలో మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలకు ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఊతమివ్వనుంది. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో ఒకటైన భారత్‌లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విమాన సేవలు మరింత పెరిగేందుకూ తోడ్పడనుంది. దేశీయ విమాన రంగంలో ఈ ఒప్పందం కీలక మైలురాయి అని మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ ఎంఓయూలో భాగంగా ఎంబ్రాయర్ ప్రయాణికుల విమానాల తయారీకి అవసరమైన ఫైనల్ అసెంబ్లింగ్ లైన్‌ను అదానీతో కలిసి భారత్‌లో ఏర్పాటు చేయనుంది. ఇక్కడ విడిభాగాలన్నింటినీ కూర్చి పూర్తి విమానాన్ని తయారుచేస్తారు. 70 నుంచి 146 సీట్ల వరకు సామర్థ్యంతో కూడిన ఎంబ్రాయర్ రీజినల్ జెట్ విమానాలు స్వల్ప, మధ్య స్థాయి దూర మార్గాల్లో ప్రయాణించేందుకు పనికొస్తాయి. ఏపీలోని భోగాపురం లేదా గుజరాత్‌లోని ధోలేరాలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశాలున్నట్టు కొందరి కథనం.

భారత్‌లో తొలి యూనిట్.. : ఫిక్స్‌డ్ వింగ్ ప్రయాణికుల విమానాల తయారీకి సంబంధించి దేశంలో ఇదే తొలి అసెంబ్లింగ్ యూనిట్ కానుంది. ఈ ప్రతిపాదిత ఎఫ్ఏఎల్‌ను ఎక్కడ ఏర్పాటు చేస్తారు, పెట్టుబడులెంత... ఎప్పటికి అందుబాటులోకి వస్తుంది..? వంటి వివరాలను మాత్రం వెల్లడించలేదు. ప్లాంట్ ఏర్పాటుకు సరైన స్థలం కోసం అన్వేషణ జరుగుతున్నదని, మరికొద్ది నెలల్లో ఓ నిర్ణయానికి రావచ్చని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ అన్నారు.

ఇండియాపై ఎంబ్రాయర్ ఫోకస్: భారత విమానయాన మార్కెట్లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఎంబ్రాయర్ గత ఏడాది అక్టోబరులోనే ఢిల్లీలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. కంపెనీకి చెందిన ఈ-జెట్ విమానాలు 2005లోనే భారత్‌లోకి ప్రవేశించాయి. దాదాపు 50 విమానాలు భారత వైమానిక దళం, ప్రభుత్వ ఏజెన్సీలు, బిజినెస్ జెట్ ఆపరేటర్లతోపాటు వాణిజ్య ఎయిర్‌లైన్ స్టార్ ఎయిర్‌కు సేవలందిస్తున్నాయి.

విమానాశ్రయాల నిర్వహణ నుంచి విమానాల తయారీ వరకు..

ఇప్పటికే ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధి, నిర్వహణ, విమానాల ఎంఆర్‌ఓ (నిర్వహణ, మరమ్మతు, సర్వీసింగ్), పైలట్ల శిక్షణ విభాగాల్లోకి ప్రవేశించిన అదానీ గ్రూప్ ఈ ఒప్పందంతో విమానాల తయారీలోకీ అడుగుపెట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీతోపాటు సప్లై చెయిన్, ఆఫ్టర్ మార్కెట్ సర్వీసెస్, పైలట్ ట్రైనింగ్ విభాగాల్లోనూ కలిసి పనిచేయాలని అదానీ, ఎంబ్రాయర్ భావిస్తున్నాయి.

ఒక్క రోజే రూ.40,500 పెరిగిన వెండి

కిలో రూ.3.7 లక్షలకు చేరిక

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ జెట్ స్పీడ్‌లో దూసుకుపోతోంది. మంగళవారం కిలో వెండి ధర కనివిని ఎరుగని రీతిలో రూ.40,500 పెరిగి సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.3.7 లక్షలకు చేరింది. వెండి ధర ఒకే రోజు ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. మేలిమి బంగారం (99.9% స్వచ్ఛత) సైతం 10 గ్రాములు రూ.7,300 పెరిగి రూ.1.66 లక్షలను తాకాయి.

ఈక్విటీ మార్కెట్లో రికవరీ

మంగళవారం ఈక్విటీ మార్కెట్ రికవరీ బాటలో పయనించింది. సెన్సెక్స్ 319.78 పాయింట్ల లాభంతో 81,857.48 వద్ద, నిఫ్టీ 126.75 పాయింట్ల లాభంతో 25,175.40 వద్ద ముగిశాయి.. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1000 పాయింట్ల మేరకు ఆటుపోట్లు చవి చూసింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 22 పైసలు లాభపడి 91.68 వద్ద ముగిసింది.

స్పోర్ట్స్

పాక్ స్థానంలో బంగ్లా?

బుద్ధి చెప్పే యోచనలో ఐసీసీ

న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యం ఇస్తున్న టీ20 వరల్డ్‌కప్ ప్రతిష్ఠను దిగజార్చడానికి పాకిస్థాన్ ఇంకా కుటిల పన్నాగాలు పన్నుతూనే ఉంది. తాజాగా మెగా టోర్నీని పాకిస్థాన్ బాయ్‌కాట్ చేసే అవకాశాలున్నట్టు వార్తలు వస్తున్నాయి. టోర్నీ విషయమై మరో నాలుగైదు రోజుల్లో నిర్ణయం తీసుకొంటామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మొహిసిన్ నక్వీ చెప్పాడు. అయితే, పాక్ తప్పుకొంటే ఆ స్థానంలో బంగ్లాదేశ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తున్నట్టు సమాచారం. భారత్‌లో తమ ఆటగాళ్లకు భద్రత లేదనే సాకుతో తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లా డిమాండ్ చేసింది. ఐసీసీ దీన్ని తోసిపుచ్చడంతో బెట్టువీడని బంగ్లా టోర్నీ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. అయితే, బంగ్లాకు మద్దతుగా పాక్ కూడా టోర్నీని బాయ్‌కాట్ చేయాలనే ఆలోచనలో ఉంది. ఇదే జరిగితే పాక్ స్థానంలో బంగ్లాను ఆడించేందుకు ఐసీసీ పావులు కదుపుతున్నట్టు సమాచారం. లంకలోనే ఆడతామనే బంగ్లా డిమాండ్ కూడా ఒకరకంగా నెరవేరే అవకాశాలు ఉన్నాయి.

వ్యతిరేకిస్తున్న మాజీలు: పొట్టి కప్ నుంచి వైదొలగానే పాక్ ఆలోచనను ఆ దేశ మాజీ క్రికెటర్లు వ్యతిరేకిస్తున్నారు. పాక్ క్రికెట్‌ను ఫణంగా పెట్టి బంగ్లాకు మద్దతుగా నిలవాల్సిన అవసరమేంటని ప్రశ్నిస్తున్నారు. ఐసీసీతో సంబంధాలు చెడితే పాక్ క్రికెట్‌కే నష్టమని హెచ్చరిస్తున్నారు. ఎంతో ఆలోచించి తుది నిర్ణయం తీసుకోవాలని మాజీ కెప్టెన్లు ఇంజమాముల్ హక్, మహ్మద్ యూసుఫ్ అన్నారు. 'టోర్నీ నుంచి పాక్ తప్పుకోవడం సరికాదు. మన జట్టులో ప్రతిభగల ప్లేయర్లు ఉన్నారు. వారి సత్తా ప్రపంచానికి తెలియాల'ని హక్ చెప్పాడు. కాగా, అసలు టోర్నీని బహిష్కరించడానికి తగిన కారణాలు కనిపించడం లేదని మాజీ బ్యాటర్ హరూన్ రషీద్ అన్నాడు.

అక్రిడిటేషన్ల తిరస్కరణ?: బంగ్లాదేశ్ టోర్నీ నుంచి తప్పుకోవడంతో ఆదేశ మీడియాకు కూడా ఐసీసీ అక్రిడిటేషన్లు తిరస్కరించినట్టు తెలుస్తోంది. అయితే ఐసీసీ తీరుపై విమర్శలు వ్యక్తం కావడంతో దిద్దుబాటు చర్యలు తీసుకొంటున్నట్టు సమాచారం.

వరల్డ్‌కప్‌నకు స్కాట్లాండ్ జట్టు ఇదే..



ఎడిన్‌బరో: అనుకోకుండా టీ20 వరల్డ్‌కప్‌లో ఆడే అవకాశాన్ని పొందిన స్కాట్లాండ్ జట్టు తమ ఆటగాళ్ల జాబితాను వెల్లడించింది. 15 మంది ఆటగాళ్లతో కూడిన ఈ బృందానికి రిచీ బెరింగ్టన్ నేతృత్వం వహించనున్నాడు. రెండేళ్ల క్రితం జరిగిన మెగా టోర్నీలో ఆడిన జట్టులోని 11 మంది ఆటగాళ్లకు ఈసారీ చాన్స్ ఇవ్వడం విశేషం.

జట్టు: బెరింగ్టన్ (కెప్టెన్), టామ్ బ్రూస్, మాథ్యూ క్రాస్, బ్రాడ్ క్యూరీ, డేవిడ్సన్, క్రిస్ గ్రీవ్స్, ఇహ్సాన్, మైకేల్ జోన్స్, మైకేల్ లీస్క్, మెక్‌క్రీత్, మెక్‌మెలెన్, జార్జి మున్సే షరీఫ్, మార్క్ వాట్, బ్రాడ్ వీల్.

సూర్య సేనకు ఎదురుందా?



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): హ్యాట్రిక్ విజయాలతో ఇప్పటికే భారత జట్టు ఐదు టీ20ల సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. ఇక బుధవారం విశాఖ తీరాన జరిగే నాలుగో టీ20లోనూ అదే జోష్‌ను ప్రదర్శించాలన్న పట్టుదలతో ఉంది. బ్యాటింగ్ భీకరంగా సాగుతున్నా స్పిన్నర్ల నుంచి కూడా చక్కటి ప్రదర్శనను భారత జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. అటు పర్యాటక న్యూజిలాండ్ పరిస్థితి దీనంగా కనిపిస్తోంది. ఎంత భారీ స్కోరు చేసినా కళ్లు చెదిరే హిట్టింగ్‌తో భారత బ్యాటర్లు ఉఫ్ మని ఊది పారేస్తుండడంతో ఆ జట్టు అయోమయంలో పడుతోంది. ఎలాగైనా నేటి మ్యాచ్‌లో భారత్‌ను కట్టడి చేయడంతో పాటు ఓ విజయాన్ని ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. బ్యాటింగ్‌లో ఫిలిప్స్, శాంట్నర్ మాత్రమే రాణిస్తున్నారు. ఇక పేసర్ జేమిసన్, డఫీ స్థానాల్లో ఫెర్గూసన్, నీషమ్ ఆడనున్నారు.

సంజూకిదే చివరి చాన్స్

భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్ సంజూ శాంసన్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. టీ20 వరల్డ్‌కప్ జట్టులో ఇషాన్‌ను తీసుకుంటే సంజూకు బ్యాకప్ కీపర్‌గా భావించారు. కానీ ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యేలా ఉంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో శాంసన్ చేసింది 16 పరుగులే కాగా.. అటు ఇషాన్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తూదుమ్మురేపుతున్నాడు. ఈ నేపథ్యంలో తిలక్ చివరి రెండు మ్యాచ్‌లకు కూడా దూరం కావడంతో శాంసన్‌కు మరో చాన్స్ దక్కడం ఖాయమే. ఇక టీ20 వరల్డ్ కప్ తుది జట్టులో తన పేరును పరిగణనలోకి తీసుకోవాలంటే ఈ చివరి రెండు మ్యాచ్‌ల్లో శాంసన్ నిరూపించుకోవాల్సిందే. ఇక అభిషేక్, సూర్య ఫామ్‌తో కివీస్ బౌలర్లు బంతులు వేసేందుకే భయపడుతున్నారు. కానీ స్పిన్నర్ కుల్దీప్ పరుగులు ఎక్కువగా ఇస్తుండడం ఆందోళనకరం. అటు మూడో టీ20లో ఆడిన రవి బిష్ణోయ్ రెండు వికెట్లతో ఆకట్టుకున్నాడు. దీంతో నేటి మ్యాచ్‌లో ఈ ఇద్దరిలో ఎవరిని కొనసాగిస్తారనేది ఆసక్తికరంగా మారింది. రొటేషన్‌లో భాగంగా అర్ష్‌దీప్, వరుణ్ జట్టులోకి రానున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, దూబే, రింకూ, హర్షిత్ రాణా, కుల్దీప్/రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, వరుణ్.
న్యూజిలాండ్: సీఫర్ట్, కాన్వే, రచిన్, ఫిలిప్స్, డారిల్ మిచెల్, చాప్‌మన్, నీషమ్, శాంట్నర్ (కెప్టెన్), హెన్రీ, ఫెర్గూసన్, సోధీ.

గుజరాత్ కమాల్



- ఢిల్లీపై ఉత్కంఠ గెలుపు
- నిక్కీ రాణా శ్రమ వృథా
- డివైన్‌కు 4 వికెట్లు
- మూనీ అర్ధ శతకం



వడోదర: డెత్ ఓవర్లలో నిక్కీ ప్రసాద్ (24 బంతుల్లో 47), స్నేహ్ రాణా (15 బంతుల్లో 29) వణికించినా.. సోఫీ డివైన్ (4/37) మ్యాజిక్‌తో గెలుపు వాకిట ఢిల్లీ క్యాపిటల్స్ బోల్తా పడింది. డబ్ల్యూపీఎల్‌లో మంగళవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 3 పరుగుల తేడాతో ఢిల్లీపై నెగ్గి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. ఆఖరి ఓవర్‌లో ఢిల్లీ విజయానికి 9 పరుగులు కావల్సి ఉండగా.. రాణా, ప్రసాద్‌ను అవుట్ చేసిన డివైన్ మ్యాచ్‌ను మలుపుతిప్పింది. తొలుత గుజరాత్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 174 పరుగులు చేసింది. బెత్ మూనీ (58) అర్ధ శతకం సాధించగా.. అనుష్క శర్మ (39) ఫర్వాలేదనిపించింది. శ్రీచరణి నాలుగు, హెన్రీ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి 171/8 స్కోరు మాత్రమే చేసింది. 100/6తో పరాజయం తప్పదనుకొన్న పరిస్థితుల్లో నిక్కీ, రాణా ఏడో వికెట్‌కు 31 బంతుల్లో 70 పరుగుల భాగస్వామ్యంతో విజయంపై ఆశలు లేపారు. కానీ, ఆఖరి ఓవర్‌లో తడబాటుతో ఫలితం తలకిందులైంది. డివైన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 174/9 (మూనీ 58, అనుష్క 39; చరణి 4/31, హెన్రీ 2/38);
ఢిల్లీ: 20 ఓవర్లలో 171/8 (నిక్కీ 47, రాణా 29; డివైన్ 4/37, రాజేశ్వరి గైక్వాడ్ 3/20).

విహాన్ అజేయ శతకం

- భారత్‌కు భారీ విజయం
- 204 రన్స్‌తో జింబాబ్వే చిత్తు

అండర్-19 వన్డే వరల్డ్‌కప్

బులవాయో: అండర్-19 వన్డే వరల్డ్‌కప్‌లో భారత కుర్రాళ్ల జైత్రయాత్ర సాగుతోంది. విహాన్ మల్హోత్రా (107 బంతుల్లో 109 నాటౌట్) అజేయ శతకానికి, బౌలర్ల రాణింపు తోడైంది. దీంతో మంగళవారం జింబాబ్వేతో జరిగిన సూపర్ సిక్స్ గ్రూప్ 2 మ్యాచ్‌లో భారత్ 204 పరుగుల తేడాతో ఘనవిజయం అందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ అభిగ్యాన్ కుందు (62 బంతుల్లో 61), వైభవ్ (30 బంతుల్లో 52) అర్ధసెంచరీలతో 50 ఓవర్లలో 352/8 పరుగుల భారీ స్కోరు సాధించింది. చివర్లో ఖిలన్ (12 బంతుల్లో 30) చెలరేగి స్కోరును 350 దాటించాడు. ఛేదనలో జింబాబ్వే 37.4 ఓవర్లలో 148 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ మాత్రే మూడు వికెట్లతో కట్టడి చేశాడు.



భారత్: 50 ఓవర్లలో 352/8 (విహాన్ 109 నాటౌట్, అభిగ్యాన్ 61, వైభవ్ 52, ఖిలన్ 30; తటెండ 3/49, సింబరాషె 2/51, మజాయ్ 2/86); **జింబాబ్వే:** 37.4 ఓవర్లలో 148 ఆలౌట్ (చివౌలా 62, బ్లిగ్నాట్ 37; ఆయుష్ 3/14, ఉధవ్ 3/20, అంబరీష్ 2/19)

గాఫ్‌కు షాక్



- సెమీస్‌లో అల్కారజ్, సబలెంక
- జ్వెరెవ్, స్విటోలినా కూడా..

ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో సీడ్ కొకొ గాఫ్‌కు క్వార్టర్స్‌లోనే షాక్ తగిలింది. కార్లోస్ అల్కారజ్ ఈ టోర్నీలో తొలిసారి క్వార్టర్స్ గండాన్ని దాటగా.. డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక సెమీస్‌కు చేరుకొంది. మంగళవారం జరిగిన క్వార్టర్స్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ అల్కారజ్ 7-5, 6-2, 6-1తో అలెక్స్ డి మెనార్ (ఆస్ట్రేలియా)పై వరుస సెట్లలో గెలిచాడు. ఈ క్రమంలో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి అడుగుపెట్టాడు. మహిళల సింగిల్స్‌లో అమెరికా ప్లేయర్ గాఫ్ 1-6, 2-6తో 12వ సీడ్ ఎలినా స్విటోలినా (ఉక్రెయిన్) చేతిలో చిత్తుగా ఓడింది. 59 అనవసర తప్పిదాలు చేసిన గాఫ్.. సర్వీస్ బ్రేక్ అయిన ప్రతీసారీ అసహనంతో తన రాకెట్‌ను నేలకేసి కొట్టింది. కాగా, సబలెంక 6-3, 6-0తో ఇవా జోవిచ్ (అమెరికా)పై అలవోకగా నెగ్గింది. గురువారం జరిగే సెమీస్‌లో స్విటోలినాతో సబలెంక అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 6-7(5), 6-1, 7-6(3) లెర్నర్ టీన్ (అమెరికా)పై కష్టంగా గెలిచాడు. శుక్రవారం జరిగే సెమీస్‌లో అల్కారజ్‌తో జ్వెరెవ్‌తో తలపడనున్నాడు.

చెలరేగిన బ్రూక్, రూట్



ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ విజయం
లంకపై 2-1తో సిరీస్ కైవసం

కొలంబో: శ్రీలంకతో జరిగిన ఆఖరి, మూడో వన్డేలో నెగ్గిన ఇంగ్లండ్ జట్టు సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. హ్యారీ బ్రూక్ (66 బంతుల్లో 11 ఫోర్లు, 9 సిక్సర్లతో 136 నాటౌట్), రూట్ (108 బంతుల్లో 9 ఫోర్లు, ఓ సిక్స్‌తో 111 నాటౌట్) శతకాలతో చెలరేగడంతో.. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లకు 357 పరుగులు చేసింది. ఛేదనలో పవన్ రత్నాయకే (121) శతకం చేసినా ఫలితం లేకపోయింది. పథుమ్ నిస్సంక 50 రన్స్ సాధించాడు. వీరిద్దరు మినహా మరెవ్వరూ పెద్ద స్కోరు చేయకపోవడం లంకను దెబ్బతీసింది. తుదకు లంక 46.4 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటై ఓటమి చవిచూసింది.

సఫారీలతో భారత్ 'వరల్డ్‌కప్' వామప్

చెన్నై: వచ్చే నెల 7 నుంచి జరిగే టీ20 ప్రపంచకప్‌నకు ముందు డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఒక వామప్ మ్యాచ్ ఆడనుంది. వచ్చేనెల 4న నవీ ముంబైలో గత టోర్నీ రన్నరప్ దక్షిణాఫ్రికాతో తలపడనుంది. అదేరోజు, కొలంబోలో ఐర్లాండ్‌తో పాకిస్థాన్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.

తొమ్మిదోరౌండ్‌లో అర్జున్‌కు డ్రా

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నీలో అర్జున్ ఇరిగేసి మరో గేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. మంగళవారం జరిగిన 9వ రౌండ్‌లో హన్స్‌మోక్ నీమన్ (అమెరికా)తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. కాగా, మాథియాస్ బ్లూబామ్ (జర్మనీ) చేతిలో గుకేశ్ ఓటమిపాలయ్యాడు. మొత్తం 9 రౌండ్ల నుంచి అర్జున్, గుకేశ్ చెరో 4 పాయింట్లు సాధించారు.

ఏరియా ఆస్పత్రుల్లో.. 13 ప్రజారోగ్య లేబొరేటరీలు

రూ.16.25 కోట్లతో ఏర్పాటు

- ప్రతి ల్యాబ్‌లో 134 రకాల పరీక్షలు: మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా రూ.16.25 కోట్లతో 13 ప్రజారోగ్య లేబొరేటరీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం తెలిపారు. వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరింత చేరువ చేసేందుకు ఏర్పాటవుతున్న ఈ లేబొరేటరీలు ఏప్రిల్ నాటికి వినియోగంలోకి వస్తాయన్నారు. సంక్రమిత, అసంక్రమిత కేటగిరీలకు సంబంధించిన మొత్తం 134 రకాల పరీక్షలు ఈ లేబొరేటరీల్లో జరుగుతాయన్నారు. స్థానిక ఆస్పత్రులకు వచ్చే రోగులకే కాకుండా ఇతర పీహెచ్‌సీలు, ఆస్పత్రుల నుంచి వచ్చే రోగులను ఇక్కడికి రిఫర్ చేస్తారన్నారు. వైద్య ఆరోగ్యశాఖతోపాటు పశు సంవర్థక శాఖ, నీటి పారుదల, పర్యావరణ, అటవీ, ఇతర శాఖలతో సమన్వయానికి ఈ లేబొరేటరీలు ఉపయోగపడతాయని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, అనంతపురం జిల్లా గుంతకల్లు, చిత్తూరు జిల్లా పలమనేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, పల్నాడు జిల్లా నరసరావుపేట, విశాఖ జిల్లా అగనంపూడి, నంద్యాల జిల్లా బనగానపల్లి, బాపట్ల జిల్లా చీరాల, ఎన్టీఆర్ జిల్లా నందిగామ, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రుల్లో ఈ లేబొరేటరీల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. కాకినాడ జిల్లా తుని, నెల్లూరు జిల్లా గూడూరు, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఆస్పత్రుల్లో ల్యాబ్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. పీఎం అభిమ్ కింద ఒక లేబొరేటరీ నిర్మాణం, పరికరాల ఏర్పాటుకు కలిపి రూ.1.2 కోట్ల చొప్పున 13 లేబొరేటరీలకు మొత్తం రూ.16.25 కోట్లను కూటమి ప్రభుత్వం ఖర్చు పెడుతోందని తెలిపారు.

పట్టణాల్లో డ్రెయిన్ల మ్యాపింగ్

- నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం శుభ్రం చేసే వ్యవస్థ
- పట్టణ డ్రెయిన్ల నిర్వహణకు మున్సిపల్‌శాఖ ఎస్‌ఓపీ

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు చేస్తున్న డ్రెయిన్ల శుభ్రతకు భిన్నంగా ప్లానింగ్‌తో కూడిన, సాంకేతిక ఆధారిత పట్టణ డ్రైనేజ్ వ్యవస్థ నిర్వహణకు మున్సిపల్‌శాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నాలాలు, స్మార్ట్ వాటర్ డ్రెయిన్లు, ప్రధాన, మధ్యస్థ, చిన్న డ్రెయిన్ల శాస్త్రీయ పూడికతీత, సురక్షిత, శుభ్రత కోసం సమగ్ర స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను జారీ చేసింది. ఈ ఎస్‌ఓపీ ద్వారా దీర్ఘకాలిక నీటిముంపు సమస్యలు, వరద ప్రమాదాలు తగ్గించడం, పారిశుధ్య ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు కార్మికుల భద్రతను లక్ష్యంగా పెట్టుకుంది. ఇకపై ప్రతి డ్రెయిన్‌ను మ్యాపింగ్ చేసి నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేస్తారు. డిజిటల్‌గా పర్యవేక్షిస్తారు. లోపాలు ఉన్న చోట శాశ్వత నిర్మాణ సవరణలు చేపడతారు. వీటన్నిటికీ మున్సిపల్ కమిషనర్లు వ్యక్తిగతంగా బాధ్యత వహించాలని ఎస్‌ఓపీలో పేర్కొన్నారు. యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తప్పనిసరి. ఎస్‌ఓపీని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విధానంతో పట్టణ వరదల నివారణ, దోమలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల తగ్గింపు, పట్టణ పరిశుభ్రత, పారిశుధ్య కార్మికుల భద్రత, గౌరవం పెంపుదల సాధ్యమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆప్కాబ్ చైర్మన్‌కు మరో ఆరు నెలలు పొడిగింపు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంక్(ఆప్కాబ్) నాన్-అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి(చైర్మన్) పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 18నుంచి 6నెలలు లేదా ఎన్నికలు జరిగేవరకు, లేదా తదుపరి నిర్ణయం తీసుకునేవరకు పదవిలో కొనసాగాలని అందులో పేర్కొంది.

కారుణ్య నియామకాలను మానవీయ కోణంలో పరిశీలించాలి

- ఉద్యోగి మరణం.. ఆ కుటుంబానికి ఆర్థిక మరణం కాకూడదు
- వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- సాంకేతిక కారణాలతో ఉద్యోగాన్ని నిరాకరించడానికి వీల్లేదు
- హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఓ ఉద్యోగి మరణం ఆ కుటుంబానికి ఆర్థిక మరణం కాకూడదని హైకోర్టు వ్యాఖ్యానించింది. మరణించిన ఉద్యోగి అతని కుటుంబానికి ఎల్లప్పుడూ విలువైన ఆస్తులు వదిలి వెళ్లకపోవచ్చునని, కొన్నిసార్లు పేదరికాన్ని కూడా వదిలి వెళ్లవచ్చని పేర్కొంది. ఉద్యోగి మరణించినా, అనారోగ్య కారణాలతో పదవీ విరమణ చేసినా ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోకుండా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. బాధిత కుటుంబానికి తక్షణం సహాయం అందించేందుకు, అర్హత కలిగిన కుటుంబ సభ్యుడికి ఉద్యోగం ఇచ్చేందుకు వీలుగా కారుణ్య నియామక పథకం తీసుకొచ్చారని గుర్తుచేసింది. సాంకేతిక కారణాలతో కారుణ్య నియామక అభ్యర్థనను ఏకపక్షంగా నిరాకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. తండ్రి రాములు అనారోగ్య కారణాలతో పదవీ విరమణ చేయడంతో పిటిషనర్ నారాయణమ్మ కారుణ్య నియామకం కింద ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారని గుర్తు చేసింది. నారాయణమ్మ కుటుంబ ఆర్థిక పరిస్థితిపై విచారణ జరిపిన సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ సానుకూలంగా సిఫార్సు చేసినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా నిర్దిష్ట గడువులోగా (ఐదేళ్ల లోపు) దరఖాస్తు చేయలేదనే కారణంతో కారుణ్య నియామక వినతిని జనరల్ మేనేజర్ తిరస్కరించారని పేర్కొంది. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం జనరల్ మేనేజర్ ప్రతీ కేసును మెరిట్ ఆధారంగా, మానవీయ కోణంలో పరిశీలించాల్సి ఉంటుందని, ప్రస్తుత కేసులో అలా జరగలేదని తెలిపింది. అలాగే అసాధారణ జాప్యం తర్వాత కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేశారని క్యాట్ పేర్కొనడాన్ని తప్పుపట్టింది. స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐదేళ్ల తర్వాత ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవడాన్ని అసాధారణ జాప్యంగా చెప్పలేమని పేర్కొంది. 2018 డిసెంబరు 27న కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది. తీర్పు ప్రతి అందిన మూడు నెలల్లోపు పిటిషనర్‌ను కారుణ్య నియామకం ప్రాతిపదికన ఉద్యోగంలోకి తీసుకొనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ జి.తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన బి.రాములు రైల్వేలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేసేవారు. అనారోగ్య కారణాలతో 1999లో ఆయన మెడికల్ డీ కేటగరైజ్ అయ్యారు. రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ ఉద్యోగం ప్రతిపాదించినప్పటికీ రాములు దానిని నిరాకరిస్తూ 2000 సంవత్సరంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. రాములు కుమార్తె బి.నారాయణమ్మ 2006 సెప్టెంబరులో కారుణ్య నియామకం కింద దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఐదేళ్ల గడువులోపు దరఖాస్తు చేసుకోలేదనే కారణంతో రైల్వే అధికారులు ఆమె వినతిని తిరస్కరించారు. దీనిపై కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించినా నారాయణమ్మకు ఊరట లభించలేదు. దీంతో ఆమె 2019లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల తుది విచారణ జరిపి ధర్మాసనం నిర్ణయం వెల్లడించింది. ప్రస్తుతం పిటిషనర్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ఇళ్లలో పనిమనిషిగా చేస్తూ నారాయణమ్మ జీవనం సాగిస్తోందని గుర్తు చేసింది. ఐదేళ్లలోపు దరఖాస్తు చేసుకోలేదనే సాంకేతిక కారణంతో ఆ కుటుంబానికి సహాయన్ని నిరాకరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. రైల్వే నిబంధనలపై అవగాహన లేకపోవడంతోనే ఆలస్యంగా దరఖాస్తు చేశామన్న పిటిషనర్ వాదనతో ఏకీభవిస్తున్నట్లు ప్రకటించింది. కారుణ్య నియామకాలు.. నిబంధనల ప్రకారం కాకుండా రాజ్యాంగంలోని అధికరణ 39లోని ఆదేశిక సూత్రాల స్ఫూర్తితో జరగాలని పేర్కొంది.

త్వరలో విద్యుత్ ఏఈ పోస్టుల భర్తీ

గత ప్రభుత్వ నిర్వాకంతో ప్రజలపై రూ.30వేల కోట్ల భారం: గొట్టిపాటి

బుచ్చిరెడ్డిపాళెం/ఇందుకూరుపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసి, సొంత అవసరాలకు వాడుకుని, ప్రజలపై రూ.30వేల కోట్ల ఆర్థిక భారం మోపిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు, ఇందుకూరుపేట మండలం కుడితిపాళెంలలో విద్యుత్ సబ్‌స్టేషన్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై భారం మోపి వదిలేస్తే కూటమి ప్రభుత్వం రూపాయి కూడా పెంచకుండా, మళ్లీ ఎన్నికల్లోపు విద్యుత్ చార్జీలను 1.19 రూపాయలు తగ్గించే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. విద్యుత్ శాఖలో భారీగా ఏఈ స్థాయి ఉద్యోగాలను త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. పంచేడు సబ్‌స్టేషన్‌కు రూ.40 లక్షల విలువచేసే భూమిని ఉచితంగా ఇచ్చిన దాత అమర్నాథ రెడ్డిని మంత్రి రవికుమార్ సత్కరించారు.



నెల్లూరు జిల్లా పంచేడులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవి, పక్కన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు

కొత్త లేబర్ కోడ్‌లపై అపోహలు వద్దు

- కార్మికుల జీవితాల్లో మార్పు కోసమే సంస్కరణలు
- కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల సహాయమంత్రి కరంద్లాజే
- పురుషులతో సమానంగా మహిళలకు ప్రాధాన్యం: మంత్రి సుభాష్

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నవంబరు 21న కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన కొత్త కార్మిక చట్టాల (లేబర్ కోడ్‌లు)పై అపోహలు వద్దని కేంద్ర ఎంఎస్‌ఎంఈ, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే చెప్పారు. ఈ చట్టాలు అటు కార్మికులు, ఇటు యజమానుల జీవితాల్లో గొప్ప మార్పులు తీసుకురానున్నాయని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల పెంపు, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే కొత్త చట్టాల లక్ష్యమన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన దక్షిణ భారత ప్రాంతీయ కార్మిక సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కొత్త చట్టాల పట్ల కార్మికులకు అవగాహన కల్పించేందుకు ప్రాంతీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని కేంద్ర మంత్రి వివరించారు. గోవా, జైపూర్ తర్వాత మూడో ప్రాంతీయ సదస్సును విజయవాడలో నిర్వహించామన్నారు. కొత్త చట్టాల ద్వారా కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలి? అసంఘటిత రంగంలోని 90 శాతం కార్మికులకు ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐ సౌకర్యాలను ఏవిధంగా అందించాలి? అనే అంశంపై ప్రాంతీయ సదస్సుల్లో చర్చిస్తున్నామని తెలిపారు. కొత్త చట్టాలతో మహిళలకు సమాన పనికి, సమాన వేతనం లభిస్తుందన్నారు. రాష్ట్ర, జిల్లా, తాలూకా స్థాయిల్లో కొత్త చట్టాలను సమర్థంగా అమలు చేయడంపై అధికారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి శుభాష్ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళా కార్మికులకు వేతనాలు అందించడం, పని ప్రదేశం నుంచి ఇంటి వద్దకు (డోర్‌స్టెప్) వారిని భద్రంగా చేర్చడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలో 50 సీట్లతో ఈఎస్‌ఐ మెడికల్ కాలేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నెల్లూరు, శ్రీసిటీ, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ఈఎస్‌ఐ ఆసుపత్రుల కోసం భూముల కేటాయించనున్నట్లు చెప్పారు. విజయనగరంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. పని ప్రదేశాల్లోనే వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి కార్మికులకు షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం ద్వారా తగిన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బీసీ బిడ్డలు ఉన్నత ఉద్యోగాల్లో ఉండాలి

- పాలనలో వారు కీలక భూమిక పోషించాలి
- ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సవిత
- బీసీ భవన్‌లో సివిల్స్ శిక్షణ కేంద్రం సందర్శన
- బీసీ సంక్షేమ కార్పొరేషన్ల చైర్మన్లతో సమావేశం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉన్నత ఉద్యోగాల్లో బీసీ బిడ్డలు స్థిరపడి, పాలనలో కీలక భూమిక పోషించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అందుకోసమే సివిల్ సర్వీసెస్, డీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందజేస్తున్నామని చెప్పారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను మంగళవారం మంత్రి సవిత సందర్శించారు. అభ్యర్థులకు వివిధ సబ్జెక్టులకు చెందిన 43 రకాల స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం బీసీ సంక్షేమ కార్పొరేషన్ల చైర్మన్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, త్వరలోనే బీసీ రక్షణ చట్టం తీసుకురానున్నామని తెలిపారు. దానికి తుది మెరుగులు దిద్దుతున్నామని, అందులో భాగంగా బీసీ కార్పొరేషన్ల చైర్మన్ల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని చెప్పారు. బీసీలకు ఆర్థిక భరోసా కలిగించేలా ఆదరణ 3.0 పథకం అమలుకు నిర్ణయించామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాలు నిర్మిస్తున్నామని, ఆ తర్వాత నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో బీసీ భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారితో సహా పలువురు కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

అకీరా హీరోగా ఏఐ సినిమా తొలగించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్ వ్యక్తిత్వ హక్కుల రక్షణకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అకీరా నందన్ అనుమతి లేకుండా ఆయన పేరు, స్వరం, ముఖకవళికలు, వ్యక్తిత్వాన్ని ఉపయోగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా రూపొందించిన కంటెంట్‌ను ప్రసారం చేయకూడదని కోర్టు స్పష్టం చేసింది. 'ఏఐ లవ్‌స్టోరీ' అనే చిత్రంతో పాటు అకీరా నందన్ గుర్తింపును వాడుతూ సోషల్ మీడియాలో ఉన్న ఇతర డీప్‌ఫేక్ కంటెంట్‌ను ప్రచురించడం, షేర్ చేయడాన్ని జస్టిస్ తుషార్ రావు గెడెలా నేతృత్వంలోని ధర్మాసనం అడ్డుకుంది. అకీరా నందన్ తన వ్యక్తిగత గోప్యత, ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన ప్రమేయం లేకుండానే ఏఐ మార్ఫింగ్, డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా పూర్తి నిడివి గల సినిమాను రూపొందించి తనను ప్రధాన పాత్రలో చూపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ఈ సినిమా తెలుగు వెర్షన్‌కు 11 లక్షలకు పైగా, ఇంగ్లీష్ వెర్షన్‌కు 24 వేలకు పైగా వ్యూస్ వచ్చాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

'జననాయగన్'కు తొలగని అడ్డంకులు



తమిళ హీరో విజయ్ నటించిన 'జననాయగన్' మూవీకి సెన్సార్ బోర్డు సర్టిఫికేట్ జారీ చేయాలంటూ సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ మద్రాసు హైకోర్టు ప్రథమ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. రాజకీయ ప్రవేశం చేసి అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జననాయగన్ సంక్రాంతి సందర్భంగా ఈ నెల 9న విడుదల కావాల్సి ఉంది. సినిమా సెన్సార్ కాకపోవడంతో నిర్మాణ సంస్థ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీవత్సవ, న్యాయమూర్తి జస్టిస్ అరుళ్‌మురుగన్‌తో కూడిన ప్రథమ ధర్మాసనం.. జననాయగన్ చిత్రానికి సెన్సార్ సర్టిఫికేట్ జారీ చేయాలంటూ సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కేసుపై సింగిల్ జడ్జి పునర్విచారణ జరపాలని ఆదేశించింది. అంతేగాక చిత్ర నిర్మాణ సంస్థ తన పిటిషన్‌లో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉంది

చిన్మయి



ఇటీవలే జరిగిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం సక్సెస్ మీట్‌లో 'ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ లేదు. కొత్త వారికి ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుంది' అని చిరంజీవి పేర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశంపై గాయని చిన్మయి స్పందించారు. ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎక్కువగా ఉంది. కమిట్‌మెంట్ ఇవ్వకుంటే మహిళలకు అవకాశాలివ్వని పరిస్థితి. పరిశ్రమలో కమిట్‌మెంట్ అంటే నిబద్ధత కాదు. కొందరు మగవారు ఈ పదాన్ని ఉపయోగించి మహిళల నుంచి ఏవేవో ఆశిస్తారు. నాకు తెలిసిన ఒక మహిళా సంగీత దర్శకురాలు ఈ లైంగిక వేధింపులు భరించలేక పరిశ్రమనే వదిలేసి వెళ్లారు. ఇలా మహిళల్ని వేధించేవారు పరిశ్రమలో చాలా మందే ఉన్నారు. ఎన్నో ఆరోపణలు ఎదుర్కొన్న ఓ ప్రముఖ గాయకుడు అయితే మహిళలను కేవలం తన కోర్కెలు తీర్చే వారిగానే భావిస్తారు. చిరంజీవి గారి తరంలో ఈ కాస్టింగ్ కౌచ్ సమస్య లేదు. ఆయన ఒక లెజెండ్. ఆ తరంలోని నటీనటులంతా ఈ సమస్య లేకుండా అందరూ కలసి కుటుంబ సభ్యుల్లా మెలిగే వారు. ఒకరినొకరు పరస్పరం గౌరవించుకునేవారు. ఎంతో మంది దిగ్గజాలతో కలసి పనిచేసిన వారంతా లెజెండ్సే. 'మీ టూ' ఉద్యమాన్ని చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు. సీనియర్ నటి షావుకారు జానకి గారు, 'మీ టూ' ఉద్యమం సమయంలో నోరు విప్పి మాట్లాడిన బాధితులను ఓ ఇంటర్వ్యూలో అవమానించడం కలచివేసింది. పరిశ్రమలో ఈ పరిస్థితులు అన్నీ తెలిసిన కొందరు అమ్మాయిలు విదేశాల్లోంచే వర్క్ చేయాలని ఆశిస్తున్నారు. ఇక్కడ ఆడవారికి పని కావాలంటే దానికి బదులుగా శరీరం అప్పగించాలని కోరుకునే మగవారే ఎక్కువ ఉన్నారు. నేను గురువుగా భావించి ఎంతో గౌరవించిన ఓ సీనియర్ గీత రచయిత నా తల్లి ముందే నన్ను లైంగికంగా వేధించారు' అని పేర్కొన్నారు.

ఇకపై సినిమా పాటలు పాడను



ఎన్నో అద్భుతమైన పాటలతో దశాబ్ద కాలంగా సంగీత ప్రియులను అలరిస్తున్న ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు, అగ్ర గాయకుడు అర్జిత్ సింగ్ అభిమానులకు షాక్ ఇచ్చారు. ఇకపై తాను ప్లే బ్యాక్ సింగర్ (సినిమాలకు పాటలు పాడడం)గా కొనసాగడం లేదని, కొత్త సినిమాలేవీ అంగీకరించడం లేదని ప్రకటించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేస్తూ... 'శ్రోతలు ఇన్నాళ్లూ నాపై చూపిన ప్రేమకు ధన్యవాదాలు. ఇకపై నేను నేపథ్య గాయకుడిగా కొత్త సినిమాలేవీ చేయడం లేదని సంతోషంగా ప్రకటిస్తున్నాను' అని తెలిపారు. ఈ అద్భుతమైన ప్రయాణాన్ని ఇంతటితో ఆపేస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అర్జిత్ వయసు 38 ఏళ్లు. గాయకుడిగా ఆయన కెరీర్ ఎంతో మంచి స్థితిలో ఉంది. ఇలాంటి సమయంలో ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే ఆయన పూర్తిగా సంగీతానికి దూరం కావడం లేదు. ప్రైవేట్ ఆల్బమ్స్, లైవ్ కచేరీల ద్వారా తన సంగీత ప్రయాణాన్ని కొనసాగించే అవకాశం ఉంది.



మోహన్‌బాబుకు అరుదైన గౌరవం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కోల్‌కతా లోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీవీ ఆనంద బోస్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డును డాక్టర్ మోహన్‌బాబు అందుకున్నారు. మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మోహన్‌బాబును అభిమానులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఆ సాయిబాబా ఆశీస్సులు, అభిమానుల దయతో ఈ అవార్డు వచ్చిందన్నారు.

శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి)

థ్రిల్లింగ్ అంశాలతో...



ధర్మకీర్తి రాజు, అప్సర రాణి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'బ్లడ్ రోజెస్'. ఎమ్‌జీఆర్ దర్శకత్వంలో హరీశ్ కమర్తి నిర్మించారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బ్లడ్ రోజెస్' ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. మంచి థ్రిల్లింగ్ అంశాలతో వస్తున్న ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ సీహెచ్, కెమెరామెన్: ఓగిరెడ్డి శివకుమార్, సంగీతం: పెద్దపల్లి రోహిత్.

నిర్మాతే నిజమైన హీరో

- తరుణ్ భాస్కర్



'ఈ రోజుల్లో సినిమాలు నిర్మించడం చాలా కష్టమైన పని. ఏ సినిమా ఎప్పుడు ఆడుతుందో ఎవరికీ తెలియదు. ఇలాంటి సమయంలో ధైర్యంగా ముందుకొచ్చే ప్రొడ్యూసరే నిజమైన హీరో' అని అన్నారు తరుణ్ భాస్కర్. ఆయన, ఈషా రెబ్బా జంటగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఏ.ఆర్.సజీవ్ దర్శకత్వం వహించారు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివరపు నిర్మించారు. ఈనెల 30న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. హీరో విష్వక్సేన్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఈషా క్యారెక్టర్ గుర్తుండిపోతుంది' అని చెప్పారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ 'తరుణ్‌ని యాక్టర్‌గా చూస్తుంటే చాలా ముచ్చటగా ఉంది' అని తెలిపారు.

నిజ జీవిత ఘటనల దేవగుడి



బెల్లం రామకృష్ణారెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'దేవగుడి'. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి, నటుడు రఘు కుంచె మీడియాతో మాట్లాడారు.

రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'దర్శకుడిగా నా మొదటి చిత్రం దృశ్యకావ్యం. ఇప్పుడు 'దేవగుడి' రూపొందించాను. నిజ జీవిత ఘటనల ఆధారంగా, మంచి కథా కథనాలతో తీసిన చిత్రమిది. సురేశ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా సినిమాను విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. రఘు కుంచె మాట్లాడుతూ 'ఇందులో 'దేవగుడి వీరారెడ్డి' అనే పాత్రలో నటించాను. యాక్టర్ కావాలని నేనెప్పుడూ అనుకోలేదు. గాయకుడిని కావాలని పరిశ్రమకు వచ్చాను. దాదాపు 40 సినిమాలకు సంగీత దర్శకుడిగా పనిచేశాను. వచ్చిన అవకాశాలు వదులుకోకూడదని ఇలా నటిస్తున్నా' అని అన్నారు.

ఊహించని మలుపులు

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు భాస్కర్ జక్కుల రూపొందించిన చిత్రం 'జమాన'. తేజస్వీ అడప నిర్మాత. ఈనెల 30న సినిమా థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో ఆకాశ్ పూరి మాట్లాడుతూ 'మంచి కథాంశంతో వస్తున్న ఈ సినిమాను అందరూ చూసి విజయవంతం చేయాలి' అని అన్నారు. భాస్కర్ జక్కుల మాట్లాడుతూ 'మంచి థ్రిల్లర్ సబ్జెక్టుతో తీసిన చిత్రమిది. వినోదంతోపాటు ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి' అని చెప్పారు. హీరో సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్, సంగీత దర్శకుడు కేశవ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్కంఠభరిత చిత్రం



జీవీ నాయుడు నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'క్యాట్'. వీఆర్‌జీఆర్ మూవీస్ పతాకంపై వై.గంగాధర్ సమర్పణలో రజని గొంగటి నిర్మించారు. తొలి కాపీ సిద్ధమై త్వరలో విడుదల కాబోతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని దర్శకుడు బుచ్చిబాబు సానా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిత్ర కథ వింటుంటే చాలా ఆసక్తిగా అనిపించిందని, పెద్ద హిట్ అవ్వాలని, చిత్రబృందానికి మంచి పేరు రావాలని ఆకాంక్షించారు. డ్రామా, థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో జీవీ నాయుడుతోపాటు వీజే బాలు, లావణ్య, కళ్యాణి రాణి ప్రధాన పాత్రల్లో నటించారు.

भारत प्रभुत्वం

భారత ప్రభుత్వం
రైల్వే మంత్రిత్వ శాఖ (దక్షిణ మధ్య రైల్వే)
నోటిఫికేషన్

సత్యమేవ జయతే

సికింద్రాబాద్,07-01-2026

ఆర్.సి.నెం.1381/2023 -సి తేదీ :26.01.2026

S.O.311(E) – రైల్వే చట్టం, 1989 (24 యొక్క 1989) (ఇకపై పేర్కొన్న చట్టంగా సూచిస్తారు) లోని సెక్షన్ 20-ఏ నందలి సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం, సంతృప్తి చెందిన తర్వాత ప్రజా ప్రయోజనార్థం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో గుంటూరు-బీబీనగర్ స్టేషన్ల మధ్య రెండవ రైల్వే లైన్ అనే ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు అమలు, నిర్వహణ, మానేజ్ మెంట్ మరియు ఆపరేషన్ కోసం దిగువ షెడ్యూల్ లో సంక్షిప్త వివరణ ఇవ్వబడిన భూమి అవసరం వున్నదని భావించినందున, అట్టి భూమిని భూ సేకరణ చేసే ఉద్దేశ్యాన్ని దీని ద్వారా ప్రకటిస్తున్నాము.

సదరు భూమిపై ఆసక్తి ఉన్న ఏ వ్యక్తి అయిన, అధికారిక గెజెట్ లోని ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి ముప్పై రోజులలోగా, సదరు చట్టంలోని సెక్షన్ 20–డి లోని సబ్–సెక్షన్ 1 కింద పై తెలిపిన ప్రయోజనార్థం కోసం భూమిని స్వాధీనం చేసుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చు.

అటువంటి ప్రతి అభ్యంతరాన్ని సమర్థప్రాధికారి (భూసేకరణ) & రెవెన్యూ డివిజినల్ అధికారి, గురజాల వారికి వ్రాత పూర్వకముగా తెలియచేయాలి మరియు దాని కారణాలను నిర్ధేశించాలి మరియు భూసేకరణ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, గురజాల వారు అభ్యంతరం వ్యక్తం చేసిన వ్యక్తికి వ్యక్తిగతంగా లేదా న్యాయవాదుల ద్వారా వినడానికి అవకాశం కల్పిస్తారు. అటువంటి అభ్యంతరాలన్నింటినీ విన్న తరువాత మరియు తదుపరి విచారణ చేసిన తర్వాత, ఏదైనా సమర్థ అధికారం అవసరమని భావిస్తే, ఉత్తర్వుల ద్వారా, అభ్యంతరాలు అనుమతించవచ్చు లేదా నిరాకరించవచ్చు.

సదరు చట్టంలోని సెక్షన్ 20–డి లోని సబ్–సెక్షన్ (2) ప్రకారం సమర్థప్రాధికారి చేసిన ఉత్తర్వులే తుది నిర్ణయం అవుతుంది.

ఈ నోఫికేషన్ కింద కవర్ చేయబడిన భూమికి సంబంధించిన ల్యాండ్ ప్లాన్లు మరియు ఇతర వివరములు పైన తెలుపనడిన సంబంధిత సమర్థప్రాధికారి కార్యాలయములో అందుబాటులో ఉంటాయి మరియు ఆసక్తి గల వ్యక్తి వాటిని తనిఖీ చేయవచ్చు. భూసేకరణలో సముచిత పరిహారం పొందే హక్కు మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునర్నుపాధి కల్పన చట్టం, 2013 (చట్టం నెం.30 2013) ప్రకారం పరిహారం అందించబడుతుంది.

షెడ్యూలు :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో "గుంటూరు మరియు బీబీనగర్ స్టేషన్ల మధ్య రెండవ రైల్వే లైన్" అనే ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు కోసం నిర్మాణంతో లేదా నిర్మాణం లేకుండా సేకరించాల్సిన భూమి యొక్క సంక్షిప్త వివరణ.

గ్రామం : తుమ్మలచెరువు మండలం : పిడుగురాళ్ళ

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	భూసేకరణ వివరములు ఎకరాలు	హెక్టార్లు
1	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	362	0.01	0.0000405
2	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	363-1	0.36	0.0014566
3	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	364-1	0.11	0.0004451
4	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	365/2B	0.01	0.0000405
5	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	366-1	0.13	0.0005260
6	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	399/5B-1A	0.19	0.0007687
7	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	399/5B-2A	0.17	0.0006878
8	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	418/B-1	0.09	0.0003641
9	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	418/B-3	0.08	0.0003237
10	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	421-1	0.15	0.0006069
11	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	422-1A	0.19	0.0007687
12	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	422-2	0.07	0.0002832
13	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	425-1	0.14	0.0005664
14	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	426/B-1	0.10	0.0004046
15	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	427/B	0.01	0.0000405
16	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	434	0.01	0.0000405
17	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	436-1	0.08	0.0003237
18	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	437-1A1	0.12	0.0004855
19	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	437-1A2	0.11	0.0004451
20	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	437-2A	0.06	0.0002428
21	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	438-1A1	0.05	0.0002023
22	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	438-1A2	0.05	0.0002023
23	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	438-2A	0.11	0.0004451
24	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	441-1A	0.03	0.0001214
25	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	441-1B	0.02	0.0000809
26	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	442/2-1	0.10	0.0004046
27	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	443-1	0.23	0.0009306
28	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	458/1B-1A	1.54	0.0062308
29	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	470-A1	0.18	0.0007283
30	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-H/1	0.01	0.0000405
31	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-G/1	0.01	0.0000405
32	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-E/1	0.01	0.0000405
33	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-D/1	0.02	0.0000809
34	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-C/1	0.02	0.0000809
35	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-B/1	0.02	0.0000809
36	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-A/1	0.01	0.0000405
37	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-A/2-1	0.10	0.0004046
38	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-B/2-1	0.11	0.0004451
39	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-C/2-1	0.12	0.0004855
40	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-D/2-1	0.12	0.0004855
41	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-E/2-1	0.10	0.0004046
42	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-G/2-1	0.11	0.0004451
43	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	471-H/2-1	0.47	0.0019016
44	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-A	0.04	0.0001618
45	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-1/B	0.24	0.0009710
46	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-6/A	0.01	0.0000405
47	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-2A	0.03	0.0001214
48	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-3	0.11	0.0004451
49	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-4A	0.03	0.0001214
50	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-6/B1	0.24	0.0009710
51	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-8	0.07	0.0002832
52	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-9	0.11	0.0004451
53	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-10	0.04	0.0001618
54	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-11	0.03	0.0001214
55	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-12A	0.13	0.0005260
56	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-13	0.04	0.0001618
57	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-14A	0.07	0.0002832
58	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/B-15A	0.26	0.0010520
59	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	472/C	0.18	0.0007283
60	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	485/B	2.19	0.0088607
61	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	487/B	0.04	0.0001618
62	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	488-1A	0.66	0.0026704
63	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	490-A1	0.05	0.0002023
64	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	490-B1	0.43	0.0017398
65	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	491	0.06	0.0002428
66	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	500/B-1A	0.28	0.0011329
67	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	500/B-1B	0.88	0.0035605
68	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	500/B-1C	0.10	0.0004046
69	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	541/B	0.18	0.0007283
70	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	542/B-1A1	0.07	0.0002832
71	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	542/B-1A2	0.09	0.0003641
72	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	542/B-1A3	0.13	0.0005260
73	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	542/B-1A4	0.13	0.0005260
74	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	542/B-1A5	0.14	0.0005664
75	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	545/B-1A	0.25	0.0010115
76	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	546/B-1A	0.35	0.0014161
77	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	546/B-1B	0.39	0.0015779
78	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	547/B-1	0.06	0.0002428
79	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	548/B-1	0.32	0.0012947
80	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	549/2B	0.07	0.0002832
81	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	550-1B	0.13	0.0005260
82	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	550-2B	0.34	0.0013756
83	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	576/A-1B	0.33	0.0013352
84	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	576/A-1C	0.31	0.0012543
85	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	576/A-1D	0.39	0.0015779
86	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	576/B-1A	0.09	0.0003641
87	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	576/B-1B	0.12	0.0004855
88	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	577/B-1A1	0.18	0.0007283
89	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	577/B-1A2	0.10	0.0004046
90	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	577/B-2A1	0.07	0.0002832
91	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	577/B-2A2	0.16	0.0006474
92	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	578-1B	0.06	0.0002428
93	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	578-2B	0.06	0.0002428
94	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	580/B-1A	0.14	0.0005664
95	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	580/B-2A	0.12	0.0004855
96	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	580/B-3A	1.31	0.0053003
97	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	581/B-1	0.19	0.0007687
98	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	619/A-2	0.03	0.0001214
99	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	621/B	0.02	0.0000809
100	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	665/3B-1	0.14	0.0005664
101	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	666/3B	0.02	0.0000809
102	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	668/B-1A1	0.13	0.0005260
103	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	668/B-1A2	0.26	0.0010520
104	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	669/A-1A	0.05	0.0002023
105	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	669/A-1B	0.12	0.0004855
106	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	671/A-1	0.24	0.0009710
107	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	672/1B-2	0.06	0.0002428
108	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	672/2A-1	0.02	0.0000809
109	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	679/1B-1	0.13	0.0005260
110	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	679/2B-1	0.25	0.0010115
111	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	680/B	0.01	0.0000405
112	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	682/A-1B	0.17	0.0006878
113	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	682/A-1C	0.19	0.0007687
114	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	682/B-3A	0.83	0.0033582
115	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	840/B-1	0.61	0.0024681
116	పిడుగురాళ్ళ	తుమ్మలచెరువు	842/B-1	0.43	0.0017398
			తుమ్మలచెరువు మొత్తం విస్తీర్ణం:	22.04	0.0891738

గ్రామం : కరాలపాడు మండలం : పిడుగురాళ్ళ

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	పిడుగురాళ్ళ	కరాలపాడు	9/2/B-1A	0.15	0.0006069
2	పిడుగురాళ్ళ	కరాలపాడు	9/2/B-1B	0.12	0.0004855
3	పిడుగురాళ్ళ	కరాలపాడు	9/2/B-1C	0.28	0.0011329
4	పిడుగురాళ్ళ	కరాలపాడు	16/B-1	0.14	0.0005664
5	పిడుగురాళ్ళ	కరాలపాడు	18/B-1A	0.24	0.0009710
6	పిడుగురాళ్ళ	కరాలపాడు	18/B-2A	0.25	0.0010115
7	పిడుగురాళ్ళ	కరాలపాడు	19-B	0.15	0.0006069
8	పిడుగురాళ్ళ	కరాలపాడు	24/1-A	0.02	0.0000809
9	పిడుగురాళ్ళ	కరాలపాడు	24/2/B-1A	0.05	0.0002023
10	పిడుగురాళ్ళ	కరాలపాడు	25/1/B-1	0.05	0.0002023
11	పిడుగురాళ్ళ	కరాలపాడు	25/2/B-1A	0.15	0.0006069
12	పిడుగురాళ్ళ	కరాలపాడు	26/B-1	0.01	0.0000405
13	పిడుగురాళ్ళ	కరాలపాడు	46/B-1A	0.11	0.0004451
14	పిడుగురాళ్ళ	కరాలపాడు	46/B-1B	0.32	0.0012947
15	పిడుగురాళ్ళ	కరాలపాడు	49/B-1A	0.04	0.0001618
16	పిడుగురాళ్ళ	కరాలపాడు	49/B-1B	0.12	0.0004855
17	పిడుగురాళ్ళ	కరాలపాడు	49/B-1C	0.08	0.0003237
18	పిడుగురాళ్ళ	కరాలపాడు	68/B-1A	0.03	0.0001214
19	పిడుగురాళ్ళ	కరాలపాడు	68/B-2A	0.05	0.0002023
20	పిడుగురాళ్ళ	కరాలపాడు	68/B-3A	0.04	0.0001618
21	పిడుగురాళ్ళ	కరాలపాడు	68/B-4	0.01	0.0000405
22	పిడుగురాళ్ళ	కరాలపాడు	71/B-1	0.21	0.0008497
23	పిడుగురాళ్ళ	కరాలపాడు	76/C-1A	0.18	0.0007283
24	పిడుగురాళ్ళ	కరాలపాడు	76/C-1B	0.13	0.0005260
25	పిడుగురాళ్ళ	కరాలపాడు	76/C-1C	0.18	0.0007283
26	పిడుగురాళ్ళ	కరాలపాడు	79/B-1A	0.09	0.0003641
27	పిడుగురాళ్ళ	కరాలపాడు	79/B-1B	0.14	0.0005664
28	పిడుగురాళ్ళ	కరాలపాడు	80/B-1A	0.11	0.0004451
29	పిడుగురాళ్ళ	కరాలపాడు	80/B-1B	0.02	0.0000809
30	పిడుగురాళ్ళ	కరాలపాడు	81/B-1A	0.01	0.0000405
31	పిడుగురాళ్ళ	కరాలపాడు	182-A	0.08	0.0003237
32	పిడుగురాళ్ళ	కరాలపాడు	188/B-1	0.07	0.0002832
33	పిడుగురాళ్ళ	కరాలపాడు	189/B-1A	0.53	0.0021444
34	పిడుగురాళ్ళ	కరాలపాడు	190/A-2	0.15	0.0006069
35	పిడుగురాళ్ళ	కరాలపాడు	191-C1	0.24	0.0009710
36	పిడుగురాళ్ళ	కరాలపాడు	206/B-1	0.08	0.0003237
37	పిడుగురాళ్ళ	కరాలపాడు	207/A-1	0.04	0.0001618
38	పిడుగురాళ్ళ	కరాలపాడు	208/B-1	0.01	0.0000405
39	పిడుగురాళ్ళ	కరాలపాడు	208/B-2A	0.68	0.0027513
40	పిడుగురాళ్ళ	కరాలపాడు	208/B-3B	0.20	0.0008092
41	పిడుగురాళ్ళ	కరాలపాడు	208/B-2B	0.08	0.0003237
42	పిడుగురాళ్ళ	కరాలపాడు	208/B-3A	0.40	0.0016184
43	పిడుగురాళ్ళ	కరాలపాడు	209/3/B-1	0.02	0.0000809
44	పిడుగురాళ్ళ	కరాలపాడు	209/3/B-2A1	0.04	0.0001618
45	పిడుగురాళ్ళ	కరాలపాడు	209/3/B-2B1	0.02	0.0000809
46	పిడుగురాళ్ళ	కరాలపాడు	209/6-A	0.02	0.0000809
47	పిడుగురాళ్ళ	కరాలపాడు	236/B-1	0.05	0.0002023
48	పిడుగురాళ్ళ	కరాలపాడు	237/B-1A	0.50	0.202343
49	పిడుగురాళ్ళ	కరాలపాడు	237/B-1B	0.11	0.0004451
50	పిడుగురాళ్ళ	కరాలపాడు	238/B-1A1	0.02	0.0000809
51	పిడుగురాళ్ళ	కరాలపాడు	238/B-2A	0.19	0.0007687
52	పిడుగురాళ్ళ	కరాలపాడు	243/A-2	0.02	0.0000809
			కరాలపాడు మొత్తం విస్తీర్ణం:	7.03	0.0284434

గ్రామం : పిడుగురాళ్ళ మండలం : పిడుగురాళ్ళ

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-3A2 130/30A-4A2 130/30A-5A2	0.64	0.0025894
2	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-3A2		
3	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-4A2		
4	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-5A2		
5	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-6A2	0.03	0.0001214
6	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-6A3	0.01	0.0000405
7	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-6A4	0.01	0.0000405
8	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-6A5	0.01	0.0000405
9	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-6A6	0.01	0.0000405
10	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-6A7	0.04	0.0001618
11	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/30A-6A8	0.04	0.0001618
12	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	131/A-1B	0.01	0.0000405
13	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	131/A-1D	0.01	0.0000405
14	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	131/A-1C	0.01	0.0000405
15	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	131/A-1E	0.22	0.0008901
16	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	131/A-1F	0.07	0.0002832
17	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	131/A-1G	0.10	0.0004046
18	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	132/A-1	0.03	0.0001214
19	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/26-2B	0.06	0.0002428
20	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/26-2C	0.26	0.0010520
21	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	385-2B	0.14	0.0005664
22	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	385-3B	0.28	0.0011329
23	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	384-2	0.15	0.0006069
24	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	383/A-2	0.07	0.0002832
25	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	382/A-3C2	0.08	0.0003237
26	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	382/A-5B	0.10	0.0004046
27	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	346/A-3B	0.24	0.0009710
28	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	348/1A-1A2	0.02	0.0000809
29	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	348/1A-2A2	0.59	0.0023871
30	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	348/1A-1C	0.07	0.0002832
31	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	348/1A-1B2	0.52	0.0021039
32	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/17A-2	0.17	0.0006878
33	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/15A-3A2	0.07	0.0002832
34	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/15A-3A3	0.46	0.0018612
35	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/15A-3A4	0.17	0.0006878
36	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/15A-3A5	0.13	0.0005260
37	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/14A-3A2	0.03	0.0001214
38	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/14A-4A3	0.01	0.0000405
39	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/14A-2A2	0.03	0.0001214
40	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/14A-3A3	0.14	0.0005664
41	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/14A-4A2	0.05	0.0002023
42	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/15A-3B	0.13	0.0005260
43	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/14A-2B	0.12	0.0004855
44	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/4-1B	0.08	0.0003237
45	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/4-2	0.04	0.0001618
46	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/13A-1B	0.14	0.0005664
47	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/13A-2	0.11	0.0004451
48	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/31A-1B2	0.01	0.0000405
49	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/7A	0.03	0.0001214
50	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/31A-1A2	0.15	0.0006069
51	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	1094-8B	0.02	0.0000809
52	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/49A-A2	0.67	0.0027108
53	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/49A-C2	2.33	0.0094272
54	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	1001-2	7.40	0.0299404
55	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	892/15B-2	0.21	0.0008497
56	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	8/B-2	0.06	0.0002428
57	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	8/B-3	0.05	0.0002023
58	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	8/B-4	0.05	0.0002023
59	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	22/B-1A	0.03	0.0001214
60	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	22/B-2A	0.04	0.0001618
61	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	22/B-1B1	0.16	0.0006474
62	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	24/B-1B	0.12	0.0004855
63	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	24/B-1C	0.14	0.0005664
64	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	24/B-2A2	0.01	0.0000405
65	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	24/B-2A3	0.03	0.0001214
66	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	24/B-2C	0.02	0.0000809
67	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	24/B-2B2	0.11	0.0004451
68	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	37-1A	0.11	0.0004451
69	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	44/B-A	0.22	0.0008901
70	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	44/B-B1	0.04	0.0001618
71	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	52/B-2A1	0.06	0.0002428
72	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	52/B-2B2	0.02	0.0000809
73	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	52/B-2C2	0.02	0.0000809
74	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	54/B-2	0.05	0.0002023
75	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	56/B-1	0.04	0.0001618
76	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	56/B-2A	0.04	0.0001618
77	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/16A-7B1B	0.18	0.0007283
78	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/16A-7B1C	0.53	0.0021444
79	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/20A-1A2	0.13	0.0005260
80	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/34-2	0.02	0.0000809
81	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/34-3	0.04	0.0001618
82	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/34-4	0.08	0.0003237
83	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/34-5	0.12	0.0004855
84	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/36A-1B	0.43	0.0017398
85	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	188/A-2	0.21	0.0008497
86	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	231/A-2	0.12	0.0004855
87	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	233/A-1B	0.15	0.0006069
88	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	234/2A-2	0.02	0.0000809
89	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	246/A-2	0.04	0.0001618
90	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	247/A-2	0.06	0.0002428
91	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	248-2	0.08	0.0003237
92	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	253-2B	0.01	0.0000405
93	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	254/A-2	0.01	0.0000405
94	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	255/A-2	0.02	0.0000809
95	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	258/A-1B	0.12	0.0004855
96	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	258/A-2B	0.12	0.0004855
97	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	259/A-2	0.06	0.0002428
98	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	292/A-2	0.04	0.0001618
99	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	293/A-2B	0.04	0.0001618
100	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	295/A-2	0.14	0.0005664
101	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	302/A-2	0.29	0.0011733
102	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	53/B-1A	0.07	0.0002832
103	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	53/B-1D	0.01	0.0000405
104	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	53/B-1F	0.04	0.0001618
105	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/10A-1B	0.01	0.0000405
106	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/10A-1C	0.41	0.0016589
107	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/35A-1A	0.67	0.0027108
108	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/35A-1B	0.47	0.0019016
109	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/35A-1C	0.29	0.0011733
110	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	130/35A-2	0.49	0.0019825
111	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	7/B-1A	0.18	0.0007283
112	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	41/B-B2	0.05	0.0002023
113	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	41/B-A	0.31	0.0012543
114	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	44/A-2	0.04	0.0001618
115	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	44/A-3	0.02	0.0000809
116	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	38/B-1B2	0.03	0.0001214
117	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	38/B-2B2	0.02	0.0000809
118	పిడుగురాళ్ళ	పిడుగురాళ్ళ	165/A-3B	0.01	0.0000405
			పిడుగురాళ్ళ మొత్తం విస్తీర్ణం:	24.12	0.0975895

గ్రామం : కామేపల్లి మండలం : పిడుగురాళ్ళ

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	పిడుగురాళ్ళ	కామేపల్లి	182/B-1	0.15	0.0006069
2	పిడుగురాళ్ళ	కామేపల్లి	187/A-2	0.03	0.0001214
3	పిడుగురాళ్ళ	కామేపల్లి	199-1	0.03	0.0001214
4	పిడుగురాళ్ళ	కామేపల్లి	198/B-1A1	0.03	0.0001214
5	పిడుగురాళ్ళ	కామేపల్లి	198/B-1A2	0.03	0.0001214
6	పిడుగురాళ్ళ	కామేపల్లి	198/B-1A3	0.18	0.0007283
7	పిడుగురాళ్ళ	కామేపల్లి	198/B-1A4	0.07	0.0002832
8	పిడుగురాళ్ళ	కామేపల్లి	198/B-2A	0.02	0.0000809
9	పిడుగురాళ్ళ	కామేపల్లి	198/B-3A	0.01	0.0000405
10	పిడుగురాళ్ళ	కామేపల్లి	197/B-1	0.37	0.0014970
11	పిడుగురాళ్ళ	కామేపల్లి	195/B-1	0.44	0.0017802
12	పిడుగురాళ్ళ	కామేపల్లి	204/1-1B2	0.06	0.0002428
13	పిడుగురాళ్ళ	కామేపల్లి	204/1-2A1	0.37	0.0014970
14	పిడుగురాళ్ళ	కామేపల్లి	204/1-2A2	0.04	0.0001618
15	పిడుగురాళ్ళ	కామేపల్లి	204/5/B-1	0.35	0.0014161
16	పిడుగురాళ్ళ	కామేపల్లి	205/B-1A1	0.62	0.0025085
17	పిడుగురాళ్ళ	కామేపల్లి	205/B-1B1	0.07	0.0002832
18	పిడుగురాళ్ళ	కామేపల్లి	205/B-1A3	0.13	0.0005260
19	పిడుగురాళ్ళ	కామేపల్లి	205/B-1C1	0.23	0.0009306
20	పిడుగురాళ్ళ	కామేపల్లి	205/B-2A	0.08	0.0003237
21	పిడుగురాళ్ళ	కామేపల్లి	205/B-3A	0.08	0.0003237
22	పిడుగురాళ్ళ	కామేపల్లి	206/B-1	0.13	0.0005260
23	పిడుగురాళ్ళ	కామేపల్లి	209/B-1	0.50	0.202343
24	పిడుగురాళ్ళ	కామేపల్లి	222/B-1	0.63	0.0025490
25	పిడుగురాళ్ళ	కామేపల్లి	224/B	0.01	0.0000405
26	పిడుగురాళ్ళ	కామేపల్లి	223/B-1	0.51	0.0020635
27	పిడుగురాళ్ళ	కామేపల్లి	583/B	0.02	0.0000809
28	పిడుగురాళ్ళ	కామేపల్లి	580/B-1A1	0.13	0.0005260
29	పిడుగురాళ్ళ	కామేపల్లి	580/B-1A2	0.28	0.0011329
30	పిడుగురాళ్ళ	కామేపల్లి	580/B-1A3	0.31	0.0012543
31	పిడుగురాళ్ళ	కామేపల్లి	580/B-2A1	0.18	0.0007283
32	పిడుగురాళ్ళ	కామేపల్లి	580/B-2A2	0.08	0.0003237
33	పిడుగురాళ్ళ	కామేపల్లి	577/A-2	0.02	0.0000809
34	పిడుగురాళ్ళ	కామేపల్లి	577/B	0.01	0.0000405
35	పిడుగురాళ్ళ	కామేపల్లి	578/B-1A	0.16	0.0006474
36	పిడుగురాళ్ళ	కామేపల్లి	578/B-1B	0.10	0.0004046
37	పిడుగురాళ్ళ	కామేపల్లి	578/B-1C	0.27	0.0010924
38	పిడుగురాళ్ళ	కామేపల్లి	578/B-1D	0.11	0.0004451
39	పిడుగురాళ్ళ	కామేపల్లి	578/A-2	0.05	0.0002023
40	పిడుగురాళ్ళ	కామేపల్లి	576-1A2	0.04	0.0001618
			కామేపల్లి మొత్తం విస్తీర్ణం	6.93	0.0280388

గ్రామం : కోనంకి మండలం : పిడుగురాళ్ళ

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	పిడుగురాళ్ళ	కోనంకి	279/12-1B1	0.10	0.0004046
2	పిడుగురాళ్ళ	కోనంకి	279/12-1B2	0.09	0.0003641
3	పిడుగురాళ్ళ	కోనంకి	279/12-2	0.35	0.0014161
4	పిడుగురాళ్ళ	కోనంకి	279/13A-1B	0.07	0.0002832
5	పిడుగురాళ్ళ	కోనంకి	279/13A-2	0.21	0.0008497
6	పిడుగురాళ్ళ	కోనంకి	279/16-1C1	0.6450	0.0026097
7	పిడుగురాళ్ళ	కోనంకి	279/16-1C2	0.07	0.0002832
8	పిడుగురాళ్ళ	కోనంకి	279/16-2	0.10	0.0004046
9	పిడుగురాళ్ళ	కోనంకి	279/16-3A1	0.19	0.0007687
10	పిడుగురాళ్ళ	కోనంకి	279/16-3A2	0.39	0.0015779
11	పిడుగురాళ్ళ	కోనంకి	279/17A-1	0.01	0.0000405
12	పిడుగురాళ్ళ	కోనంకి	279/17A-2	0.49	0.0019825
13	పిడుగురాళ్ళ	కోనంకి	280/16A-2	0.30	0.0012138
14	పిడుగురాళ్ళ	కోనంకి	280/33A-1B	0.32	0.0012947
15	పిడుగురాళ్ళ	కోనంకి	280/33A-2B1	0.21	0.0008497
16	పిడుగురాళ్ళ	కోనంకి	280/33A-2B2	0.10	0.0004046
17	పిడుగురాళ్ళ	కోనంకి	280/34A-2	0.12	0.0004855
18	పిడుగురాళ్ళ	కోనంకి	280/35A-2	0.04	0.0001618
19	పిడుగురాళ్ళ	కోనంకి	280/35B-1B	0.70	0.0028322
20	పిడుగురాళ్ళ	కోనంకి	280/35B-2	0.12	0.0004855
21	పిడుగురాళ్ళ	కోనంకి	280/36-2	0.08	0.0003237
22	పిడుగురాళ్ళ	కోనంకి	280/41-2	0.02	0.0000809
23	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-1B1	0.02	0.0000809
24	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-1B2	0.16	0.0006474
25	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-1B3	0.15	0.0006069
26	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-1B4	0.25	0.0010115
27	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-1B5	0.10	0.0004046
28	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-1B6	0.10	0.0004046
29	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-1B7	0.04	0.0001618
30	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-2B1	0.02	0.0000809
31	పిడుగురాళ్ళ	కోనంకి	280/42A-2B2	0.07	0.0002832
32	పిడుగురాళ్ళ	కోనంకి	280/43A-2	0.12	0.0004855
33	పిడుగురాళ్ళ	కోనంకి	280/1	0.07	0.0002832
34	పిడుగురాళ్ళ	కోనంకి	280/2A-1	0.22	0.0008901
35	పిడుగురాళ్ళ	కోనంకి	280/2A-2	0.10	0.0004046
36	పిడుగురాళ్ళ	కోనంకి	280/3A	0.01	0.0000405
37	పిడుగురాళ్ళ	కోనంకి	280/7A-2	0.09	0.0003641
38	పిడుగురాళ్ళ	కోనంకి	280/7A-3	0.11	0.0004451
39	పిడుగురాళ్ళ	కోనంకి	280/7A-4	0.06	0.0002428
40	పిడుగురాళ్ళ	కోనంకి	280/7A-5	0.02	0.0000809
41	పిడుగురాళ్ళ	కోనంకి	280/7A-6	0.07	0.0002832
42	పిడుగురాళ్ళ	కోనంకి	280/7A-7	0.63	0.0025490
43	పిడుగురాళ్ళ	కోనంకి	280/44-1	0.02	0.0000809
44	పిడుగురాళ్ళ	కోనంకి	280/44-2	0.08	0.0003237
45	పిడుగురాళ్ళ	కోనంకి	280/44-3	0.10	0.0004046
			కోనంకి గ్రామ విస్తీర్ణం:	7.3350	0.0296774

గ్రామం : పెదగార్లపాడు మండలం : దాచేపల్లి

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	దాచేపల్లి	పెదగార్లపాడు	2/B-2	0.02	0.0080937
2	దాచేపల్లి	పెదగార్లపాడు	7/B-2	0.09	0.0364217
3	దాచేపల్లి	పెదగార్లపాడు	8/A-1B1	0.09	0.0364217
4	దాచేపల్లి	పెదగార్లపాడు	8/A-1B2	0.16	0.0647497
5	దాచేపల్లి	పెదగార్లపాడు	8/A-1B3	0.14	0.0566559
6	దాచేపల్లి	పెదగార్లపాడు	8/A-1B4	0.22	0.0890308
7	దాచేపల్లి	పెదగార్లపాడు	8/A-3B	0.02	0.0080937
8	దాచేపల్లి	పెదగార్లపాడు	11/A-3B	0.21	0.0849839
9	దాచేపల్లి	పెదగార్లపాడు	12/A-2A	0.02	0.0080937
10	దాచేపల్లి	పెదగార్లపాడు	12/A-2B	0.08	0.0323748
11	దాచేపల్లి	పెదగార్లపాడు	13/A-2A	0.03	0.0121405
12	దాచేపల్లి	పెదగార్లపాడు	13/A-2B	0.19	0.0768902
13	దాచేపల్లి	పెదగార్లపాడు	13/A-2C	0.18	0.0728434
14	దాచేపల్లి	పెదగార్లపాడు	24/A-2B1	0.01	0.0040468
15	దాచేపల్లి	పెదగార్లపాడు	24/A-2B2	0.11	0.0445154
16	దాచేపల్లి	పెదగార్లపాడు	24/A-3B	0.09	0.0364217
17	దాచేపల్లి	పెదగార్లపాడు	24/A-4B1	0.01	0.0040468
18	దాచేపల్లి	పెదగార్లపాడు	24/A-4B2	0.05	0.0202342
19	దాచేపల్లి	పెదగార్లపాడు	26-A2	0.01	0.0040468
			పెదగార్లపాడు మొత్తం విస్తీర్ణం:	1.73	0.7001062

గ్రామం : కేసానుపల్లి మండలం : దాచేపల్లి

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	దాచేపల్లి	కేసానుపల్లి	33/82	0.19	0.0768902
2	దాచేపల్లి	కేసానుపల్లి	33/82		
3	దాచేపల్లి	కేసానుపల్లి	33/82		
4	దాచేపల్లి	కేసానుపల్లి	34/B	0.15	0.0607028
5	దాచేపల్లి	కేసానుపల్లి	34/B		
6	దాచేపల్లి	కేసానుపల్లి	35/B	0.01	0.0040468
7	దాచేపల్లి	కేసానుపల్లి	109-1B	0.28	0.113312
8	దాచేపల్లి	కేసానుపల్లి	221/B	0.02	0.0080937
9	దాచేపల్లి	కేసానుపల్లి	221/B	0.01	0.0040468
10	దాచేపల్లి	కేసానుపల్లి	225/B	0.09	0.0364217
11	దాచేపల్లి	కేసానుపల్లి	225/B	0.10	0.0040468
12	దాచేపల్లి	కేసానుపల్లి	229/B	0.015	0.0060702
13	దాచేపల్లి	కేసానుపల్లి	229/B	0.105	0.0424919
14	దాచేపల్లి	కేసానుపల్లి	230/B	0.13	0.0526091
15	దాచేపల్లి	కేసానుపల్లి	230/B	0.06	0.0242811
16	దాచేపల్లి	కేసానుపల్లి	236/B	0.01	0.0040468
17	దాచేపల్లి	కేసానుపల్లి	236/B	0.06	0.0242811
18	దాచేపల్లి	కేసానుపల్లి	237/1-B	0.02	0.0080937
19	దాచేపల్లి	కేసానుపల్లి	238/B	0.06	0.0242811
20	దాచేపల్లి	కేసానుపల్లి	238/B	0.07	0.0283279
21	దాచేపల్లి	కేసానుపల్లి	336/17-B	0.01	0.0040468
22	దాచేపల్లి	కేసానుపల్లి	336/17-B	0.03	0.0121405
23	దాచేపల్లి	కేసానుపల్లి	336/17-B	0.04	0.0161874
24	దాచేపల్లి	కేసానుపల్లి	336/17-B	0.03	0.0121405
25	దాచేపల్లి	కేసానుపల్లి	81/B2	0.03	0.0121405
			కేసానుపల్లి గ్రామ విస్తీర్ణం:	1.52	0.6151222

గ్రామం : నడికుడి మండలం : దాచేపల్లి

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	దాచేపల్లి	నడికుడి	218/16-2B2	0.32	0.1294994
2	దాచేపల్లి	నడికుడి	218/24-A2A	0.06	0.0242811
3	దాచేపల్లి	నడికుడి	220-3A	0.07	0.0283279
4	దాచేపల్లి	నడికుడి	224/1-3C1	0.36	0.1456868
5	దాచేపల్లి	నడికుడి	224/1-3C1	0.18	0.0728434
6	దాచేపల్లి	నడికుడి	218/17-1B	0.03	0.0121405
7	దాచేపల్లి	నడికుడి	218/17-3A1	0.11	0.0445154
8	దాచేపల్లి	నడికుడి	218/17-3C1	0.06	0.0242811
9	దాచేపల్లి	నడికుడి	218/19-A1B	0.03	0.0121405
10	దాచేపల్లి	నడికుడి	218/19-A3A1	0.14	0.0566559
11	దాచేపల్లి	నడికుడి	218/23-B1B1A	0.03	0.0121405
			నడికుడి గ్రామ విస్తీర్ణం	1.39	0.562513

గ్రామం : రామాపురం మండలం : దాచేపల్లి

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	దాచేపల్లి	రామాపురం	19-1C1A2	0.05	0.0202342
2	దాచేపల్లి	రామాపురం	19-1C1A2	0.13	0.0526091
3	దాచేపల్లి	రామాపురం	27-1A1B	0.13	0.0526091
4	దాచేపల్లి	రామాపురం	27-1C1	0.05	0.0202342
5	దాచేపల్లి	రామాపురం	27-3C2B	0.07	0.0283279
6	దాచేపల్లి	రామాపురం	27-3C2B	0.05	0.0202342
			రామాపురం గ్రామ విస్తీర్ణం	0.48	0.1942491

గ్రామం : పొందుగల మండలం : దాచేపల్లి

క్ర నం.	మండలం	గ్రామం పేరు	సర్వే నెం. మరియు సబ్ డివిజన్	ఎకరాలు	హెక్టార్లు
1	దాచేపల్లి	పొందుగల	57-1C2	0.05	0.0202342
2	దాచేపల్లి	పొందుగల	57-3A2	0.42	0.169968
3	దాచేపల్లి	పొందుగల	58-3A2	0.28	0.113312
4	దాచేపల్లి	పొందుగల	58-5B2	0.09	0.0364217
5	దాచేపల్లి	పొందుగల	62-A3C2	0.39	0.1578274
6	దాచేపల్లి	పొందుగల	62-B3B	0.42	0.169968
7	దాచేపల్లి	పొందుగల	68/3A3	0.01	0.0040468
8	దాచేపల్లి	పొందుగల	71-2B	0.19	0.0768902
9	దాచేపల్లి	పొందుగల	71-2B	0.24	0.0971245
10	దాచేపల్లి	పొందుగల	71-1-1	0.01	0.0040468
11	దాచేపల్లి	పొందుగల	84-1B2	0.22	0.0890308
12	దాచేపల్లి	పొందుగల	84-3A	0.01	0.0040468
13	దాచేపల్లి	పొందుగల	86-2B2	0.18	0.0728434
14	దాచేపల్లి	పొందుగల	88-2C2	0.16	0.0647497
15	దాచేపల్లి	పొందుగల	247-1C2	0.10	0.0404686
16	దాచేపల్లి	పొందుగల	775-1B	0.10	0.0404686
17	దాచేపల్లి	పొందుగల	775/2-2A2B	0.02	0.0080937
18	దాచేపల్లి	పొందుగల	775/2-3A2	0.19	0.0768902
19	దాచేపల్లి	పొందుగల	777-1B	0.36	0.1456868
20	దాచేపల్లి	పొందుగల	778-1A2	0.01	0.0040468
21	దాచేపల్లి	పొందుగల	787-1A3	0.06	0.0242811
22	దాచేపల్లి	పొందుగల	787-1C1B	0.04	0.0161874
23	దాచేపల్లి	పొందుగల	788-1A2	0.35	0.14164
24	దాచేపల్లి	పొందుగల	791-1A1B	0.12	0.0485622
25	దాచేపల్లి	పొందుగల	791-1A1C1	0.11	0.0445154
26	దాచేపల్లి	పొందుగల	791-1A1C2	0.05	0.0202342
27	దాచేపల్లి	పొందుగల	791-1A1C3	0.02	0.0080937
			పొందుగల గ్రామ విస్తీర్ణం	4.20	1.69968
			మొత్తం విస్తీర్ణం:	76.775	31.0697402

ప్రదేశం : గురజాల
తేది : తేది : 26-01-2026

సం/- వి. మురళీకృష్ణ
కాంపిటెంట్ అథారిటీ (యల్.ఎ) &
రెవిన్యూ డివిజనల్ అధికారి
గురజాల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర

గ్రూప్-2 ఫలితాలు.. నేడే!

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 అభ్యర్థుల ఎదురు చూపులు ఫలించనున్నాయి. తుది ఫలితాల కోసం కొంత కాలంగా ఎదురు చూస్తున్న వారికి ఏపీపీఎస్సీ తీపికబురు చెప్పనుంది. గ్రూప్-2 తుది ఫలితాలను బుధవారం విడుదల చేయనుంది. ఈ మేరకు కమిషన్ చర్యలు ప్రారంభించింది. క్రీడా కోటాలో ఇద్దరు అభ్యర్థుల(న్యాయశాఖ ఏఎస్‌వో, ఎక్సైజ్ ఎస్ఐ)కు సంబంధించిన పోస్టులను మినహాయించి మిగిలిన 903 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే, ఎవరికి ఏ పోస్టు వస్తుందనే అంశంపై జాబితాల రూపకల్పన ప్రక్రియను మంగళవారం ప్రారంభించినట్లు తెలిసింది. దీంతో తుది ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. 'గ్రూప్-2' ఫలితాల జాప్యంపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. మంగళవారం ప్రచురించిన కథనంపై ప్రభుత్వ స్థాయిలో చర్చ జరిగింది. ప్రక్రియ పూర్తయినా ఫలితాలు విడుదల చేయకపోవడం పట్ల అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు సైతం అభిప్రాయపడ్డారు. దీంతో ప్రస్తుతానికి గ్రూప్-2 తుది ఫలితాల విడుదలకు అడ్డంకులు లేనందున అభ్యర్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని సర్కారు నిర్ణయించింది. ఈ పరిణామాల అనంతరం.. తుది ఫలితాలు విడుదల చేసేలా ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. కాగా, 905 పోస్టులకు గాను సర్టిఫికెట్ల పరిశీలనకు 2,559 మంది హాజరవగా.. వారిలో 903 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 2 పోస్టులపై కోర్టు కేసుల పరిష్కారం అనంతరం నిర్ణయం తీసుకోనున్నారు.


మేడారానికి తరలి వస్తున్న భక్తులు

నేటి నుంచి సమ్మక్క-సారక్క జాతర

వరంగల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దారులన్నీ మేడారం వైపే! పోదామిక మహాజాతరకు అంటూ భక్తజనం కదులుతోంది. వండుకునేందుకు సరుకులు.. కోళ్లు, గొర్రెలు, వనదేవతలకు మొక్కులు తీర్చుకునేందుకు బెల్లం ముద్దలు, పసుపు, కుంకుమ, ఒడిబియ్యాన్ని ఎడ్ల బండ్లు, ఆటోల్లో వేసుకొని 'జై సమ్మక్క-జై జై సారలమ్మ' అంటూ పిల్లాజెల్లాను వెంట బెట్టుకొని బయలుదేరింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాదు.. పొరుగునున్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలుతున్నారు. మేడారం మహాజాతర మొదలయ్యేది బుధవారమే. బుధవారం నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు రోజుకో ప్రధాన ఘట్టంతో మహాజాతర భక్తులను ఆనందపారవశ్యంలో ముంచెత్తనుంది.

ఇప్పటికే భక్తులతో మేడారం జనసంద్రంగా మారింది. కాగా వనదేవతల్లో ఒకరైన సమ్మక్క కూతురు సారలమ్మ, సమ్మక్క భర్త పగిడిద్దరాజు, ఆయన తమ్ముడు గోవిందరాజులు రాకతో మహాజాతరకు తెరలేవనుంది. ఇందుకు సారక్క కొలువుదీరిన కన్నేపల్లి ముస్తాబైంది. బుధవారం ఉదయం అక్కడ సారలమ్మ ఆలయాన్ని ప్రధాన పూజారి కాక సారయ్య, మిగతా పూజారులు శుద్ధిచేసి అలంకరిస్తారు. సాయంత్రం ఆలయంలో పూజారులు రహస్య పూజలు జరుపుతారు. అనంతరం ఆలయం నుంచి గద్దెలవైపు పూజారులు సారలమ్మను తీసుకొస్తారు. కన్నేపల్లిలోని ప్రతి గడప సారలమ్మకు స్వాగతం పలుకుతుంది. ఆ తల్లి కన్నేపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగు దాటి మేడారంలోని సమ్మక్క ఆలయానికి చేరుకుంటుంది. సమ్మక్క భర్త పగిడిద్దరాజు, మరిది గోవిందరాజులు కుడా గద్దెలపైకి బుధవారమే చేరుకుంటారు. కాగా, ఈ ఏడాది 3 కోట్ల మంది ఈ జాతరకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు.

ఏడు కిలోమీటర్లు డోలీలో తీసుకుని వచ్చి..

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గిరిశిఖర ఓటకకోసు గ్రామం మైదాన ప్రాంతానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు. కొద్దిరోజులుగా ఆ గ్రామంలో కాలువాపుతో వాటక నిమ్మలమ్మ అనే 16 ఏళ్ల గిరిజన బాలిక బాధపడుతోంది. చివరకు నడవలేని పరిస్థితి ఉండడంతో మంగళవారం బాలిక తండ్రి వాటక నరసయ్య, బంధువులు కలిసి డోలీ సాయంతో ఆమెను మైదాన ప్రాంతమైన బట్టిమూగవలస వరకు తెచ్చారు. అక్కడ నుంచి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నికలడగా ఉందని బంధువులు తెలిపారు.

-కొమరాడ, ఆంధ్రజ్యోతి




తిరుమల దిగువ ఘాట్ రోడ్డులో సోప్ బ్రష్ చెట్లు

- కొండలను ఆక్రమిస్తున్న సీమ జాతి చెట్లు
- స్థానిక వృక్ష జాతులు ఎదగకుండా నిరోధం
- దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యత
- ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో వెల్లడి
- సీఎం చంద్రబాబు ఆదేశంతో టీటీడీ దిద్దుబాటు చర్యలు
- పదేళ్ల ప్రణాళికకు పాలకమండలి ఆమోదం

తిరుమల గిరులకు పచ్చని ముప్పు..!



ఈ 3 జాతులతోనే ముప్పు

ఆస్ట్రేలియా తుమ్మ...

దీని ఆకులు చెవిని పోలినట్టు వుంటాయి. అందుకే దీన్ని చెవి ఆకు తుమ్మ అని కూడా పిలుస్తారు. ఇది ఆస్ట్రేలియా, ఇండొనేషియా, పపువా న్యూ గినియా దేశాలకు చెందింది. నీడ కోసం, తేనెటీగలను ఆకర్షించడం కోసం వీటిని పెంచుతారు. బాగా ఎత్తు పెరుగుతుంది.

సోప్ బ్రష్

ఉత్తర ఆస్ట్రేలియాకు చెందిన చెట్టు ఇది. వాస్తవానికి ఇది చెట్టు కాదు.. గుబురుగా పొదలా పెరుగుతుంది. ఆకులు వెండి రంగులో వుంటాయి.

సీమ తంగేడు

ఇది దక్షిణ అమెరికా, మధ్య అమెరికా ప్రాంతాలకు చెందిన రకం. బాగా గుబురుగా పెరుగుతుంది.

తిరుమల దిగువ ఘాట్ రోడ్డులో ఆస్ట్రేలియా తుమ్మ చెట్లు



తిరుమల కొండల్లోని పచ్చదనం దురాక్రమణకు గురవుతోంది..!

ఈ పని చేస్తున్నది ఎర్రచందనం స్మగ్లర్లో...

భూ బకాసురులో కాదు.. కొన్ని రకాల చెట్లే..!

శేషాచలంలో పచ్చదనాన్ని పెంచే ఆలోచనతో 40 ఏళ్ల కిందట టీటీడీ చేసిన ప్రయత్నమే ఈ పరిస్థితికి కారణమైంది. వేగంగా పెరిగే స్వభావంగల కొన్ని రకాల మొక్కలను అప్పట్లో తిరుమల గిరుల్లో నాటారు. అవి వేగంగా విస్తరించాయి. కానీ.. ఈ క్రమంలో ఇతర మొక్కలేవీ పెరగకుండా అడ్డుకుంటున్నాయి. ఇప్పుడు ఈ సీమ జాతి మొక్కల విస్తరణ ఆందోళనకర స్థాయికి చేరడంతో టీటీడీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

తిరుమల శ్రీవారి ఆలయం కేంద్రంగా చుట్టూ 6,800 ఎకరాల అటవీ ప్రాంతం 27.19 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. బండలు నిండిన కొండలతో ఉన్న శేషాచలంలో పచ్చదనం పలచగా కనిపిస్తుండడంతో భారీఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని 1980లో ప్రారంభించారు. విమానాలతోనూ విత్తనాలు చల్లారు. ఆ ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది కూడా. అయితే అప్పట్లో నాటిన మొక్కల్లో కొన్ని సీమజాతులు.. స్థానిక రకాల చెట్లను పెరగకుండా నిరోధిస్తున్నాయి. ఈ ప్రాంత జీవ వైవిధ్యానికే ముప్పు కలిగిస్తున్నాయి. ఆక్రమణ స్వభావం కలిగిన మొక్కలు స్థానిక జాతుల ఉనికిని దెబ్బతీస్తున్నాయి. తిరుమల పరిధిలోని 6,800 ఎకరాల అడవుల్లో ఇప్పటికే 1,440 నుంచి 1,500 ఎకరాల్లో విదేశీ రకాల చెట్లు, పొదలు నిండిపోయాయి. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో ఈ ఆకుపచ్చని దురాక్రమణ అంశం వెల్లడైంది. ఈ అంశం సీఎం చంద్రబాబు దృష్టికి కూడా వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు టీటీడీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో దీనిపై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించింది. నిపుణుల సూచనతో పదేళ్ల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించింది.

పదేళ్ల కాలానికి ఐదు అంచెల ప్రణాళిక



తిరుమల అడవుల్లో పెరిగిపోతున్న ఆస్ట్రేలియా తుమ్మ, సోప్ బ్రష్, సీమ తంగేడు వంటి విదేశీ రకాలను తొలగించి.. వాటి స్థానంలో స్థానిక మొక్కలు పెంచడంపై టీటీడీ దృష్టి సారించింది. ప్రత్యామ్నాయంగా రావి, మర్రి, అత్తి లేదా బ్రహ్మ మామిడి, చైనీస్ మర్రి, కొండ మర్రి, పెద్ద జువ్వి లేదా పిట్ట జువ్వి, చుక్కలి లేదా బారంకి వంటి రకాల చెట్లను పెంచనున్నారు. ఇందుకోసం తిరుమల గ్రీన్ అండ్ బయో డైవర్శిటీ యాక్షన్ ప్లాన్‌ను టీటీడీ సిద్ధం చేసింది. 2025 నుంచి 2035 వరకూ ఐదు దశలుగా ఈ ప్రణాళిక అమలు చేయనుంది. 2025-27 మధ్య మొదటి దశ కింద 175 ఎకరాల్లో విదేశీ రకాల చెట్లను తొలగించి, వాటి స్థానంలో నీడనిచ్చే స్థానిక రకాల పెంపకం చేపడతారు. 2027-29 మధ్య రెండో దశలో 375 ఎకరాల్లో విదేశీ చెట్లను తొలగించి స్థానిక ఔషధ రకాల మొక్కల నర్సరీలు ఏర్పాటు చేస్తారు. 2029-31 మధ్య మూడో దశలో 375 ఎకరాల్లో, 2031-33 మధ్య నాలుగో దశలో 300 ఎకరాల్లో, అలాగే 2033-35 మధ్య చివరిదైన ఐదో దశలో 250 ఎకరాల్లో విదేశీ రకం చెట్లను తొలగిస్తారు.

అన్ని రకాలకూ ప్రాధాన్యం

తిరుమల కొండల్లో వన్య ప్రాణులకు ఆహారంగానూ ఉపయోగపడేలా స్థానిక పళ్ల రకాల చెట్ల పెంపకంపైనా టీటీడీ దృష్టి సారించింది. నేరేడు, కరక్కాయ, తానికాయ లేదా తాండ్ర చెట్టు, ఉసిరి, పరికి, తునికి, నల్ల తుమికి, మారేడు లేదా బిల్వ, ఇప్ప వంటి పళ్ల రకాల చెట్లు పెంచనుంది. అలాగే ఔషధ మొక్కలైన సర్పగంధ, నీలవేము, తిప్ప తీగ, తులసి, తుమ్మి, అడ్డసరం లేదా మలబార్ నట్, నన్నారి, పొడపత్రి, శతావరి, వట్టివేరు, నిమ్మగడ్డి వంటి మొక్కలు, భూసారాన్ని కాపాడేందుకు ఎరుపు గోధుమ రంగులో వుండే గోల్డెన్ బియర్డ్ గ్రాస్, ఊబ గడ్డి లేదా పంది ముల్లు గడ్డి, చిగిరింత గడ్డి, కుస గడ్డి, గరిక, కొండ చీపురు గడ్డి వంటి రకాలను కూడా పెంచనుంది. అలాగే ఏడాది పొడవునా తిరుమల గిరులకు పుష్పవర్ణ శోభ కలిగించేందుకు కూడా టీటీడీ సిద్ధమవుతోంది. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పరిచేందుకు పరిమళాలు వెదజల్లే పూల రకాలు, నీడనిచ్చే చెట్లను పెంచనుంది. శ్రీవారి ఆలయం పక్కనున్న పద్మ పుష్కరిణి చుట్టూ కూడా సువాసన వెదజల్లే పూల చెట్లు, భక్తుల వసతి సముదాయాల వద్ద ఔషధ వనాల పెంపకం చేపట్టనుంది.

- తిరుపతి - ఆంధ్రజ్యోతి

హమ్మయ్య.. పులి అడవిలోకి వెళ్లింది!

ఊపిరిపీల్చుకున్న ఏజెన్సీవాసులు

- యథావిధిగా పొలం పనులకు రైతులు
- చివరి పంజాకు మరో రెండు మూగజీవాలు బలి


కొయ్యలగూడెం మండలం కంద్రికగూడెంలో పెద్దపులి దాడిలో మరణించిన గేదె దూడను పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీని వారంపాటు గజగజలాడించిన పెద్దపులి ఎట్టకేలకు మంగళవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో తిరిగి అభయారణ్యంలోకి వెళ్లిపోయింది. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలోని బిల్లిమిల్లి ప్రాంతం నుంచి బయల్దేరిన పులి కంద్రికగూడెం వద్ద జీలుగుమిల్లి-పోలవరం జాతీయ రహదారిని దాటి బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు పలు చోట్ల మూగజీవాలను బలిగొన్న పులి.. చివరిగా కె.ఆర్.పురం పంచాయతీ పరిధిలోని అమ్మపాలెంలో యల్లంపాటి సత్యనారాయణకు చెందిన గేదె దూడను మంగళవారం తెల్లవారు జామున చంపేసింది. అంతకు ముందు మంగపతి దేవిపేటలో ఆవు దూడను చంపేసింది. అక్కడి నుంచి అమ్మపాలెం వద్దకు చేరుకుని కన్నాపురం, పులిరామన్నగూడెం రహదారిని దాటి కామయ్యకుంట చేరుకుని అక్కడి నుంచి కొవ్వాడ కాల్వలోకి దిగి లంకపల్లి అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. అయితే పులి మళ్లీ అడవి నుంచి బయటికొచ్చే అవకాశం ఉందనే ఉద్దేశంతో ట్రాప్ కెమెరాలను అమర్చారు. మొత్తంమీద 12 పశువులు పులి దాడిలో చనిపోయాయి. వారం రోజులుగా హడలెత్తించిన పులి ఎట్టకేలకు అడవిలోకి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి వారివారి పొలాలకు తరలివెళ్లారు.


ఉదయం 7:26:15 గంటల సమయంలో నడిచి వస్తున్న బాలుడు


మరుక్షణంలోనే విద్యుత్ స్తంభం కూలిపోతుండగా త్రుటిలో తప్పించుకుంటున్న బాలుడు

ఆ బాలుడు.. మృత్యుంజయుడు

- ఒక్కసారిగా నేలకొరిగిన విద్యుత్ స్తంభం
- అప్రమత్తతతో ఒక్కక్షణంలో దక్కిన ప్రాణం
- కర్నూలులో గగుర్పాటు కలిగించిన ఘటన

కర్నూలు న్యూసిటి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టరు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వెరసి.. ఓ బాలుడి ప్రాణం మీదకు వచ్చింది. అయితే ఆ చిన్నారి ఒక్క క్షణంలో అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాలతో బయటపడి మృత్యుంజయుడిగా నిలిచాడు. కర్నూలులో మంగళవారం జరిగిన ఈ ఘటన తీవ్ర గగుర్పాటు కలిగించింది. 45వ వార్డు అశోక్‌నగర్‌లో మంగళవారం ఉదయం 7.26 గంటల సమయంలో ఓ విద్యార్థి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం ఒక్కసారిగా కుప్పకూలింది. విద్యుత్ సరఫరా ఉండటంతో వైర్ల తాకిడికి నిప్పులు కూడా చెలరేగాయి. సరిగ్గా స్తంభం కూలిపోతున్న సమయంలో అటువైపు చూసిన బాలుడు.. ఆలస్యం చేయకుండా వెనక్కి పరుగెత్తాడు. క్షణాల్లో ప్రాణాలతో బయటపడ్డాడు. ఓ ఇంటి సీసీ కెమెరాల్లో నమోదైన ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యం వల్లే

అశోక్‌నగర్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కాలువల నిర్మాణం కోసం గుంతలు తవ్వారు. పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా స్తంభానికి ఓ వైపు మొత్తం తవ్వించేశాడు. దీంతో బలం లేకపోవడంతో స్తంభం ఒక్కసారిగా కూలిపోయింది. సాధారణంగా కాలువలకు గుంతలు తీసే సమయంలో విద్యుత్ స్తంభాలను మరోచోటకు మార్చడమో లేక, ముందస్తుగా వాటికి మొదలు భాగాన్ని కాంక్రీట్‌తో పటిష్ఠ పరచడమో చేయాలి. అలా కాకుండా కాలువ కోసం కాంట్రాక్టర్ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. కనీసం పనులను పరిశీలించాల్సిన కార్పొరేషన్ అధికారులు కూడా పట్టించుకోలేదు.

కోస్తాలో పొగమంచు

విశాఖపట్నం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కోస్తాలోని పలు జిల్లాల్లో మంగళవారం ఉదయం పొగమంచు కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకూ పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో ఎక్కువచోట్ల, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ పొగ మంచు ప్రభావం కనిపించింది. ఏజెన్సీ, శివారు ప్రాంతాల్లో చలి గాలులు వీచాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కోస్తాలో సాధారణం కంటే తక్కువగా, రాయలసీమలో సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో అక్కడక్కడ పొగ మంచు ప్రభావం ఉంటుందని, ఇతర ప్రాంతాల్లో పొడిగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

23 మంది భారత మత్స్యకారుల విడుదల

వీరిలో తొమ్మిది మంది విజయనగరం జిల్లావాసులే

విశాఖపట్నం/భోగాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి చెందిన 23 మంది మత్స్యకారులు బంగ్లాదేశ్‌లోని బాగేర్‌హట్ జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో తొమ్మిది మంది విజయనగరం జిల్లాకు చెందినవారు ఉన్నారు. మంగళవారం భారత డిప్యూటీ హై కమిషనర్ చంద్రజీత్ ముఖర్జీ, బంగ్లాదేశ్ హోం, విదేశాంగ శాఖల అధికారులు, పోలీసులు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో వీరిని జైలు నుంచి విడుదల చేశారు. ఇరుదేశాల మధ్య ఉన్న పరస్పర ఖైదీల అప్పగింత ఒప్పందం మేరకు వీరిని గురువారం బంగ్లాదేశ్ ప్రాదేశిక జలాల్లో భారత కోస్ట్ గార్డు అధికారులకు అప్పగించనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం కొండ్రాజుపాలెంకు చెందిన మరుపల్లి చిన్నఅప్పన్న, మరుపల్లి రమేష్, సూరాడ అప్పలకొండ, మరుపల్లి ప్రవీణ్, సురపతి రాము, అప్పలకొండ, పూసపాటిరేగ మండలం తిప్పలవలసకు చెందిన నక్కా రమణ, వాసపల్లి సీతయ్య, మైలపల్లి అప్పన్న విశాఖపట్నంలోని జాలరుపేటలో నివాసం ఉంటూ సముద్రంలో చేపల వేటతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ తొమ్మిది మంది గతేడాది అక్టోబరు 13న సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. తమ జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారంటూ అదే నెల 22న వీరిని బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే, మన దేశానికి చెందిన మరో 14 మంది మత్స్యకారులను కూడా అరెస్టు చేశారు. అప్పటి నుంచి మూడు నెలలకుపైగా వీరంతా అక్కడ జైల్లో ఉన్నారు. వారి విడుదల కోసం విశాఖ ఎంపీ శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర ప్రభుత్వం ద్వారా తీవ్రస్థాయిలో ప్రయత్నించారు. ఎట్టకేలకు బంగ్లాదేశ్ ప్రభుత్వం వారిని విడుదల చేసిందని అక్కడకు వెళ్లిన ఈస్ట్‌కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు. 29 నాటికి అధికారిక కార్యక్రమాలు పూర్తి చేసుకొని బంగ్లాదేశ్ అధికారులు స్వాధీనం చేసుకున్న వీరి పడవపైనే తిరిగి స్వస్థలాలకు రానున్నారు. వీరి విడుదలపై విజయనగరం జిల్లాలోని వారి కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.



బంగ్లాదేశ్‌లో భారత మత్స్యకారులతో విశాఖ మత్స్యకార నాయకుడు జానకిరామ్


బుల్లెట్ తగిలి పగిలిన ఇంటి కిటికీ అద్దాలు, (ఇన్‌సెట్‌లో) ఫైర్ అయిన బుల్లెట్ వ్యర్థం

ఎన్‌సీసీ శిక్షణలో గురితప్పిన బుల్లెట్

తప్పిన పెనుప్రమాదం

నరసాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని ఏడో ఆంధ్ర ఎన్‌సీసీ క్యాడెట్స్ ఫైరింగ్ శిక్షణలో బుల్లెట్ గురితప్పింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం నరసాపురం వైఎస్ కళాశాల మైదానంలో, ఎన్‌సీసీ ఏబీసీ సర్టిఫికెట్ల జారీలో భాగంగా విద్యార్థులకు ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఒక విద్యార్థి తుపాకీ నుంచి వెళ్లిన బుల్లెట్ సమీపంలోని ఇంటి అద్దాలు పగులగొట్టి లోనికి దూసుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే పరిసర ప్రాంత ప్రజలు ఆ వార్డు టీడీపీ నాయకుడు కొల్లు పెద్దిరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నివాసాల మధ్య ఫైరింగ్ చేయడం సరికాదని వెంటనే శిక్షణను ఆపాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.



ఏలూరు జిల్లా నల్లమాడులో పీ4 పథకం కింద నిర్మించిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, పక్కన లబ్ధిదారు జలాది లక్ష్మి, దాత వెంకట రామారావు



ఆమె కల నెలవేరింది

పీ-4 లబ్ధిదారుకు ఇంటి నిర్మాణం పూర్తి

రూ.9 లక్షలు వెచ్చించిన దాత పసుపులేటి రామారావు

నిడమర్రు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తెచ్చిన పీ4(పబ్లిక్ ప్రైవేటు పీపుల్ పార్టనర్‌షిప్) పథకం ద్వారా ఓ పేదింటి మహిళ సొంత ఇంటి కల నెరవేరింది. గత నెలలో ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నల్లమాడుకు విచ్చేసిన సీఎం చంద్రబాబు సమక్షంలో గ్రీన్ ఆసియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ పసుపులేటి వెంకట రామారావు మార్గదర్శి(దాత)గా అదే గ్రామానికి చెందిన బంగారు(పేద) కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. బంగారు కుటుంబానికి చెందిన జలాది లక్ష్మి ఇంటి నిర్మాణం నిధులు లేక సగంలో ఆగిపోవడంతో రామారావు సుమారు రూ.9 లక్షలు వెచ్చించి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, దాత పసుపులేటితో కలిసి మంగళవారం ఆ ఇంటిని పరిశీలించారు. పీ-4 ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండాయంటూ ఎమ్మెల్యే అన్నారు.



టీడీపీ వర్క్‌షాప్‌లో నేతల మధ్య కూర్చున్న టీడీపీ అధినేత చంద్రబాబు

అమరావతికి వ్యతిరేకం కాదు

» రాజధాని రైతుల ప్రయోజనాలను బిల్లులో పెడితే మద్దతిస్తాం: వైసీపీ

న్యూఢిల్లీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి వైసీపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ పక్షనేతలు మిథున్ రెడ్డి, పిల్లి సుభాశ్ చంద్రబోస్ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం వారిద్దరూ వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. "అమరావతికి మేం వ్యతిరేకం కాదు. అయితే, రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల ప్రయోజనాలు కాపాడే అంశాలను బిల్లులో పెడితే మద్దతు ఇస్తాం. అమరావతిలో ఇటీవల జరిగిన సమావేశంలో రైతులు తమ సమస్యలను వెల్లడించారు. పోలవరానికి కేంద్రమే పూర్తిగా నిధులివ్వాలి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదు. 'జీ-రామ్ జీ'కి సంబంధించి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తక్షణమే విడుదల చేయాలి. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ సరికాదు. ఈ అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తుతాం." అని వారు తెలిపారు. కాగా, వైసీపీ అధ్యక్షుడు జగన్ అమరావతికి వ్యతిరేకమని చెబుతుండగా, ఆ పార్టీ ఎంపీలు మాత్రం ఢిల్లీలో మద్దతునిస్తామని చెప్పడం గమనార్హం.

అమరావతికి చట్టబద్ధత కల్పించాలి

» పార్లమెంటు అఖిల పక్ష సమావేశంలో టీడీపీపీ నేత లావు

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ(టీడీపీపీ) నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ తరఫున చేసిన ప్రతిపాదనలను శ్రీకృష్ణదేవరాయలు మీడియాకు వివరించారు. "పిల్లలపై తీవ్రంగా ప్రభావం చూపుతున్న సోషల్ మీడియాపై ఆంక్షలు విధించాలి. 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా 30 రోజుల కంటే ఎక్కువకాలం జైలులో ఉంటే, ఐదేళ్ల కంటే ఎక్కువ నేరచరిత్ర ఉంటే.. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రి వంటి వారే స్వయంగా హోదాల నుంచి తప్పుకోవాలి. చార్జిషీట్ దాఖలై ఉంటే ఎన్నికల్లో పోటీ చేయకూడదు. స్పెషల్ కోర్టు ద్వారా ఒక టైమ్ లిమిట్ పెట్టి ఈ కేసులను విచారించే అంశంపై చర్చించాలి. అలాగే, మూడు రాజధానులంటూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన గందరగోళాన్ని తొలగించాలి. ఏపీకి శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కలిగించే బిల్లును తీసుకురావాలి. 'జల్ జీవన్ మిషన్' ద్వారా రాష్ట్రానికి రూ.26 వేల కోట్లు కేటాయించాలి. గతంలో రూ.26 వేల కోట్లు ప్రకటించినా.. 2019-24 మధ్య కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే వినియోగించారు. వైసీపీ ప్రభుత్వం నుంచి చొరవ లేకపోవడంతో నిధులు నిలిచిపోయాయి. వీటిని పునరుద్ధరించి రాష్ట్రానికి న్యాయం చేయాలి" అని సమావేశంలో ప్రస్తావించానని లావు తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణపై కఠిన చట్టం: జనసేన

డ్రగ్స్, సోషల్ మీడియా నియంత్రణపై కఠిన చట్టం చేయాలని జనసేన పార్లమెంటరీ పార్టీ నేత బాలశౌరి కేంద్రాన్ని కోరారు. అఖిలపక్ష సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఆక్వా ఉత్పత్తులపై అమెరికా సెస్సుల ప్రభావం తీవ్రంగా ఉందని, ఈ అంశంపై పార్లమెంట్ వేదికగా పరిష్కారం చూపాలని కోరినట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ త్వరలోనే ఢిల్లీకి వచ్చి, రాష్ట్రానికి నిధుల కేటాయింపు, అమరావతికి చట్టబద్ధత అంశాలపై కేంద్రంలోని పెద్దలతో చర్చిస్తారని తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ అత్యంత దుర్మార్గమైన చట్టం

» ధర్మాన ప్రసాదరావు కేంద్రానికి లేఖ రాయడం సిగ్గు చేటు: సోమిరెడ్డి

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అత్యంత దుర్మార్గమైన చట్టం. దీని ద్వారా సామాన్య ప్రజల ఆస్తి హక్కులను జగన్‌రెడ్డి లాక్కునే ప్రయత్నం చేశారు' అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'దుర్మార్గమైన చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతూ వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావు కేంద్రానికి లేఖ రాయడం సిగ్గు చేటు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కేంద్రం... ప్రభుత్వ అధికారులను నియమించమంటే... 'ఏ వ్యక్తినైనా...' అనే పదాన్ని చేర్చి తమకు అనుకూలంగా ఉండే విశ్రాంత అధికారులతో పేదల భూములు కబ్జా చేసేందుకు వైసీపీ సిద్ధమైంది. వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బ్రిటీష్ కాలం నాటి నిబంధనల కంటే దారుణంగా ఉంది' అని సోమిరెడ్డి అన్నారు.

రాహుల్‌గాంధీతో షర్మిల భేటీ



న్యూఢిల్లీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచే ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని రాహుల్‌ను కోరారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి ఫిబ్రవరి 2వ తేదీతో 20 ఏళ్లు పూర్తవుతుందన్నారు. అందుకే ఏపీ నుంచే ఉపాధి హామీ పునరుద్ధరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని రాహుల్ గాంధీని కోరానని పేర్కొన్నారు. ఆయన తప్పనిసరిగా వస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఐదు రోజుల పనిదినాలు కావాలి

» బెజవాడ ధర్నాచౌక్‌లో యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో ధర్నా

విజయవాడ అర్బన్, నెల్లూరు(హరనాథపురం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో వారానికి ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ఒక్క రోజు సమ్మె చేపట్టడంతో మంగళవారం బ్యాంకు కార్యకలాపాలు స్తంభించాయి. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ నాయకుల పిలుపు మేరకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ఏపీ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ ప్రతినిధి, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.ఎస్.ఆర్. రాజశేఖర్ మాట్లాడుతూ 2015లో జరిగిన ఒప్పందం ప్రకారం 2, 4వ శనివారాలను సెలవులుగా ప్రకటించారని, మిగతా శనివారాలను కూడా సెలవులుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని అప్పట్లో ఇచ్చిన హామీ ఇంకా అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో అమరావతి సర్కిల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.కాశీవిశ్వనాథ్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సమ్మెలో 9 యూనియన్లకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.




విజయవాడలో యూబీఐ జోనల్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

డబ్బుతోనే రాజకీయం చేయలేం!

ప్రజలకు మనపై నమ్మకం ఉండాలి: చంద్రబాబు

» పార్టీ కంటే ఎవరూ ముఖ్యం కాదు

» కమిటీల వర్క్‌షాపులో సీఎం స్పష్టీకరణ



> పార్టీలో కార్యకర్తే అధినేత. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగినప్పుడే నాయకులుగా మీరు, పార్టీ శాశ్వతంగా ఉంటాయి. ఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి. వారి ద్వారానే జరగాలి. - చంద్రబాబు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'డబ్బులతోనే రాజకీయం చేయలేం. ప్రజలకు మనపై నమ్మకం ఉండాలి. డబ్బుతోనే అన్నీ నడుస్తాయనుకుంటే డబ్బులున్న వాళ్లే రాజకీయం చేస్తారు. మనలాంటి వాళ్లు చేయలేరు' అని సీఎం చంద్రబాబు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీల వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో కార్యకర్తలు కష్టాలు పడ్డారు. ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పసుపు జెండా కోసం రక్తం చిందించారు. అనేక త్యాగాలు చేశారు. అందుకే పార్టీలో ఎవరికి ఏ పదవి ఇచ్చినా కార్యకర్తల అభిప్రాయానికి పెద్ద పీట వేస్తున్నాం. సమర్థ నాయకులు తయారు కావడానికి టీడీపీ ఓ వేదిక' అని తెలిపారు. పొలిటికల్ గవర్నెన్స్‌లో పార్లమెంటరీ కమిటీలు కీలకమని, ఆ నియోజకవర్గం పరిధిలో చేపట్టే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయా కమిటీల అధ్యక్షులతో ఎమ్మెల్యేలు, ఎంపీలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ కమిటీలు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. 'పదవులు తీసుకున్నవారి పనితీరును 3 నెలలకోసారి అధ్యయనం చేస్తాం. సరిగా చేయకపోతే పక్కన పెట్టి, మరొకరికి అవకాశమిస్తాం' అని తెలిపారు. తిరుమలేశుడి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారని.. దానినీ సమర్థించుకుంటున్నారంటే ఏం చేయాలని ప్రశ్నించారు. ఇంకా ఏమన్నారంటే..

యువరక్తానికి ప్రాధాన్యం..

మరింత సమర్థంగా పనిచేసేలా పార్టీ రోజురోజుకూ బలోపేతం కావాలి. అందుకే యువరక్తానికి ప్రాధాన్యం ఇచ్చాం. 2024 ఎన్నికల్లో 80 శాతం మంది కొత్తవారికి, చదువుకున్న వారికి ఎంపీ, ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పించాం. దేశంలోనే యంగ్ పార్లమెంటరీ పార్టీగా టీడీపీ ఉంది. సమర్థులకు పెద్దపీట వేశాం. 2024 ఎన్నికల్లో కూటమికి ఎన్ని ఓట్లు వచ్చాయో.. 2029లో అంతకు 10 ఓట్లు అదనంగా రావాలి. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో 2024 ఎన్నికలనాటి కంటే కూటమి మరింత బలోపేతమైంది. ఎన్నికలప్పుడే ప్రజల వద్దకు వెళ్లడం కాదు.. ప్రభుత్వ కార్యక్రమాలను వివరించేందుకు వారితో మమేకం కావాలి. పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదు. ఎవరు నిర్లక్ష్యం వహించినా పక్కన పెడతా. పార్టీ సిద్ధాంతానికి అందరూ కట్టుబడి పనిచేయాలి. వచ్చిన అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకునే బాధ్యత నాయకత్వం, శ్రేణులపై ఉంది. నాయకులెవ్వరూ క్యాడర్‌ను విస్మరించకూడదు. ఎవరికి కేటాయించిన పదవుల్లో వారే పనిచేయాలి. కావాలని ఎక్కడైనా వివాదాలు సృష్టిస్తే పక్కన పెడతాం.

రెవెన్యూ అతి పెద్ద సమస్య..

ఆర్థికేతర సమస్యల్లో రెవెన్యూ పెద్ద సమస్య. ఎన్నికల ముందు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే రద్దు చేశాం. గత ప్రభుత్వం లోపభూయిష్టమైన చట్టాన్ని తెచ్చింది. ఎవరికైనా అన్యాయం జరిగితే ఎక్కడా చెప్పుకోకుండా హైకోర్టుకు మాత్రమే వెళ్లాలని పేర్కొంది. ఇది సామాన్యులకు సాధ్యమేనా? పట్టాదార్ పాస్‌పుస్తకాలపై తమ ఫొటోలు ముద్రించుకున్నారు. పొలం సరిహద్దు రాళ్లపై ఫొటోలు, పేర్లు ముద్రించుకున్నారు. వాళ్లు అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏ జాబితాలో పెట్టారు. కక్ష తీర్చుకోవడానికి అన్ని ఆయుధాలూ ఉపయోగించారు. అందుకే మళ్లీ రీసర్వే చేసి సమస్యలు లేకుండా ఏడాదిలో పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇస్తాం.

క్రెడిట్ చోరీ అంటూ అసత్యాలు: మాట్లాడితే క్రెడిట్ చోరీ అంటూ అసత్యాలు వల్లె వేస్తున్నారు. భోగాపురం విమానాశ్రయానికి 2,500 ఎకరాలు కేటాయిస్తే అందులో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారు. మనం వచ్చాక మళ్లీ విమానాశ్రయం పనులు పరుగులు పెట్టించి జూన్‌కల్లా పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నాం. రాజధానిగా అమరావతికి అభ్యంతరం లేదని చెప్పి ఆ తర్వాత అడుగడుగునా అడ్డుకుంటూ వచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారు. ఇప్పుడు మళ్లీ మనం రాజధానికి జీవం పోశాం. అమరావతే మనకు రాజధాని. అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం. కర్నూలులో హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటు చేస్తాం. రాజధాని పనులు వేగంగా జరుగుతుండడంతో ఇప్పుడు మళ్లీ సీఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అంటూ కొత్త పాట ఎత్తుకున్నారు. రాజకీయాల్లో ఉండేవారికి స్థిరత్వం ఉండాలి. హంద్రీ-నీవా నీటిని కుప్పం తెస్తున్నామంటూ డ్రామా ఆడారు. మరుసటి రోజే గేటు ఎత్తుకుపోయారు. వెలిగొండను సైతం పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారు.

తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టాలి..

మనం చేసే పనులు ఎంత ముఖ్యమో తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియా, మీడియాలోనే కాదు.. మౌత్ టు మౌత్ కూడా చెప్పాలి. ఏ అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమం జరిగినా కార్యకర్తలు ఓనర్‌షిప్ తీసుకోవాలి. మనం చేసింది చెప్పుకోవాలి. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నేతలు, కార్యకర్తలు కూడా మారాలి. రాబోయే రోజుల్లో అన్ని ఎన్నికల్లో గెలిచేలా సంకల్పం తీసుకోవాలి.

4వ సారి సీఎం అయినా... సామాన్య కార్యకర్తే!

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంటరీ పార్టీ కమిటీల వర్క్‌షాపులో సీఎం చంద్రబాబు సామాన్య కార్యకర్తలా పాల్గొనడం అందరినీ ఆకర్షించింది. 25 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వర్క్‌షాపునకు హాజరైన 1,050 మందికి పార్టీ సీనియర్ నేతలతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో చంద్రబాబు పాల్గొని శిక్షణ శిబిరాల్లో సీనియర్ నేతలు చెబుతున్న అంశాలను ఆసక్తిగా విన్నారు. వర్క్‌షాపు జరుగుతున్న ప్రతి గదికీ వెళ్లి చివరి వరుసలో కూర్చుని నేతలు చెప్పిన అంశాలను విన్నారు. నాలుగోసారి సీఎంగా ఉన్నా సామాన్య కార్యకర్తలా తమతోపాటు చంద్రబాబు శిక్షణ తరగతుల్లో కూర్చోవడం తమకు స్ఫూర్తినిస్తోందని పలువురు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పయ్యావులకు సీఎం ప్రశంసలు!

వర్క్‌షాపులో పార్టీ ఆవిర్భావంపై తరగతులు తీసుకునే బాధ్యతను మంత్రి పయ్యావుల కేశవ్‌కు అప్పగించారు. కేశవ్ క్లాస్ తీసుకుంటున్న సమయంలో చంద్రబాబు అక్కడికి వచ్చారు. పయ్యావుల ఆసక్తికరంగా చెబుతుండటంతో సీఎం చాలాసేపు అక్కడే వింటూ ఉండిపోయారు. టీడీపీ ఆవిర్భావం నాటి పరిస్థితులు, పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఆనాడు ఉన్న జనాదరణ, లక్ష్మీపార్వతి ప్రవేశం, ఎన్టీఆర్ పదవీచ్యుతుడు కావడం, పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని చంద్రబాబు దక్కించుకుని పార్టీని ముందుకు నడిపిన వైనం తదితర అంశాలను సోదాహరణగా పయ్యావుల వివరించారు. పయ్యావుల చెప్పిన తీరును చూసిన చంద్రబాబు... బాగా చెబుతున్నారంటూ ప్రశంసించారు.

లోకేశ్ యువగళానికి మూడేళ్లు

యువగళం పాదయాత్ర ప్రారంభించి మంగళవారంతో మూడేళ్లు పూర్తయ్యాయి. 2023 జనవరి 27న కుప్పం నుంచి లోకేశ్ యువగళం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం ఆధ్వర్యంలో భారీ కేక్‌ను టీడీపీ నేతలు కట్ చేసి వేడుక నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కేక్‌ను కట్ చేశారు. పలువురు మంత్రులు, నాయకులు లోకేశ్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

కూటమికి విడాకుల్లేవు!

కలిసికట్టుగా ముందుకెళ్లాలి: లోకేశ్.. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు ఉండాలి

» టీడీపీ-జనసేన-బీజేపీ మధ్య విభేదాల సృష్టికి వైసీపీ ప్రయత్నం

» అభివృద్ధి, సంక్షేమానికి బాబు బ్రాండ్ అంబాసిడర్

» కల్తీ నెయ్యి, కల్తీ మద్యానికేమో టీమ్-11

» పార్లమెంటరీ కమిటీల వర్క్‌షాపులో లోకేశ్



టీడీపీ నేతల వర్క్‌షాప్‌లో మంత్రి లోకేశ్ అభివాదం

> చంద్రబాబు ట్రెండ్‌సెట్టర్. 75 ఏళ్ల వయసులో కూడా యువకుడిలా పనిచేస్తున్నారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు సేవ చేయాలని నిత్యం ఆలోచించే వ్యక్తి.
>
> ఎన్టీఆర్ ఎంతో మంది యువతకు అవకాశాలు కల్పించారు. ఇప్పుడు టీడీపీని మళ్లీ యువరక్తంతో నింపాల్సిన సమయం వచ్చింది. అందుకే యువతను ప్రోత్సహిస్తున్నాం. - మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో విభేదాలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. మనం అప్రమత్తంగా ఉండాలి. మనకు విడాకులు లేవు.. కలిసికట్టుగా ముందుకెళ్లడమే మన ఎజెండా' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీల వర్క్‌షాపును రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం కేంద్ర కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ప్రాంతీయ పార్టీ ఒకసారి ప్రతిపక్షంలోకి వస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటుందో మనందరం చూశామని ఈ సందర్భంగా అన్నారు. కానీ కార్యకర్తల బలంతో వాటన్నిటినీ అధిగమించి అధికారంలోకి రాగలిగామని చెప్పారు. 'పార్టీ నేతలు అలకవీడాలి. లేదంటే మనందరం నష్టపోతాం. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం. కనీసం 15 ఏళ్లు కూటమి అధికారంలో ఉండి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం. చిన్న చిన్న సమస్యలు ఉంటాయ్. కలిసి పరిష్కరించుకుందాం' అని సూచించారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అయితే.. టీమ్-11 (జగన్ అండ్ కో) మాత్రం కల్తీ నెయ్యి, కోడి కత్తి, కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్లు అని ఎద్దేవాచేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టీడీపీలో మార్పులు రావాలన్నారు. మన బలం, బలగం కార్యకర్తలేనని చెప్పారు. పార్టీలో సంస్కరణల కోసం కృషి చేస్తున్నానన్నారు. 'సామాన్య గ్రామ పార్టీ అధ్యక్షుడు.. పొలిట్‌బ్యూరో వరకు ఎదగాలన్నదే నా ఆకాంక్ష. జిల్లా పార్టీ కమిటీల స్థానంలో పార్లమెంటరీ పార్టీ కమిటీలను తీసుకొచ్చేందుకు నాకు 18 నెలల సమయం పట్టింది. దీని కోసం పొలిట్‌బ్యూరోలో పోరాడాను. పార్లమెంటరీ కమిటీల్లో అంకితభావం ఉన్నవారినే నియమించాం. వీటిలో మొదటిసారి ఎన్నికైన వారు 83% మంది ఉన్నారు' అని తెలిపారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తానని చెప్పారు. చంద్రబాబు ఆలోచనలు ఎప్పుడూ ఓ దశాబ్దం ముందుంటాయన్నారు. '1995లో ఐటీని తీసుకొస్తే అందరూ ఎగతాళి చేశారు. ఈ రోజు సైబరాబాద్ ఆయన ముందుచూపునకు నిదర్శనంగా నిలిచింది. ఇప్పుడు ఏపీని క్వాంటమ్ కంప్యూటింగ్‌లో అగ్రగామిగా ఉంచేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారు. దేశం మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వస్తున్నాయి. ప్రతిపక్షం 200 కేసులు వేసినా 150 రోజుల్లో డీఎస్సీ పూర్తి చేసి 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలు కల్పించాం. 6వేల మందిని పోలీసు కానిస్టేబుళ్లుగా నియమించాం. చేసినవి చెప్పుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది' అని తెలిపారు.

పార్టీ సొంత ఇల్లు.. ప్రభుత్వం అద్దె ఇల్లు!

పార్టీ సొంత ఇల్లు అయితే.. ప్రభుత్వం అద్దె ఇల్లు వంటిదని లోకేశ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ పార్టీ కార్యాలయానికి సమయం కేటాయించాలన్నారు. చంద్రబాబుకు ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికోసారి కార్యాలయానికి వస్తున్నారని, కార్యకర్తలను కలుస్తున్నారని గుర్తుచేశారు. 'వ్యక్తులు శాశ్వతం కాదు. పార్టీయే శాశ్వతం. పదవిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి' అని కోరారు.

కమిటీ సభ్యులకు స్వయంగా ఆహ్వానం

వర్క్‌షాపునకు 25 పార్లమెంటరీ నియోజకవర్గాల నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు 40 మంది చొప్పున కమిటీ సభ్యులు హాజరయ్యారు. వీరందరికీ లోకేశ్ స్వయంగా ఆహ్వానం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి ఫొటోలు దిగారు. ఉదయం 8.15కే కార్యాలయానికి చేరుకున్న ఆయన.. రాత్రి 7.30 వరకు అక్కడే గడిపారు.



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీ. పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు

నెల్లూరులో యువగళం విజయోత్సవ ర్యాలీలు

నెల్లూరు, జనవరి 27(ఆక్టోబరు): సరిగ్గా మూడేళ్ల క్రితం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విజయవంతంగా సాగించిన యువగళం పాదయాత్రను స్మరించుకుంటూ నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం శ్రేణులు మంగళవారం భారీగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, రూరల్ సమన్వయకర్త కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వాటర్‌వేస్ చైర్మన్ జెడ్. శివప్రసాద్ సారథ్యంలో నెల్లూరు పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం మంత్రి నారాయణ ఆదేశాలతో నెల్లూరు సిటీ పరిధిలో జరిగిన ర్యాలీలో రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే 'కావ్య' కృష్ణారెడ్డి నేతృత్వంలో కావలి నుంచి కొత్తూరు వరకు పాదయాత్ర జరిగింది. గూడూరులో టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించగా, లోకేశ్ ఫ్లెక్సీకి డ్రోన్ సాయంతో పాలాభిషేకం చేశారు.

చంద్రబాబు పోతే విగ్రహం పెట్టేవాళ్లుండరు

» నాలుకలపై వాతలు పెట్టాలి.. కోసి కారం పెట్టాలి

» పేర్ని నాని వివాదాస్పద వ్యాఖ్యలు

» టీడీపీ నేతల ఫిర్యాదుతో కేసు నమోదు



చిన్నంపేట సభలో మాట్లాడుతున్న పేర్ని నాని

చాట్రాయి, మచిలీపట్నం టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'ఏ ఊరు వెళ్లినా వైఎస్ రాజశేఖర రెడ్డి చేసిన పనులు కనిపిస్తాయి. చంద్రబాబు చేసిన ఒక్క పని కూడా కన్పించడం లేదు. చంద్రబాబు చనిపోయాక ఆయన విగ్రహం పెట్టే వాడు కూడా ఉండడు' అంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిన్నంపేటలో ఆదివారం రాత్రి జరిగిన వైఎస్సార్ విగ్రహావిష్కరణ సభలో ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'రాజశేఖరరెడ్డి ఐదేళ్ల మూడు నెలలు, ఎన్టీఆర్ ఆరేళ్ల సీఎంలుగా పనిచేసి ప్రజలు హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వీరికి చంద్రబాబుకు పోలిక ఎక్కడ? దేవుడి విషయంలో కూడా జుగుప్సాకర రాజకీయాలు చేయటం దుర్మార్గం. జగన్ తిరుమల ప్రసాదంలో గొడ్డు, పంది కొవ్వు కలపాడని చంద్రబాబు బుర్ర కథలు చెబితే పవన్ కల్యాణ్, బీజేపీ వాళ్లు డోలక్ వాయించారు. ఇటువంటి వాళ్ల నాలుకలపై వాతలు పెట్టి, గుత్తి వంకాయ కోసినట్లు కోసి కారం పెట్టాలి' అని నాని వ్యాఖ్యానించారు. ఆఆయన వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు మచిలీపట్నంలోని ఇనకుదురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. 'సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను దూషిస్తూ, పేర్ని నాని.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యల వల్ల వైషమ్యాలు పెరిగిపోయే ప్రమాదం ఉంది. చంద్రబాబు నాలుకపై దబ్బళం కాల్చి గుచ్చాలి. ఒళ్లంతా వాతలు పెట్టాలి. పవన్ కల్యాణ్‌తో లక్షలాది ఆలయాలను కడిగించాలంటూ నాని బహిరంగ సభలోనూ, సోషల్ మీడియాలోనూ చేసిన వ్యాఖ్యలు టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టడమే. మా నాయకుడి పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా మాట్లాడారు' అంటూ శివగంగ పీఏసీఎస్ అధ్యక్షుడు పిప్పళ్ల కాంతారావు, మచిలీపట్నం అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు దిలీప్, టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, ఎండీ ఇలియాస్ పాషా తదితరులు ఇనకుదురు సీఐ పరమేశ్వర్‌కు ఫిర్యాదు పత్రం సమర్పించారు. దీనిపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 196(1), 353(2), 351(2), 352 కింద కేసు నమోదు చేశారు.


విజయవాడలో 'డ్రగ్స్‌పై దండయాత్ర' పేరుతో నిర్వహించిన సైకిల్ ర్యాలీకి హాజరైన వివిధ విభాగాల సిబ్బంది, విద్యార్థులు

కత్తి కంటే డ్రగ్స్ ప్రమాదం

- యువతకు నో చెప్పే ధైర్యం రావాలి: హోంమంత్రి అనిత
- విజయవాడలో 'డ్రగ్స్‌పై దండయాత్ర' సైకిల్ ర్యాలీ ప్రారంభం



విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో కత్తి, కర్ర వంటి ఆయుధాల కంటే మాదకద్రవ్యాలు (డ్రగ్స్) అత్యంత ప్రమాదకరమని హోంమంత్రి అనిత అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ తీసుకోవాలని స్నేహితులు బలవంతం చేసినప్పుడు 'నో' చెప్పకపోవడం వల్ల చాలామంది యువకులు చిక్కుల్లో పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం యువతలో నో చెప్పే ధైర్యం ఉండడం లేదని.. అయితే ఇలాంటి ఆఫర్లను నిర్మొహమాటంగా తిరస్కరించాలని సూచించారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో పనిచేసే ఐదుగురు మహిళా పోలీసులు 'డ్రగ్స్‌పై దండయాత్ర' పేరుతో చేపట్టిన సైకిల్ ర్యాలీని మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. డ్రగ్స్ నిర్మూలనకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ ప్రతి గంజాయి మొక్క మీదా నిఘా పెట్టి రాష్ట్రంలో గంజాయి సాగు లేకుండా చేసిందన్నారు. మాదకద్రవ్యాల బారినపడిన వారిని మామూలు స్థితికి తీసుకురావడానికి డీఎడిక్షన్ కేంద్రాలు పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. తాను ఓ కారాగారంలో ఖైదీలకు రాఖీ కట్టడానికి వెళ్లినప్పుడు గంజాయి కేసుల్లో ఇరుక్కుని రిమాండ్ ఖైదీలుగా ఉన్నవారు కన్నీళ్లు పెట్టుకున్నారని చెప్పారు. వారికి తల్లిదండ్రులు కూడా బెయిల్ ఇవ్వడానికి ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... సమాజహితం కోసం పనిచేసే వాళ్లే నిజమైన సెలబ్రిటీలని అన్నారు. సినిమాల్లో స్మగ్లర్లను హీరోలుగా చూపిస్తున్నారన్నారు. భారతీయులు అంతరిక్షానికి వెళ్తుంటే కొంతమంది యువకులు డ్రగ్స్‌బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, ఎంపీ కేశినేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వివాదంలో ఎమ్మెల్యే శ్రీధర్

- ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- వీడియో విడుదల చేసిన ఉద్యోగిని.. ఆమే నన్ను వేధిస్తోంది: ఎమ్మెల్యే శ్రీధర్
- పోలీసులకూ ఫిర్యాదు చేశాం: ఎమ్మెల్యే తల్లి

రైల్వే కోడూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ వివాదంలో చిక్కుకున్నారు. ఆయన ఏడాదిన్నరగా తనపై అత్యాచారం చేస్తున్నారంటూ ప్రభుత్వ ఉద్యోగిని ఒకరు వీడియో విడుదల చేశారు. అయితే... ఆ మహిళే తన కుమారుడిని వేధిస్తోందంటూ ఎమ్మెల్యే తల్లి అరవ ప్రమీల మీడియాకు తెలిపారు. తిరుపతి జిల్లా రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా అరవ శ్రీధర్ గెలిచినప్పుడు తాను అభినందిస్తూ ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టానని... ఆ తర్వాత ఆయన తనతో ఫోన్‌లో మాట్లాడారని సదరు ఉద్యోగిని వీడియోలో పేర్కొన్నారు. 2024 జూలైలో తనను కారులో ఎక్కించుకుని వెళ్లి, రాజంపేట ప్రాంతంలో అత్యాచారం చేశారని ఆరోపించారు. ఆ తర్వాత తనపై అనేకసార్లు అత్యాచారం చేశారని, తీవ్రంగా హింసించేవారని ఆరోపించారు. విడాకులు ఇవ్వాలంటూ తన భర్తను కూడా బెదిరించారని చెప్పారు. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో... మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఎమ్మెల్యే శ్రీధర్ ఒక వీడియో విడుదల చేశారు. "నేను ఎమ్మెల్యే కావడానికి ముందు మూడేళ్లు సర్పంచుగా పని చేశా. నాపై ఎలాంటి ఆరోపణలూ రాలేదు. ఇప్పుడు నాపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు. ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్న వారితోపాటు వారి వెనకున్న వారిని చట్టపరంగా ఎదుర్కొంటా. ఆ మహిళ గత ఆరు నెలలుగా నన్ను వేధిస్తుంటే మా అమ్మ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు" అని తెలిపారు.

మమ్మల్ని బెదిరించింది: ఎమ్మెల్యే తల్లి

మహిళ ఆరోపణలు సంచలనం సృష్టించడంతో... ఎమ్మెల్యే తల్లి అరవ ప్రమీల మంగళవారం రైల్వే కోడూరులో మీడియాతో మాట్లాడారు. 'రూ.25 కోట్లు ఇవ్వకుంటే మీ కొడుకు జీవితాన్ని నాశనం చేస్తామని ఆ మహిళ బెదిరించింది. బంధువునంటూ మా ఇంటికి వచ్చి, నా కుమారుడితో పరిచయం పెంచుకుంది. తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ వివాహం చేసుకోవాలని ఒత్తిడి పెంచింది. కొందరు వైసీపీ నాయకులు పనిగట్టుకుని ఆమె ద్వారా మమ్మల్ని మానసిక హింసకు గురి చేశారు. ఇటీవల ఆమె మా ఇంటికి వచ్చి గొడవ చేయడంతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాం. రైల్వే కోడూరు పోలీసులు ఆమెపై ఈనెల 7వ తేదీన కేసు నమోదు చేశారు. ఆమెపై న్యాయ పోరాటం చేస్తాం" అని ప్రమీల తెలిపారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై ఆ ఉద్యోగిని చేసిన ఆరోపణలు అవాస్తమని, అతి త్వరలో ఆమె బాగోతాన్ని సాక్ష్యాధారాలతో సహా బయటపెడతామని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తెలిపారు.

సమగ్ర విచారణ: మహిళా కమిషన్

రైల్వే కోడూరు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలకు సంబంధించి సదరు మహిళతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తీసుకున్నట్లు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీమ పంట పండింది!

- ప్రపంచంలోనే అతి పెద్ద ఉద్యాన క్లస్టర్‌గా రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలు: సీఎం
- 20 ప్రాజెక్టులు పూర్తయితే 8.87 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు: అచ్చెన్న

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పెద్ద పండ్ల తోటల ఉత్పత్తుల క్లస్టర్‌గా రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాలను తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దుబాయ్‌కు చెందిన డీపీ వరల్డ్ సంస్థ రాష్ట్రంలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందన్నారు. ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. గ్లోబల్ మార్కెట్లో డిమాండ్‌కు తగినట్లుగా 500 మెట్రిక్ టన్నుల ఉద్యానవన ఉత్పత్తులే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని అధికార యంత్రాంగానికి సూచించారు. ఇందుకుగాను పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేద్దామన్నారు. పది జిల్లాల్లో 20కిపైగా ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జల వనరుల శాఖను ఆదేశించారు. ఆ ప్రాజెక్టులను పూర్తిచేస్తే కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని అధికారులు వివరించారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో ఉద్యానవనాభివృద్ధిపై మంగళవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. జగన్ హయాంలో పడగొట్టిన ప్రాజెక్టులను నిలబెడదామన్నారు. పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఇదే సమయంలో సీమ జిల్లాలతో పాటు.. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఈ ఏడాదిలోనే వెలిగొండ పూర్తి

హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టును కల్యాణి డ్యామ్ వరకూ విస్తరించాలని జల వనరుల శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పలు శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పూర్వోదయకింద గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, జల వనరుల శాఖల ప్రాజెక్టులు చేపట్టడంపై సమీక్షించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ.2,041 కోట్ల నిధులు అవసరమని సీఎంకు మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు.


ఇరిగేషన్ ప్రాజెక్టులపై జరిగిన సమావేశంలో సీఎం, నిమ్మల, అధికారులు

ఉద్యాన సాగు విస్తీర్ణం పెంచుదాం..

పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తయితే.. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు అపారంగా పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. మొత్తం పది జిల్లాల్లో 301 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యానవన పంటలను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేశామని వెల్లడించారు. ఉద్యావన పంటల విస్తీర్ణాన్ని మూడేళ్లలో 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సీఎం స్పందిస్తూ.. రోడ్ల నెట్‌వర్క్, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్టుల కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్‌చైన్ తదితర లాజిస్టిక్స్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. 'పూర్వోదయ' ద్వారా వచ్చే నిధులతో పాటు ఉద్యాన రంగంలో ప్రైవేటు పెట్టుబడులు రప్పించేందుకు ప్రణాళికలు సిద్ధంచేయాలని ఆదేశించారు. సీమ ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర పథకాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే ఉత్తరాంధ్ర వరకు గోదావరి జలాలను తరలించవచ్చన్నారు.

పూర్తి చేసే 20కి పైగా ప్రాజెక్టులివే..

వెలిగొండ, కొరిశపాడు, పాలార్ డ్యాం, మల్లెమడుగు లిఫ్టు-జలాశయం,శ్రీబాలాజీ రిజర్వాయర్, కుప్పం బ్రాంచ్ కెనాల్, పుంగనూరు బ్రాంచ్ కెనాల్, మూలపల్లి, హంద్రీ-నీవా ప్రధాన కాలువ, అల్తూరుపాడు-మేర్లపాక ఎస్ఎస్ఎల్‌సీ(సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్), నీవా బ్రాంచ్ కెనాల్, జీడిపల్లి-భైరవానితిప్ప లిఫ్టు, జీడిపల్లి-అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల, అనంత మైక్రో కమ్యూనిటీ ఇరిగేషన్ ప్రాజెక్టు, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ, పేరూరు లిఫ్టు, కడప, రైల్వేకోడూరు వరకు గాలేరు-నగరి పనులు, అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ, వేదవతి ప్రాజెక్టు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, సంజీవయ్య సాగర్ ప్రాజెక్టు, 7 జిల్లాల్లో 1,011 చిన్నసాగు చెరువుల అభివృద్ధి.

> ఉద్యాన రంగంలో రాయలసీమ సీమను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉంది. ఇందుకోసం అంతర్జాతీయ విధానాలను అధికారులు అధ్యయనం చేయాలి. స్థానికంగా ఉద్యాన ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అనువుగా గ్రామీణ రోడ్లు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేద్దాం.
> - సీఎం చంద్రబాబు

ఉద్యాన సాగుకూ పీపీపీ విధానం!

- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు: సీఎం

రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను ఉద్యానవన క్లస్టర్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానం అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. వివిధ శాఖలతో సీఎం సమీక్షలో ఉద్యాన శాఖ ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. ఉద్యాన పంటల సాగుకు పీపీపీ విధానంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిశ్చయించింది. ఇందులో ప్రభుత్వం రూ.32 వేల కోట్ల నుంచి రూ.35 వేల కోట్ల దాకా పెడుతుంది. మిగతా రూ.65-68 వేల కోట్లు ప్రైవేటు రంగం నుంచి సమకూర్చుకోవాలి. కాగా, రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చేందుకు కేంద్ర పథకాలు పూర్వోదయ, మిద్, ఆర్‌వీఐ పథకాల ద్వారా రూ.8,650 కోట్లు సాధించాలని ఆర్థికశాఖ భావిస్తోంది. పీఎం కిసాన్ సంపద యోజన, ఆగ్రోప్రాసెసింగ్ క్లస్టర్‌కింద మరో రూ.15,000 కోట్లను కేంద్రం నుంచి సమకూర్చుకోవాలని భావిస్తోంది.హైటెక్ ప్రాసెసింగ్ కింద రూ10,000 కోట్లు, లాజిస్టిక్స్ కోసం ఇంకో రూ.7,000 కోట్లను రాబట్టుకోవచ్చని అంచనా వేస్తోంది.

రాజ్యాంగంపై మోదీ బుల్డోజర్!

- ఆయన సెల్యూట్ రాజ్యాంగానికి కాదు.. సంఘ్‌కు
- ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం
- మహిళా రిజర్వేషన్లపై పార్టీల ద్వంద్వ వైఖరి
- కేరళలో వెలుగులు.. దేశంలో చీకటి పాలన
- 'ఆంధ్రజ్యోతి'తో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్



హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇండియా గేట్ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసే సెల్యూట్.. భారత రాజ్యాంగానికి కాదని, అది రాజ్యాంగాన్ని అంగీకరించని ఆరెస్సెస్ భావజాలానికి, సంఘ్ పరివారానికేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ అన్నారు. పేద మహిళలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని మోదీ అంతం చేస్తున్నారని విమర్శించారు. దీనిపై మహిళా లోకం పోరాటం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంపై బుల్డోజర్ నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐద్వా మహాసభల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు.

దేశంలో మహిళలపై పెరుగుతున్న హింస, అణచివేతకు ప్రధాన కారణాలేంటి?

దేశంలో మహిళలపై జరుగుతున్న హింస సామాజిక సమస్య మాత్రమే కాదు.. ఇది రాజకీయ వైఫల్యం. ప్రస్తుతం బీజేపీ-ఆరెస్సెస్ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతోంది. రాజ్యాంగంపై బుల్డోజర్ నడిపితే మొదట హరించేది సామాన్య మహిళల హక్కులే. న్యాయవ్యవస్థ బలహీనపడితే, పోలీసు వ్యవస్థ బాధ్యత తీసుకోకపోతే నేరస్థులకు ధైర్యం వస్తుంది. ప్రభుత్వం మహిళల భద్రతపై పూర్తి బాధ్యత తీసుకోవాలి. గతంలో ఎన్నడూ లేనంతగా మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయి. ఇది ఆందోళనకర విషయం.

మహిళా సాధికారత కోసం ఐద్వా ఉద్యమాలు ఎలా సాగుతున్నాయ్?

ఐద్వా మహిళల పోరాట స్వరం. సాధికారత అనేది మాటల్లో కాదు, హక్కుల్లో కనిపించాలి. మహిళలపై హింసకు వ్యతిరేకంగా మాత్రమే కాదు, ఉపాధి, సమాన వేతనం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపైనా ఉద్యమిస్తున్నాం. పేద మహిళలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఆ పథకం లేకపోతే గ్రామీణ మహిళల జీవనం ప్రశ్నార్థకం అవుతుంది. ఈ పథకాన్ని పునరుద్ధరించే వరకు మహిళలు పోరాటం చేస్తారు. కొత్త చట్టం వల్ల గ్రామీణ మహిళలకు ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడుతుంది.

మహిళలకు రిజర్వేషన్లు ఎందుకు అమలు కావడం లేదు?

మహిళా రిజర్వేషన్ల బిల్లు ఏళ్లుగా వాయిదా పడుతూనే ఉంది. రాజకీయ పార్టీల ద్వంద్వ వైఖరే దీనికి కారణం. మహిళల ఓట్లు కావాలి కానీ, మహిళలకు అధికారం ఇవ్వాలంటే వెనకడుగు వేస్తారు. నిజాయతీ ఉంటే ఈ బిల్లు ఎప్పుడో అమలయ్యేది. దేశంలో మహిళా రిజర్వేషన్ పేరుతో బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలను నడుపుతోంది. జనాభాలో సగానికిపైగా ఉన్న మహిళలకు చట్టసభల్లో నిర్ణయాత్మక భాగస్వామ్యం లేకపోవడం ప్రజాస్వామ్య వైఫల్యంగానే చూడాలి. ఐద్వా దీనిపై రాజీలేని పోరాటం చేస్తుంది.

ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలు మహిళల జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి?

ఆర్థిక సంక్షోభం ప్రభావం మొదటగా పడేది మహిళలపైనే. ధరల పెరుగుదలతో ఇంటి ఖర్చులు పెరుగుతాయి. నిరుద్యోగంతో మహిళల ఉపాధి తగ్గిపోతుంది. అసంఘటిత రంగంలోని మహిళలకు రక్షణ ఉండదు. మరోవైపు బీజేపీ-ఆరెస్సెస్ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది. ఈ విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా చీకటి పాలన సాగుతున్న వేళ, కేరళ ప్రభుత్వం మాత్రం మహిళా వికాసానికి, సామాజిక న్యాయానికి ఒక వెలుగులా పని చేస్తోంది.

వామపక్షాల బలహీనతకు కారణం ఏంటి?

వామపక్షాలు బలహీన పడడానికి రాజకీయ పరిస్థితులు మారిపోవడం ఒక కారణమైతే.. కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం పెరగడం మరో కారణం. యువత, కార్మికులు, రైతులు, మహిళల సమస్యలపై వామపక్షాలు బలమైన ఉద్యమాలు చేయాల్సి ఉంది. బెంగాల్‌లో సీపీఎంకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం. త్రిపురలోనూ బీజేపీ కూటమి పట్ల ప్రజలు అసహనంతో ఉన్నారు. కేరళలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పినరయి విజయన్ నాయకత్వంలోనే (ఎల్‌డీఎఫ్) ఎన్నికలకు వెళుతున్నాం.

మహిళల హక్కుల కోసం పోరాటాలు

- 14వ ఐద్వా మహాసభల పిలుపు
- తొమ్మిది తీర్మానాలతో భవిష్యత్ కార్యాచరణ

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్ర జ్యోతి): మహిళలు జీవించే హక్కు కోసం, వారి ఆత్మ గౌరవం కోసం భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందర్ రామన్ స్పష్టంచేశారు. మానవ మనుగడకు అవసరమైన గాలి, నీరు కూడా ప్రైవేటుపరం చేస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 1981లో అవిర్భవించిన ఐద్వా.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.6కోట్ల మంది సభ్యత్వంతో మహిళల పక్షాన పోరాడుతోందని గుర్తుచేశారు. మహిళా హక్కుల కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని సుధా సుందర్ రామన్ స్పష్టం చేశారు. కాగా, మహాసభల మూడో రోజున తొమ్మిది తీర్మానాలకు ఐద్వా ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యను కాషాయీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ, మహిళా వ్యతిరేక కార్మిక చట్టాలకు నిరసన తెలుపుతూ తీర్మానాలు ఆమోదించింది. మహిళలకు రుణ హక్కు కల్పించాలంటూ ఓ తీర్మానం, మహిళా సంక్షేమంలో కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ విజయాలను ఆదర్శంగా తీసుకోవాలంటూ మరో తీర్మానానికి అంగీకారం తెలిపింది. వాతావరణ మార్పులు, ఆదివాసీ హక్కులపై పోరాటం, దళిత మహిళలకు సమానత్వం, పాఠశాల పరిరక్షణ, ఆరోగ్య సేవల ప్రైవేటీకరణ అడ్డుకోవడం వంటి తీర్మానాలకు ఆమోద ముద్ర వేసింది.



ఐద్వా జాతీయ మహాసభల్లో పుణ్యవతి, బృందాకరత్, ఇతర నేతలు

ఇంటర్ 'ప్రాక్టికల్స్' ప్రారంభం

- ముందు ఒకేషనల్, 1 నుంచి మిగతా వారికి

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు(ప్రాక్టికల్స్) ప్రారంభమయ్యాయి. జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే.. ఒక బ్యాచ్‌లో 25శాతం లేదా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోగ పరీక్షల్లో 100 శాతం మార్కులు వస్తే వారి పేపర్లను పునఃపరిశీలించాలని అధికారులకు ఇంటర్ విద్యామండలి స్పష్టంచేసింది. ప్రాక్టికల్స్‌పై మార్గదర్శకాలతో కూడిన 'హ్యాండ్‌బుక్'ను విడుదల చేసింది. జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. పరీక్ష నిర్వహణకు 2గంటల ముందు ప్రాక్టికల్స్ ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో కాలేజీలకు పంపుతారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 2 ప్రాక్టికల్స్ జరగనున్నాయి. కాగా, థియరీ పబ్లిక్ పరీక్షలకు ప్రైవేటు కాలేజీల్లోని సిబ్బందినే ఇన్విజిలేటర్లుగా వినియోగించుకుంటున్నారు. చీఫ్ సూపరింటిండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, కస్టోడియన్ ముగ్గురు ఇంటర్ బోర్డు తరఫున అధికారులుగా వ్యవహరిస్తారు. వారి పర్యవేక్షణలో ఆ కాలేజీ సిబ్బంది ఇన్విజిలేషన్ చేస్తారు. కాగా, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇన్విజిలేటర్లుగా జూనియర్ లెక్చరర్లే ఉంటారా? లేక టీచర్లను కూడా వినియోగిస్తారా? అనే దానిపై స్పష్టత రాలేదు.

నకిలీ నెయ్యి సరఫరాలో చిన్న అప్పన్న కీలకం

- హైకోర్టులో సీబీఐ వాదనలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి నకిలీ నెయ్యి సరఫరా, అందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో చిన్న అప్పన్నది ప్రధాన పాత్ర అని సీబీఐ స్టాండింగ్ కౌన్సిల్ పీఎస్‌పీ సురేష్‌కుమార్ హైకోర్టుకు నివేదించారు. కేసు దర్యాప్తు పూర్తిచేసి దిగువ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశామని, సీల్డ్ కవర్‌లో దాన్ని కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. దానిని పరిశీలించి బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని కోరారు. చిన్నఅప్పన్నపై నేరారోపణలకు అన్ని ఆధారాలు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సీబీఐ తనను ఒత్తిడి చేసి వాంగ్మూలం తీసుకుందని గతంలో పిటిషనర్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. కేసు డైరీని కోర్టు ముందు ఉంచాలని సిట్‌ను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా వ్యవహారంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎంపీ, టీటీడీ అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి. నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... చిన్న అప్పన్న మొదటి బెయిల్ పిటిషన్ తిరస్కరణ అనంతరం సీబీఐ దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేసిందని, పిటిషనర్‌ను మరింతకాలం జైల్లో ఉంచాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్



అమరావతి, విజయవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్‌కు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించారు. మహారాష్ట్రలోని షిర్డీలో నిర్వహించిన 18వ జాతీయ మహాసభల్లో... విద్యాసాగర్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ నెల 23 నుంచి 26 వరకు ఘనంగా జరిగిన ఈ మహాసభల ముగింపు సందర్భంగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 29 రాష్ట్రాల నుంచి హాజరైన వేలాది మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమక్షంలో నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. సుమారు 80లక్షల మంది ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే ప్రాధాన్యత కలిగిన జాతీయ ఉపాధ్యక్షుడి పదవి రాష్ట్రానికి దక్కడం పట్ల ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఏపీ ఉద్యోగుల సమస్యలను జాతీయస్థాయిలో బలంగా వినిపిస్తానని చెప్పారు. ఇదే మహాసభల్లో ఏపీ ఎన్జీజీవో సంఘానికి చెందిన డీవీ రమణ, రాజ్యలక్ష్మి, శాంతి జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. విద్యాసాగర్‌కు ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు సుభాష్ లాంబా, ప్రధాన కార్యదర్శి ఎ.కుమార్, ఏపీఎన్జీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జేఏసీ నాయకులు, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

మరో సూపర్ ఆఫర్!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాల్సిన ప్రతి ఇంటికీ కుళాయి పనులు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ పథకాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు సమీక్షలు నిర్వహించారు. పలు దఫాలు కేంద్ర మంత్రులు, కేంద్ర అధికారులతో చర్చించారు. ఉప ముఖ్యమంత్రి స్వయంగా ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రితో సమావేశమై హామీ పొందారు. ఈ క్రమంలోనే జల్‌జీవన్ మిషన్ పనులు కొనసాగించేందుకు ఏపీకి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

నాడు హడావుడి ఎక్కువ.. పనులు తక్కువ..

రాష్ట్రంలో 95.44 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, 2019 ఆగస్టుకు ముందే 31.68 లక్షల ఇళ్లకు అందించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.39.30 లక్షల కనెక్షన్లు మాత్రమే ఇవ్వగలిగింది. సకాలంలో మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో కేవలం ఐదు జిల్లాల్లో మాత్రమే 90 శాతానికి పైగా ట్యాప్ కనెక్షన్లు పూర్తయ్యాయి. ఈ ఐదేళ్లలో ఈ పథకంలోకి సుమారు మూడు లక్షల ఇళ్లు కొత్తగా చేరాయి. పాత టార్గెట్‌తో (28 లక్షలు) పాటు వీటినీ కలుపుకొంటే 31 ఇళ్లకు అందించాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వ అలసత్వం, మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం కారణంగా పనులు ముందుకు సాగలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2027 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత నీరు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

అంతా అడ్డగోలుగా..

అప్పట్లో రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులను గ్రామ జల సంఘాలకు అప్పగించాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. జల్‌జీవన్ మిషన్ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లే లేరని ఒకసారి.. ఉన్నా కొద్దిమందే ఉన్నారని మరోసారి సాకులు చెప్పింది. అర్హత లేకపోవడం వల్ల, అర్హత ఉన్న కొంత మంది కూడా ఇతర పనుల్లో బిజీగా ఉండటం వల్ల టెండర్లలో పాల్గొనలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ.. పంచాయతీరాజ్ శాఖకు అప్పట్లో నివేదించారు. అయితే, జల పథకాలకు సంబంధించి నాడు వైసీపీ చేసిన ప్రయోగాలన్నీ విఫలం కావడంతో పరిస్థితి మొదటికొచ్చింది. జల సంఘాల ముసుగులో ఎన్నికల సమయంలో గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలకు కాంట్రాక్టు పనులు అప్పచెప్పారు. కాగా, ఈ పథకం కింద కేంద్రం ఇచ్చిన నిధులను సకాలంలో ఖర్చు చేయకపోవడం, రాష్ట్ర వాటా చెల్లించకపోవడం, ఈ వాటా చెల్లింపు కోసం నాబార్డు వద్ద తీసుకున్న అప్పును కూడా ఉపయోగించకపోవడం తదితర కారణాల వల్ల కేంద్రం నుంచి జల్‌జీవన్ మిషన్ నిధులు నాడు ఆగిపోయాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.